
చరిత్ర

# ఆంధ్రుల పుట్టు పూర్వోత్తరములు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org
Mobile App: Free Gurukul
email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul
Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ధనసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి.

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ఆంధ్ర

# పుణ్యక్షేత్రములు

## &

## జంబూద్వీపము

★

★

గ్రంథకర్త:

"భారత చరిత్ర భాస్కర"

**పండిత - కోట వెంకటాచలం**

ఆర్య విజ్ఞాన గ్రంథమాల — ప్రచురణము 18

# ఆంధ్రుల
# పుట్టుపూర్వోత్తరములు

గ్రంథకర్త - ప్రకటనకర్త :

" భారత చరిత్ర భాస్కర "

**పండిట్ - కోట వెంకటాచలం**

గాంధినగరం - విజయవాడ - 2

బ్రహ్మాండ సృష్టి విజ్ఞానం, మానవ సృష్టి విజ్ఞానం, కలిశక విజ్ఞానం (మూడు భాగములు) ధ్రువ నివాస ఖండనం, భారతీయ శకములు, గుప్త రాజు లెవరు? అగ్నివంశపు రాజులు, అశోకుని కాలము-నాటియోనరాజులు, కలియుగ రాజవంశములు(తెలుగులో) Chronology of Nepal History Reconstructed, The Plot in Indian Chronology, Chronology of Kashmir History Reconstructed, Indian Eras (In English.)

హక్కులు } కలి 5055 { వెల
గ్రంథకర్తవే } క్రీ. శ. 1955 మార్చినెల

ప్రథమ ముద్రణము 2000 ప్రతులు

★

అంకితము :

**ఆంధ్ర మహా జనులకు**

గ్రంథకర్త.

★

మహారాజ పోషకులు :

| | |
|---|---|
| శ్రీ గాదిరాజు సూర్యనారాయణ రాజు ఈ. వెంకట రాజు గార్లు | రు. 116 |
| శ్రీ లక్కావఝ్ఝల సుబ్రహ్మణ్యంగారి జ్ఞాపకార్థం కుమారులు శ్రీ రామమూర్తి, కృష్ణమూర్తి, కాశీ విశ్వనాథంగార్లు, అవనిగడ్డ | రు. 100 |

రాజ పోషకులు :

| | |
|---|---|
| శ్రీ గొట్టిముక్కల సూర్యనారాయణ రాజుగారు లక్ష్మణేశ్వరం, నరసాపురం తాలూకా, ప. గోదావరిజిల్లా | రు. 50 |

# విషయసూచిక


| విషయము | | | పుట |
|---|---|---|---|
| 1. ఆంధ్రదేశ స్తుతి (అప్పయ్య దీక్షితవాక్యము) | ... | ... | 9 |
| 2. ఆంధ్రులు | ... | ... | 10 |
| 3. చరిత్ర శాస్త్రము కాదు | ... | ... | 11 |
| 4. ఆంధ్రుల పుట్టు పూర్వోత్తరములు | ... | ... | 12 |
| 5. సృష్టి క్రమము | ... | ... | 13 |
| 6. బ్రహ్మావర్త దేశము | ... | ... | 14 |
| 7. బ్రహ్మర్షి దేశము (ప్రథమవలస) | ... | ... | 15 |
| 8. మధ్య దేశము (ద్వితీయవలస) | ... | ... | ,, |
| 9. ఆర్యావర్తము (తృతీయవలస) | ... | ... | ,, |
| 10. నాల్గవ, ఐదవ వలసలు | ... | ... | ,, |
| 11. దక్షిణాపథము (ఆరవ వలస) | ... | ... | 16 |
| 12. యక్షీయ దేశము | ... | ... | 17 |
| 13. దస్యులు | ... | ... | ,, |
| 14. భారత వర్షము | ... | ... | 18 |
| 15. ప్రాచీన భారత వర్షము | ... | ... | 19 |
| 16. అనులోమ, విలోమ శాఖలు | ... | ... | 20 |
| 17. శక, యవనాది శాఖలు | ... | ... | 21 |
| 18. మ్లేచ్ఛార్యుల ప్రపంచ వ్యాప్తి | ... | ... | 24 |
| 19. ఆర్యుల భరత ఖండ వ్యాప్తి | ... | ... | 26 |
| 20. ఆంధ్ర దేశము | ... | ... | ,, |
| 21. రాజ నామముచే పిలువబడిన దేశములు | ... | ... | 28 |
| 22. ఆర్యుల కురువర్ష నివాసము | ... | ... | 33 |
| 23. ఆంధ్రరాజు కాలము | ... | ... | 34 |
| 24. ఆర్యాంధ్రులు | ... | ... | 35 |
| 25. మగధ రాజ వంశములు | ... | ... | 37 |
| 26. శాతవాహనులు | ... | ... | 38 |
| 27. ఆంధ్ర చక్రవర్తులు | ... | ... | 40 |
| 28. కదంబవంశపు రాజులు ఆంధ్రులు | ... | ... | 45 |

| | | | | |
|---|---|---|---|---|
| 29. శైవ మత వ్యాపకులు | ... | ... | | 48 |
| 30. వీర శైవ మతము | ... | ... | | 51 |
| 31. రాజ పుత్రులు | ... | ... | | ,, |
| 32. కాణ్వశాఖవా రాంధ్రులు | ... | ... | | 53 |
| 33. ఆర్య శాఖలు | ... | ... | | 57 |
| 34. మ్లేచ్ఛులుగా పరిగణింపబడిన శాఖలు | ... | ... | | ,, |
| 35. విశ్వామిత్రుని- ఆతని కుమారుల- గాథ | ... | ... | | 60 |
| 36. ప్రవరాంతరము | ... | ... | | 63 |
| 37 భార్గవ గోత్రజు డైన శునశ్శేఫుడు | ... | ... | | 65 |
| 38. ఆంధ్రోత్పత్తిని గురించిన అపవాద నిరాసము | ... | ... | | 66 |
| 39. అంధకులే ఆంధ్రు లనెడి వాద నిరాసము | ... | ... | | 75 |
| 40. అంధక వంశము | ... | ... | | 76 |
| 41. అశ్మక మూలకులు | ... | ... | | 79 |
| 42. అశ్మక, మూలకుల వృత్తాంతము | ... | ... | | 81 |
| 43. ఆంధ్రము, తెలుగు వేరు కావు | ... | ... | | 84 |
| 44. సారాంశము | ... | ... | | 85 |
| 45. జంబూద్వీపము-దాని విభాగములు | ... | ... | (1) | 87 |
| 46. భూగోళ స్థిత జంబూద్వీపము | ... | ... | (3) | 89 |
| 47. జంబూద్వీప నవవర్ష విభాగము | ... | ... | (7) | 93 |
| 48. ప్రాచీన వర్ష విభాగములో చేరిన ప్రదేశములు | ... | ... | (12) | 98 |
| 49. అమెరికాలో రాక్షసుల అస్థిపంజరాలు | ... | ... | (17) | 102 |
| 50. గ్రంథ సమాప్తి | ... | — | (18) | 103 |


## ముఖ్యగమనిక

**47**వ పుటలో చివరగల శ్లోకము ఈ గ్రంథమున 9వ పుటలో కూడ ఉదహరింపబడినది. ఇందు రెండు పాఠములు గలవు. అందు 9వ పుటలో ఒక పాఠమును 47వ పుటలో రెండవపాఠమును ఇచ్చియుంటిమి. కాని 9వ పుటలోని పాఠము సమంజసముగా నున్నదని తోచుచున్నది.

# అభిప్రాయము

[ప్రఖ్యాత చరిత్రవేత్తలగు మహోపాధ్యాయ, కళా ప్రపూర్ణ, స్వర్గీయ, చిలుకూరి నారాయణరావుపంతులుగారు, యం.ఏ., పి. హెచ్.డి., యల్.టి. అనంతపురం,గారిచే ది14-10-50న ఆర్యవిజ్ఞానగ్రంథములమీద చేయబడినసమీక్ష.]

ఇంతవరకును భారతదేశ చరిత్ర నిర్మాణము పాశ్చాత్యుల వ్రాతల కనుకరణముగా మాత్రముండి అదియే మన విద్యాలయము లలో విద్యార్థులకు బోధింపబడుచుండుటచేతను, చరిత్రను బోధించు ఉపాధ్యాయులు చరిత్రను గ్రుడ్డిపాఠముగా బోధించుచుండుట చేతను, తాము బోధించు విషయములనుగూర్చి తగిన విమర్శలేక గతానుగతిక ముగా చరిత్ర విద్యాబోధ సాగుచుండుటచేతను సత్యమైన దేశచరిత్ర మనకింకను లభింపలేదు. ఇంగ్లీషు డిగ్రీలను సంపాదించిన విద్యాధికులు తగిన పరిశీలనలేక వ్రాసిన పాశ్చాత్యచరిత్ర గ్రంథములే ఉపాధ్యాయులకాశ్ర యము లగుచున్నవి. భారతదేశ చరిత్రనుగూర్చిన పరిశోధనలలో విద్యా ధికులైనవారు వ్రాసిన వ్రాతలలో పరస్పరపొందిక కానవచ్చుటలేదు. ఇది యిట్లుండగా చరిత్ర నిర్మాణమునకు వలయు మూలగ్రంథములు, శాసనాదికములుగాక అనాదిగా సంప్రదాయసిద్ధముగా వచ్చుచున్న పురాణములమీంది దృష్టిని పాశ్చాత్యులు గర్హించి యుండుటచే వానిపై మనవారికిని ప్రమాణదృష్టి తప్పినది. అయినను ప్రాచీన గ్రంథముల నామూలాగ్రముగా పరిశోధించి అందలి సత్యములకును యితరాధారము లకును సమన్వయమును కల్పించి సిద్ధాంతముల నేర్పరుపగల ధీశాలులు ఆంగ్ల విద్యాధికులు కానివారు దేశమున లేకపోలేదు. అట్టి వారిలో ఆంధ్రులలో అగ్రస్థానమును వహింపగలవారు : బెజవాడ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ కోట వెంకటాచలం పంతులుగారు. వీరితో నాకు మూడేండ్ల నుండియు ద్వార పరిచయమేగాక స్నేహముకూడ నేర్పడినది. భారతీయ విజ్ఞానము, భారతీయులచరిత్ర, భారతీయుల సాంప్రదాయములనుగురిం చిన సత్యములను లోకమున కెరుకచేయ వీరు చేయుచున్న కృషి అపా రము, అగాధమునైనది. పౌరాణిక విజ్ఞానమునంతటిని అవలోడనముచేసి మనను పాఠకులకు సులభముగా అవగాహన మగునట్లు శ్రీ వెంకటా చలంగారు వ్రాసిన 'కలిశకవిజ్ఞానము' మూడుభాగములు 'ఆంధ్రులెవరు?' ,ఆర్యుల ధ్రువనివాసఖండనము' 'మానవసృష్టి విజ్ఞానము' మొదలయిన

గ్రంథములను చదివి ఆనందించగల భాగ్యము నాకు లభించినది. శ్రీ వెంకటాచలంగారు పర్గిటరు వ్రాసిన "The Dynasties of the Kali Age" అను గ్రంథములో తెలియక చేసిన పొరబాట్లనేకములను సవరించి పర్గిటరు తానాధారపడిన ఆపురాణములనుండియే వివిధ భాగముల నుద్ధరించి చక్కగా వ్యాఖ్యానించి పర్గిటరుచేసిన ప్రమాదపూరితములైన నిర్ణయములను సవరించి సత్యమును ప్రకటింపగలిగిరి. కలికాల విజ్ఞానమును సమస్తాంధ్రులును పఠించి తీరవలయుననినా అభిప్రాయము. అట్లే మనము నివసించు జంబూద్వీప విభాగనిర్ణయములో శ్రీవారు చేసిన నిర్ణయము సర్వథా గ్రాహ్యముగా నున్నది. 'ఆంధ్రులెవరు?' అనువ్యాసము యింతకుపూర్వము చరిత్రకారులందరును త్రొక్కిన త్రోవను త్రొక్కక క్రొత్తదృక్పథమును ప్రదర్శించుచున్నది. ఆంధ్రుల నిజస్వరూప మిట్టిదని శ్రీ వెంకటాచలంగారి గ్రంథము నిరూపించినది. 'ధ్రువనివాస ఖండన'మను గ్రంథము శ్రీతిలక్ గారు రచించిన "The Arctic Home" అను ఇంగ్లీషు గ్రంథములోని విషయములకు సప్రమాణమైన విమర్శపరమైయున్నది. శ్రీతిలక్‌గారి గ్రంథములోని పాండిత్య విలంబమునకు వేదవిజ్ఞానపు లోతు తెలియని పురాణపండితులు ముగ్ధులై జేజేలుపెట్టుచుండ అది కాదని అనేక ప్రమాణములతో నిరూపింప సాహసించి నిలిచిన ధీరు లింతవరకును శ్రీ వెంకటాచలంగారొక్కరే. "భారతీయశకము" లనెడి పేరిగ్రంథము చరిత్ర నిర్మాణమున కత్యంతోపయుక్తమైనది. వివిధ శకకాలములలో యిదివరకుండిన పొరబాట్లను చూపుచు సరియైన కాలనిర్ణయములు సప్రమాణముగా యిందు నిరూపింపబడినవి. లోకములో ప్రబలముగ వ్యాపించిన అసత్య సిద్ధాంతముల నరికట్టి సత్యచరిత్ర నిరూపణమునకు కంకణము కట్టిన శ్రీవెంకటాచలంగారి పాండిత్య గౌరవ మసాధారణమైనదని చెప్పుట కెట్టి సందేహమును లేదు. ఈశ్రేణిలో శ్రీవారు వ్రాసిన గ్రంథము లెన్నియో గలవు. అవన్నియు సచిరకాలములో ప్రకటితములై ఆంధ్రులలో చరిత్రవిజ్ఞానవ్యాప్తికి తోడ్పడగలవని విశ్వసించుచున్నాను.

అనంతపురము.
14–10–1950.

ఇట్లు,
**చిలుకూరి నారాయణరావు వ్రాలు**
మహోపాధ్యాయ, విద్యాప్రపూర్ణ
**M. A., P. H. D., L. T.,**


# పీఠిక

లోగడ ఈ గ్రంథకర్తచే వ్రాయబడి ప్రకటింపబడిన "ఆంధ్రులెవరు?" అనెడి చిన్నగ్రంథము దేశమంతయు వ్యాప్తి చెందినది. దానిని చదివినవారలు "ఆంధ్రుల" సత్య చరిత్రను తెలిసికొని ఆనందించి యుండిరి. ఆంధ్రదేశములోనిపలుతావులనుండి ఆగ్రంథము కావలయునని జాబులు వచ్చుచున్నవి. కాని గ్రంథములలో చాలభాగము ఉచితముగానే వ్యయపఱుపబడినందున గ్రంథములన్నియు అయిపోయినవి. తిరిగి దానిని రెండవసారి ముద్రించ ప్రయత్నించుచున్నంతలో కొందరు మిత్రులు లోగడ గ్రంథము ఇతరులచే ఆంధ్రులనుగుఱించి వ్రాయబడిన అప్రామాణిక విషయముల నెత్తికొనుటతో ప్రారంభమై వానిని ఖండించుట కేర్పడిన ఖండన గ్రంథముగా నున్నదనియు, అట్టి స్థితిని మార్చి ఆంధ్రులయుత్పత్తి మొదలుకొని వ్రాసి అందు ఇతరుల దురభిప్రాయములకు జవాబు వ్రాసిన బాగుండుననియు నభిప్రాయపడి యుండుటచే సృష్ట్యాదినుండి ప్రారంభించి "ఆంధ్రుల పుట్టుపూర్వోత్తరములు" అను పేరున ఈగ్రంథము వ్రాయబడినది. సృష్ట్యాదియందు 'ఆర్యులు' అనెడి సంజ్ఞతో దేవ, మానవాది వర్గములు బహిర్గతమైనవి. అందు దేవతాది వర్గములు వారివారి కేర్పడిన ఊర్ధ్వలోకములందు నివసించిరి. మానవవర్గము ఈ లోకమున నివసింపజేయబడి ఆర్యులను నామముననే వ్యవహరింపబడినది. పిదప స్వాయంభువమనువు ఉత్పత్తి బొందించి, పోషించి, పాలించి, భరించినందున అతనికి 'భరతుడను' అను పేరు కలిగినది. "భరణాచ్చ ప్రజానాం వై మనుర్భరత ఉచ్యతే." (ప్రజలను భరించినందున మనువు భరతుడని చెప్పబడుచున్నాడు.) అని మత్స్య, వాయు పురాణములు చెప్పుచున్నవి. 'భరతుడ'నెడి ప్రసిద్ధ నామమును వహించిన మనువుచే సృష్ట్యాదికాలమున పరిపాలింపబడుటచేతను, ఆ భరతుడే భూలోకములో ప్రథమరాజగుటచేతను రాజనామమున మనదేశమునకు 'భారతవర్షము' అనియు-అందు నివసించెడి ఆర్యులకు 'భారతుల'నియు-పేరులు కలిగినవి. పిమ్మట 'నాభి' యనెడి రాజు వలన 'అజనాభ' మనియు అటుపిమ్మట వారల ఋషభుని కుమారుడగు 'భరతుని' వలన భారతవర్షమనియు పేరొందినది. అట్టి యీ మన భారత

వర్షమే ప్రథమమున ఆర్య్యులనెడి మానవజాతి ఉత్పత్తిని బొంది నివసించిన స్థలము. అందువలననే ఈ భారతవర్షమునకు 'ఆర్యావర్త'మను పేరు కలిగినది. మానవజాతి నివసించుటకు ప్రథమస్థానముగా దేవతలచే నిర్దేశింపబడినందున భారతవర్షము 'ఆర్యావర్తః పుణ్యభూమిః' అను సార్థకనామము నందినది. అట్టి పుణ్యభూమి యైన భారతవర్షమున ఆర్య్యులు పుట్టి క్రమక్రమముగా భారతవర్షమందంతటను వ్యాపించి నివసించిరి. అట్లు వ్యాపించిన ఆర్య్యులలో బంగాళారాష్ట్రమున ఉత్తరపు హద్దునుండి మద్రాసుపట్టణమునకు దక్షిణపు సరిహద్దువఱకు వ్యాపించిన ఆర్య్యులు ప్రాచ్యదేశీయు లనియు, వారు నివసించిన భూమి 'ప్రాచ్యకరాజ్య' మనియు పిలువబడినది. కాలము గడచుచురాగా ఒకానొక కాలమున అట్టి ప్రాచ్యక రాజ్యము నేలెడి రాజు 'బలి' యనువాని కుమారు లాదేశము నాలుభాగములుగ చేసి పంచుకొని తమపేరుల నాదేశ భాగముల కుంచి పరిపాలించిరి. వారు పంచుకొనునాటి కందు చాతుర్వర్ణ్యస్థులగు ఆర్య్యులును, వారి ననుసరించి యుండిన అంతర్వర్ణశాఖలును గలవు. ఆంధ్రరాజు తనభాగమునకు 'ఆంధ్రదేశ'మని పేరుపెట్టియుండెను. దేశనామమునుబట్టి ప్రాచ్యదేశీయు లని పిలువబడెడి ఆర్య్యజాతివారందరు నూతనదేశనామముచే 'ఆంధ్రులు' అనెడి నామాంతరమును బొందిరి. అదేవిధమున వారి భాషయైన తెలుగు భాష 'ఆంధ్రభాష' యనెడి నామాంతరమును బొందినది. కనుక ఆంధ్రుల చరిత్ర యనగా ఆర్య్యుల చరిత్రయే యైయున్నది. వీరలే కాదు-ప్రపంచములో నేజాతివారైనను-సత్యమైన తమ యుత్పత్తి చరిత్ర వ్రాసికొనవలయునన్నను ఆర్యావర్తమున 'ఆర్య్యుల' యుత్పత్తిచరిత్రతోడనే ప్రారంభించి తమ శాఖ చీలి నామాంతరాదికమునొందువఱకు వ్రాసికొనవలసియుండును.

విజయవాడ
15-2-1955

ఇట్లు,
గ్రంథకర్త.



AUTHOR:

KOTA VENKATACHALAM

"ఆంధ్రత్వ మాంధ్రభాషా చ
ఆంధ్రదేశ వ్యవస్థితిః
తత్రాపి యాజుషీ శాఖా
నాల్పస్య తపసః ఫలం ॥"

(అప్పయ్య దీక్షితః.)

తా॥ ఆంధ్రుడుగాను, ఆంధ్రభాష మాతృభాషగలవాడుగాను జన్మించుట, ఆంధ్రదేశ నివాసి యగుట, అందును యజుశ్శాఖకు చెందిన వాడగుట అల్పతపస్సువలన లభ్యమగునది కాదు. అనగా గొప్ప తపస్సు చేసినవానికే లభ్యమగునని తాత్పర్యము.

(అప్పయ్య దీక్షితులు.)

# ఆంధ్రులు

సృష్ట్యాదియందు "ఆర్యజాతి"తప్ప వేరుజాతి లేదు. ఆర్యులు భారతవర్షమంతటను వ్యాపించి నివసించియుండిన కాలములో నాయా దేశభాగములను పరిపాలించిన రాజులపేరున ఆయా దేశములు పిలువ బడినవి. అట్టి దేశములలో నివసించిన ప్రజ లాయా దేశనామములచే పిలువబడ జొచ్చిరి. అట్లు పిలువబడిన పేర్లతో వారే వేరువేరు జాతులుగా గుర్తింపబడి యుండిరి.

ఆర్యులు దేశవ్యాప్తము నొంది నివసించియుండిన పిమ్మట ఒకానొక కాలమున తూర్పుభారతవర్షము "ప్రాచ్యకదేశ" మని పేరు గలిగి "బలి" యనెడి రాజుచే పరిపాలింపబడుచుండెనది. ఆతని కుమారులా దేశమును విభాగించుకొని తమపేర్లతో నాదేశభాగములకు పేరులుపెట్టి యేలిరి. వారిలో "ఆంధ్రరాజు" పరిపాలించిన భాగమునకు "ఆంధ్రదేశ" మని పేరు పెట్టబడినది. ఆదేశమున నివసించుచుండిన చాతుర్వర్ణ్య ఆర్య ప్రజలు నాదేశముపేరున "ఆంధ్రులు" అని పిలువబడిరి. ఆర్యజాతియే ఆంధ్రజాతి యని పిలువబడినది. అది వేరుజాతి కాదు. ఆంధ్రుల పుట్టు పూర్వోత్తరములలో సృష్ట్యాదినుండి "ఆంధ్రు"లను పేరు వచ్చువరకు ఆంధ్రుల చరిత్ర ఆర్యుల చరిత్రయే గాని వేఱు కాదు. అందువలన సృష్ట్యాది లగాయతు గల ఆంధ్రులచరిత్ర ఆర్యుల పేరుమీదనే చెప్ప బడును. దానిని ఆంధ్రులచరిత్రగానే తీసికొనవలయునుగాని అది ఆంధ్రులకంటె వేఱుగాగల ఆర్యులచరిత్ర యని భ్రమింపగూడదు. 'ఆంధ్రులు' ఆర్యులేగాని యితరులు కారు. ఒకేజాతివారు ప్రారంభములో "ఆర్యు" లనియు, కొంతకాలమునకు వారే దేశనామముచే "ఆంధ్రు"లనియు పిలువబడిరి. వారు రెండు జాతులవారు కారు. ఏకజాతీయులైయున్నారు. ఇదేప్రకారము భారతవర్షములోని వివిధ రాష్ట్రములందు నివసించెడి ఆర్యులను ఆయాదేశనామములచే వివిధ శాఖలుగానై వివిధ జాతులుగా పరిగణింపబడుచుండిరి. కాని ఆసేతుహిమాచలముగా గల ఆర్యులందరు ఏకజాతీయులైన ఆర్యులే యైయున్నారు. ఈవిషయము మనసునందుంచు

కొని ఈగ్రంథమును చదివిన "ఆంధ్రుల పుట్టుపూర్వోత్తరము" లేవియో వివరముగా సృష్ట్యాదినుండియు తెలియగలవు.

"చరిత్ర" శాస్త్రము (Science) కాదు.

చరిత్ర యనున దొక శాస్త్రము (Science) కాదు. అది యొక కళ (Art). నియమితమైన కొన్ని సూత్రములచే బద్ధమై పఠనపాఠనములచే అధ్యయనము చేయవలసినదై యుండునది "శాస్త్రము." ఇతరులు చేయుచుండిన పనులను చూచి వానిననుకరించి చేయుచు నేర్వదగిన దానికి "కళ" యని పేరు. కాలప్రభావముచే సంభవించుచు ప్రత్యక్షమగుచుండిన విషయములను, చూచినది చూచినట్టు గ్రంథస్థము చేయదగిన "కళకు" "చరిత్ర" యని పేరు. ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద ప్రమాణములచే నిరూపింపబడునట్టిది "శాస్త్రము." జరుగుచుండిన విషయములను చూచి తెలిసికొనదగినది "కళ". "చరిత్ర" కళ యనిపించుకొనును గాని "శాస్త్రము" కానేరదు. అందువలన భారతీయుల శాస్త్రములలో చరిత్రకు స్థాన మిచ్చుట కవకాశము లేకపోయినది. అది కళలలో చేర్చబడినది. "కళాహ్యానంతాః" అను వచనమునుబట్టి అది యనంతమగు కళలలో నొకటిగా పరిగణింపబడినది.

భారతీయ వాఙ్మయమున చరిత్రకు స్థానము లేదనుట పొరబాటు. లోకములో జరిగిన విషయములను చూచినవాటిని చూచినట్లు వివరించుట యనెడి అల్పవిషయ మొక గొప్పశాస్త్రముగా పరిగణింపబడుట అజ్ఞలక్షణము. భారతీయుల పురాణేతిహాసము లన్నియు వివిధకాలములలో జరిగిన చరిత్రలనే చెప్పుచున్నవి. జరిగిన చరిత్రను జరిగినట్లు, చూచినదానిని చూచినట్లు, తాను వినినదానిని వినినట్లు, తాను పూర్వచరిత్రలవలన తెలిసికొనినదానిని తెలిసికొనినట్లు లిఖించుటకు తన ఊహాపోహలతో నిమిత్తము లేదు. లోకమున సంభవించు సంభవములొక నిర్ణీత పద్ధతి ననుసరించి కాని, కొన్ని సూత్రములకు బద్ధమై కాని జరుగవు. అందు చరిత్రకారుని కెట్టి సంబంధము లేదు. చరిత్రకారుని

ఊహాలు గాని, సిద్ధాంతములు గాని జరుగుచుండిన లేక జరిగిపోయిన సంభవములమీాద పనిచేయనేరవు.

చూచినది చూచినట్లు, విసినది విన్నట్లు, ప్రాచీనచరిత్రలలో తాను పఠించినది పఠించినట్లు నిబంధించుటయే చరిత్రకారుని ధర్మము. తనకు తెలియనిది తెలియనట్లు, సందిగ్ధ విషయములు తనకు సందేహము లున్నట్లు స్పష్టపరచి చెప్పుటయే ఉత్తమ చరిత్రకారుని లక్షణము. అట్లుగాక ముందుగా తానొక నిర్ణయము చేసికొని తన నిర్ణయమును సమర్థించుకొనుట కనుకూలముగా ప్రాచీన చరిత్రలను వ్యాఖ్యానించుటయు, అందు కనుకూలముగా నుండులాగున అసత్యకల్పనలు చేసి యతికించుటయు, తన ఊహాపోహాలతో గూడిన సందేహ వాక్యములతో చారిత్రక కాలములను, విషయములను ఒకనిర్ణయమునకు దెచ్చి అదియే సత్యచరిత్ర యనిప్రచారించుటయు మొదలగునవి చరిత్రకారులకు ప్రతిష్ఠనీయజాలవు. కాలక్రమమున అట్టివారివ్రాతలు లోకమువలన నిరసింపబడి విసర్జింపబడగలవు.

# ఆంధ్రులపుట్టుపూర్వోత్తరములు

ఒకదేశముయొక్క గాని, జాతియొక్క గాని చరిత్ర వ్రాయుటకు ప్రాచీనకాలమునుండి వచ్చుచుండిన సంప్రదాయముగాని (Tradition) లేకవ్రాతమూలకమైన పూర్వచరిత్రగాని ఆధారముగా నుండవలెను. అట్టిదేమియు లేక కేవలమొక మనుష్యునియొక్క ఊహాలు, కల్పనలు, నమ్మకములు, సంభావ్యతలు ( Probabilities or possibiltiies ) మొదలగువానితో వ్రాయబడినవి సత్యమైన చరిత్రలు కాజాలవు. అవి కల్పనాకథ లనిపించుకొనును.

ఏదియో యొక వార్తను విని దానిని తనయూహాలతోను, కల్పనలతోడను పెంచి ప్రస్తుతము తన యనుభవములోగల యొకవిషయమున కదుకుపెట్టి తాను మొదట వినిన వార్తయొక్క యథార్థ చరిత్ర యిదియేయని గ్రంథములల్లి లోకములో ప్రకటించినంతమాత్ర

మున అది యథార్థ చరిత్ర యనిపించుకొనదు. అది చరిత్రకు ద్రోహము చేయుట యగును.

ఇప్పుడు పాశ్చాత్య ప్రాచ్య చరిత్రకారులచే వ్రాయబడిన ఆధునిక భారతదేశచరిత్ర లనున వన్నియు వారివారి యూహా కల్పిత ములై యున్నవి. అందు సత్య మావంతయును కానరాదు.

మానవజాతి మధ్యాసియాయందు పుట్టి భూగోళమంతటను వ్యాపించిన దనెడి వాదము పాశ్చాత్యచరిత్రకారుల యూహాపోహలతో కల్పింపబడినది గాని దానికి పూర్వచరిత్రాధార మేమియు లేదు. ఒకచరిత్రకారుని యూహా మరియొక చరిత్రకారుని యూహకు ప్రమాణమై తాము ముందుగా నిర్ణయించుకొనిన యొక నిర్ణయమున కను కూలముగా నుండునట్లు పర్యవసానము తేల్చబడి లోకమున ప్రచారము చేయబడినది. చిరకాలము వినగావినగా అదియే సత్యమైన చరిత్ర యని లోకులు భ్రమించి దాని ననుసరించి చరిత్రలు వ్రాసికొనుచుం డిరి. పాశ్చాత్యులచే వ్రాయబడిన అట్టి కల్పితకథలే భారతదేశచరిత్ర కాధారభూతమై తదనుసారముగా నాధునిక చరిత్రలు వ్రాయబడి మనకు పాఠశాలలలో నేర్పబడుచున్నవి. వీనిని విసర్జించి మనము మనవాఙ్మయాదుల ననుసరించి యథార్థచరిత్రలను వ్రాసికొనుట అత్యావశ్యకము.

## సృష్టిక్రమము

ఇప్పటి సృష్ట్యాదియందు ప్రకృతినుండి స్వాభావికముగా పంచ భూతములును, అందు భూమినుండి ఓషధులును, ఓషధులనుండి సర్వ భూతకోటియు దేవమానవాదివర్గములు క్రమక్రమముగా నుద్భవించి నవి. అందు మొదట వచ్చినది ప్రజాపతి. ఇతడు ప్రథమ ఆర్యుడని ఋగ్వేదము 4-26-2-2; 2-11-18 ఋక్కులయందు వినబడుచున్నది. ప్రథమ ఆర్యుడైన స్వాయంభువప్రజాపతి మానవసృష్టిని జేయబూని వసిష్ఠాదులైన పదిమంది ప్రజాపతులను (వీరికి దేవఋషులని పేరు)

సృజించెను. పిమ్మట స్వాయంభువప్రజాపతి భూమిమీద మానవసృష్టిని జేయబూని భారతవర్షమునగల సరస్వతీ, దృషద్వతీనదుల మధ్యస్థనమైన భూమియందు ప్రథమమున నివసించి 'శతరూప' యను భార్యతో కలిసి ప్రియవ్రత, ఉత్తానపాదులనెడి యిద్దరు కుమారులను, ఆకూతి, దేవహూతి, ప్రసూతు లనెడి ముగ్గురు కుమార్తెలను కనెను. అతడు ప్రథమమున నివసించిన భూమి "బ్రహ్మావర్త" మని పిలువబడుచున్నది.

## బ్రహ్మావర్తదేశము

మానవజాతి మొదట భారతదేశముననే యుత్పత్తిని బొందినది. ఇప్పుడు భారతదేశమునగల యమునానదికి పశ్చిమమున 'సరస్వతీ' నదియు, దానికి పశ్చిమమున 'దృషద్వతీ' యనెడి దాని యుపనదియు నుండెడివి. ఈ సరస్వతీ, దృషద్వతీ నదులమధ్యగల ప్రదేశము 'బ్రహ్మావర్త'మని అనాదికాలమునుండియు పిలువబడుచుండెడిది. 'బ్రహ్మావర్త'మనగా బ్రహ్మ యను పేరుగల స్వాయంభువ ప్రజాపతి మానవజాతిని భూమిమీద నిలుపుటకు ఆదికాలమున స్థూలదేహధారియై నివసించిన స్థలము.

ప్రతిసృష్టియందును ఆదిమానవుడైన 'స్వాయంభువ' ప్రజాపతి స్థూలదేహధారియై మానవసృష్టినిమిత్త మెచ్చటఆవర్తమును బొందుచు నివసించుచుండునో అట్టిదేశము "బ్రహ్మావర్తమని" అనాదికాలము నుండియు దేవతలచే పిలువబడుచుండినది. ఋగ్వేదమున వినబడిన "యోనిం దేవకృతమ్" (ఋగ్వే 3-33-4) దేవతలచే చేయబడిన మానవజాతి జన్మస్థానము అనువాక్యమును మనువు తన మనుస్మృతి యందు "తం దేవనిర్మితం దేశం" (అనగా దేవతలచే ఏర్పాటుచేయబడిన ఆప్రదేశము) అనివివరించి దాని హద్దులను కూడ ఇచ్చియున్నాడు. (మను 2-17) తూర్పు-సరస్వతీనది, దక్షిణము సరస్వతీదృషద్వతీనదుల సంగమస్థలము పడమర దృషద్వతీనది ఉత్తరము హిమాలయపర్వతము లలో సరస్వతీ, దృషద్వతీనదుల జన్మస్థలముల వఱకు.

## బ్రహ్మర్షి దేశము (ప్రథమవలస).

అట్టి బ్రహ్మావర్త దేశమందు పుట్టి "ఆర్యులు" అనబడు మానవజాతి తాము జన్మించిన "బ్రహ్మావర్త" దేశము వదలి దానికి పశ్చిమమున గల ప్రదేశములందు నివసించి దానికి (మను 2-19) బ్రహ్మర్షి దేశమని పేరిడిరి. ఈవలసలను విశేషముగా మహాతపశ్శాలులైన బ్రహ్మర్షులు నడిపి వారలే వారి శిష్యప్రశిష్యులతో అచ్చట నివసించి యుండుటవలన దానికి బ్రహ్మర్షి దేశమనెడి నామము సార్థకమైనది. ఈప్రదేశమున ఇటీవల కురుక్షేత్రము, మత్స్యదేశము, పాంచాలము, శూరసేనము, ఉత్తరమథుర యనుపేర్లతో రాష్ట్రము లేర్పడినవి.

## మధ్య దేశము (ద్వితీయవలస).

వింధ్యపర్వతము, హిమాలయపర్వతముల మధ్యయందు ప్రయాగకు (అలహాబాదు) పడమరగా సరస్వతీనదివరకుగల ప్రదేశమంతయు "మధ్యదేశము" అనిపిలువబడుచుండినట్లు మనువు చెప్పుచున్నాడు. (మను. 2-21.) బ్రహ్మఋషిదేశము నిండిన పిమ్మట రెండవ వలసలో వెడలిన ఆర్యసంతానము ఈమధ్యదేశమున నివసించిరి.

## ఆర్యా వర్తము (తృతీయవలస).

అటుపిమ్మట ఆర్యజాతీయులు మహర్షుల యనుజ్ఞవలన వారి రాజుల నాయకత్వమున మూడవ వలసగా బయలుదేరి వింధ్యహిమాచలములకు మధ్యనుండు భూప్రదేశ మందంతటను వ్యాపించి స్థిరనివాసము లేర్పరచుకొనిరి. ఆనాటికి భూగోళమంతయు నిర్మానుష్యముగా నుండి యున్నది. భారతవర్షములోగూడ నిప్పుడు మనవిచారణ యందుండిన ఆర్యజాతీయులు తప్ప యితరమానవు లెవ్వరును లేరు.

## నాలవ, ఐదవ, వలసలు

అటుపిమ్మట విదేహమాధవు డనెడి రాజు తన గురుదేవుడైన గౌతమరహూగణుని ప్రేరణమున నానాటికి వృద్ధినిగాంచుచుండిన

ఆర్యజాతీయుల వెంట నిడికొని బ్రహ్మావర్తాది ప్రదేశములనుండి యొక గొప్ప వలసను బయలుదేరదీసి సరస్వతీనదికి తూర్పుగా గంగానదివఱకు బోయి అచ్చటచ్చట ఆర్యనివాసముల నేర్పాటుచేసి యుండిరి కాని అచ్చట "సదానీరా" అనెడి యొక నది అడ్డముగాగా ఆవలస నంతటితో నిలిపి అంతవఱకు వచ్చిన పొడుగునను, గ్రామముల, పట్టణముల నిర్మాణ మొనర్చిరి. సదానీరా నదికావల ప్రదేశము నివాసయోగ్యము కానందున దానిని నివాసయోగ్యముగా చేయుటకు తగిన యేర్పాట్లు చేసి తిరిగి పశ్చిమముగా వెళ్లి గంగా, యమునా, సరస్వతీ, దృషద్వతీ నదులను దాటి ఉపనదులతో గూడిన సింధునదిని దాటి పశ్చిమమున సింధునది కుపనది యగు 'కుభా' (అనగా కాబూలు నది) నదీతీరముల వఱకు తమ వలసలను విస్తరింప జేసి యుండిరి. ఈ వివరములు ఋగ్వేదముశతపథబ్రాహ్మణము, మనుస్మృతి మొదలగు వానియందు సవిస్తరముగా వివరింపబడి యున్నవి.

"ఆర్యాః అత్ర ఆవర్తంతే పునః పున రుద్భవంతి ఇతి ఆర్యావర్తః." ఆర్యు లెచ్చట పుట్టి, పెరిగి, చచ్చి, తిరిగి పుట్టుచుందురో అది ఆర్యావర్త మని చెప్పబడుచున్నది. దీనిని బట్టి ఆర్యులు ఈప్రదేశ మందుననే సృష్టి ప్రారంభము నుండి పుట్టి నివసించుచుండిరని మనుస్మృతి యందు స్పష్టము చేయబడినది. (పాశ్చాత్యు లూహించినటుల ఆర్యులు మధ్యాసియా యందు పుట్టి భారతవర్షమునకు వలస వచ్చిరనుట కేవలము వారి కల్పనయే గాని పూర్వచరిత్రలవలన ధ్రువపరచ బడినది కాదు.)

### ద క్షి ణా ప థ ము (ఆఱవ వలస)

అటుపిమ్మట ఆర్యుల దృష్టి వింధ్యపర్వతములకు దక్షిణముగా గల ప్రదేశములమీదకు ప్రసరించినది. ఆనాడు దక్షిణదేశమంతయు నిర్మానుష్యముగా నుండినది. ఆర్యులు 'సదా నీరా' ప్రాంతప్రదేశము నంతను మానవ నివాసమున కనుకూలముగా నొనర్చి పిమ్మట తూర్పున

గల వంగదేశప్రాంతములమీదుగా దక్షిణమునకు క్రమక్రమముగా వ్యాపించిరి. అనేక సంవత్సరములు గడచుచుండగా అట్లు ఆర్యులు వ్యాపించిన భారతవర్షపు తూర్పుదక్షిణములగల (అనగా ఇప్పటి మద్రాసు దిగువ వఱకు) ప్రదేశము "ప్రాచ్యకదేశ" మని పిలువబడినది. దానికి దక్షిణముగా దక్షిణసముద్రమువఱకు గల దేశము దక్షిణదేశమయ్యెను. ఆరెంటికి పశ్చిమముగా గల పశ్చిమకోస్తాప్రదేశము పశ్చిమదేశ మయ్యెను. అదేవిధమున ఆర్యులు "దక్షిణాపథ" మంతయు నాక్రమించి వృద్ధిపొందిరి. ఆసేతుహిమాచలముగా గల దేశమునంతను ఆక్రమించిన ఆర్యులు వైదిక ధర్మావలంబులై చాతుర్వర్ణ్య వ్యవస్థ గలిగి యుండిరి.

## య జ్ఞి య దే శ ము

నల్లచారలుగలలేడి స్వాభావికముగా ఎచ్చట పుట్టి చరించుచుండునో ఆదేశము "యజ్ఞియదేశ" మని తెలియవలెను. అంతకు ఇతరమైన దేశము మ్లేచ్ఛ దేశమని తెలియవలెను. అని మనువు చెప్పుచున్నాడు. నేటి భారతవర్షమందంతటను (ఇంకను ఉత్తర ఆఫ్రికా, అమెరికాలో కొన్ని భాగములలోను) నల్లచారలుగల లేడి స్వాభావికముగా పుట్టి సంచరించుచున్నది. అందువలన ఈభారతవర్ష మంతయు 'యజ్ఞియదేశ'మై యున్నది. ఇట్టి స్వభావముగల ఇతర ప్రాంతములన్నియు యజ్ఞములు చేయుట కర్హములైనవని చెప్పవచ్చును. (మను 2-17, 19, 21, 22, 23 శ్లోకములు చూడుడు.)

## ద స్యు లు

ఈవిధముగా ఆర్యులు భారతవర్ష మంతయు నిండిరి. కానికాలక్రమమున వారిలో వేదధర్మముల నాచరింపక మాని వేదనిందయొనర్చువారు కొందరు బయలుదేరిరి. అట్టివారిని ఆర్యులు తమ సంఘమునుండి బహిష్కరించి వారితో భోజన ప్రతిభోజనములు, సంబంధబాంధవ్యములు చేయుట మానిరి. అట్టి ధర్మబాహ్యులు, అనా

ర్యులు, అయజ్వులు, వేదబాహ్యులు, అనాశినులు, అవ్రతులు, అన్యవ్రతులు, దస్యులు, మ్లేచ్ఛులు మొదలుగాగల నామములతో ఋగ్వేదములో వినబడుచుండిరి. ఆర్యులు చేయు యజ్ఞములను దస్యులనబడెడి ఆర్యజాతివారలు ధ్వంసమొనర్చుచుండిరి. ఆర్యుల గోవులను, ధనమును వీలగునప్పుడెల్లను దోచుకొనుచు దస్యులార్యులను పీడించుచుండిరి. అందువలన ఉభయులకు విరోధములు ప్రబలి అవి యుద్ధములుగా రూపొందినవి. అట్టి యుద్ధములలో వైదికార్యులు దస్యులనోడించి వారిని దేశమునుండి తరిమివైచిరి. అట్లు తరుమబడిన వారలు పశ్చిమముగా పోయి నిర్మానుష్యముగానుండిన "ఇరాక్" దేశమున నివసించిరి. ఈవిషయమును గురించిన ప్రాచీన చరిత్ర ఋగ్వేదమునందును, 'జంద వేస్థా' యనెడి పారశీకుల మతగ్రంథమునందును చూడగలరు. ఆవాక్యము లీ గ్రంథకర్తచే వ్రాయబడిన "మానవసృష్టి విజ్ఞానం" అనెడి ఇంగ్లీషు గ్రంథమున వివరముగా ఉదాహరింప బడియున్నవి.

## భారత వర్షము

ప్రజాపతియై ప్రజలను సృష్టించి తానే స్వాయంభువ మనువు అనుపేరున వారికి రాజై ప్రజలను భరించినందున స్వాయంభువ మనువునకు "భరతుడు" అను పేరు కలిగినది. అతనిచే పరిపాలింపబడిన యీదేశము "భారత వర్షము" అని పిలువబడినది. భరతునిచే ప్రథమమున పరిపాలింపబడి భరింపబడినందున యీ భారతవర్ష ప్రజలైన "ఆర్యప్రజలు" భారతులు అని పిలువబడిరి. (వాయుపురాణము 145–76; మత్స్య 112–15–10)

ప్రజావృద్ధిని చేయు నిమిత్తము స్వాయంభువ మనువు తనకుమార్తెలు ముగ్గురను ముగ్గురు బ్రహ్మర్షుల కిచ్చి వివాహ మొనర్చెను. వారి సంతాన పరంపరలచే భారతవర్ష మంతయు నిండినది. భారతదేశములోని బహిష్కారజాతులతోడను వారితో కలిసి యుండినందున మ్లేచ్ఛులుగా నెంచబడిన వైదికార్యులతోడను భూగోళములోని యితర దేశములన్నియు క్రమక్రమముగా నిండినవి. దేశ, కాల, భావ, శీతో

ష్ణాది భేదములచే ఒక్కటైన ఆర్యజాతి ఆకారరూపభేదముల నొంది అనేక జాతులుగా పేరులను పొందియున్నది.

## ప్రా చీ న భా ర త వ ర్ష ము

ప్రాచీన భారతవర్షము తూర్పు పశ్చిమసముద్రముల మధ్యస్థమై ఉత్తరమున హిమాలయమును దక్షిణమున నిరక్షరేఖకు దక్షిణముగా నుండిన ఉప్పుసముద్రమును హద్దులుగా గల ప్రదేశమై యున్నది. తూర్పుసముద్ర మనగా పసిఫిక్కు సముద్రము. పశ్చిమసముద్ర మనగా అట్లాంటిక్కు సముద్రము అని తెలియవలెను. భారతవర్షమునకు దక్షిణసరిహద్దున గల నిరక్షరేఖకు దక్షిణముగా గల "లంక" నుండి (ఈలంక యిప్పుడు లేదు. అది సముద్రగామి యైనది. సింహళము వేరు. 'లంక' వేరు అని తెలియవలెను.) పడమరగా నిరక్షరేఖమీద ఏబదవ (50°) డిగ్రీవద్దనుండి ప్రారంభించి లంకకు తూర్పుగా నిరక్షరేఖమీద ఏబది డిగ్రీలవరకు భారతవర్షము వ్యాపించి యుండెడిది. ఇందు ఉత్తర, ఆఫ్రికా యంతయు తూర్పునగల ఇండోచీనా వగైరా ప్రదేశమంతయు భారతవర్షములో చేరియుండెడిది. కాలక్రమమున సుమారు ఐదుకోట్ల సంవత్సరముల క్రిందట దక్షిణ భారతవర్షమున నిరక్షరేఖనుండి ఉత్తరముగా సుమారెనిమిది డిగ్రీలవఱకు సముద్రగామి యైనట్లు మన పురాణములు చెప్పుచున్నవి. ఇచట 'లెమూరియా' యనెడి ఖండమొకటి యుండెడిదనియు అది ఆఫ్రికానంటి తూర్పుగా అమెరికావఱకు వ్యాపించి మూడుకోట్ల సంవత్సరముల క్రిందట ఉండినట్లును అది సముద్రగామి యైనట్లును ఇప్పుడు భూగర్భశాస్త్రజ్ఞులు (Geologists) చెప్పుచున్నారు. అదే ప్రకారము ఆఫ్రికా తూర్పుభాగమునకును ఇప్పటి భారతవర్ష పశ్చిమభాగమునకును మధ్యగల భూఖండము సముద్రగామి యైనది. అదియే అరేబియా, హిందూ మహాసముద్రములుగా ఇప్పుడు పిలువబడుచున్నది. అట్లుమునిగిపోయిన భూఖండమునే 'గాండ్వానాలాండ్' (Gandwanaland) అని పేరుపెట్టబడి అదియు మూడుకోట్లసంవత్సరముల క్రిందట మునిగి పోయినట్లు భూగర్భశాస్త్రజ్ఞు లిపుడు చెప్పుచున్నారు.

సరస్వతీనదియు, సింధు వగయిరా పశ్చిమసముద్రములో కలియు నదులీ గాండ్వానాల్యాండు గుండా ప్రవహించి ఆఫ్రికాఖండముజొచ్చి లంకకు పశ్చిమముగా నిరక్ష రేఖమీందగల 47° డిగ్రీ మొదలు ఏబదవ డిగ్రీల మధ్యగల పశ్చిమ సముద్రములో కలియుచుండెడివి. సరస్వతీనది హిమాలయములందు బుట్టి పశ్చిమసముద్రములో గలియు గొప్పనదిగా ఋగ్వేదమున వినబడుచున్నది. భారతవర్షము పశ్చిమోత్తరముగా పర్షియాకు తూర్పుసరిహద్దున గల "హీరటు" పట్టణమువఱకు వ్యాపించియుండెడిది. పర్షియాలో పశ్చిమదక్షిణముగా గల "శాకస్థానము" (Seisthan) దానిచుట్టు గల ప్రదేశమంతటిని చేర్చుకొని ప్రాచీనభారతవర్షభాగముగానిరూపితమై యున్నది. ఎఱ్ఱసముద్ర మానాడు లేదు. అది భూభాగముగా ఉండెడిది. సహారా యెడారి (ఆనాడు సముద్రము) ఇవన్నియు ప్రాచీన భారతవర్షములో చేరియుండెడివి. (ఈ గ్రంథకర్త చే వ్రాయబడిన బ్రహ్మాండసృష్టి విజ్ఞానమును చూడుడు.)

## అ ను లో మ వి లో మ శా ఖ లు

చాతుర్వర్ణ్యస్థులైన ఆర్యులు ధర్మవిరుద్ధముగా నొకకులములోని స్త్రీపురుషులకు వేఱొక కులములోని స్త్రీపురుషులతో కామసంబంధము కలిగినందున అట్టివారికి కలిగిన సంతానమువలన అనులోమవిలోమ జాతు లనేకము లుత్పన్నమైనట్లు శాస్త్రము లుద్ఘోషించుచున్నవి. చాతుర్వర్ణ్య ధర్మములను కాపాడుటయే రాజధర్మములలో మొదటిదిగాను, అతిముఖ్యమైనదిగాను స్మృతులు శాసించుటవలన అట్టి సంకీర్ణ సంతానముల నెప్పటికప్పుడు వేరుబెట్టుచు వచ్చిరి. అందువలన సంకీర్ణ వర్ణము లెచ్చుగా నైనవి. అందు విలోమసంకరమువలన కలిగినవారలు గ్రామములకుబయట నివసించునట్లు చేయబడుటచే బాహ్యాజాతులని పిలువబడిరి. ఐతరేయబ్రాహ్మణమున వినబడుచుండిన బాహ్యాజాతులగు ఆంధ్ర, పుండ్ర శబర, పుళింద, ముతిబా, మొదలగు సుమారు అరువది నాలుగు జాతు లిట్లేర్పడినవై యున్నవి. వారు పెద్దగుంపులుగా జేరుట కాకాలమున అవకాశములు లేవు. వారు భూములు మొదలగు ఆస్తులు

సంపాదించకుండునట్లును, గుంపులుగా గూడి దేశములో సంచారము చేయకుండునట్లును రాజకీయ శాసనము లుండెడివి. వారలు తమ కేర్పరుపబడిన స్వతంత్రవృత్తులు చేసికొనుచు కొన్ని నియమములకు లోనై స్వేచ్ఛగా జీవించునట్లు ఏర్పరుపబడినది. మనుధర్మశాస్త్రమును చదివినవారల కీవిషయము లన్నియు వివరముగా తెలియగలవు.

శక, యవనాది బహిష్కార శాఖలు

ప్రాచీనభారతవర్షములో క్షత్రియశాఖ లనేకముగా వృద్ధినొందినవి. అందు కొన్ని శాఖలవారు వేదోక్త ధర్మములగు ఉపనయనాది సంస్కారముల వదలి యుండుటవలన వారిని ఆర్యులు సంఘమునుండి బహిష్కరించిరి. శక, యవన, బర్బర, పౌండ్రక, ఓఢ్ర, ద్రవిడ, కాంభోజ, పరద, పహ్లవ, చీన, కిరాత, దరద, ఖశ, సౌర, హూణ, రూమక మొదలుగాగల క్షత్రియశాఖలవా రందరీ విధముగా బహిష్కరింపబడిరి. వారు చౌర్యహింసాదులను వృత్తిగాగొని ఆర్యులను బాధించుచుండిరి. వీరందరు దస్యులుగా పరిగణింపబడిరని మనువుచెప్పుచున్నాడు. (మనుస్మృతి 10-43-45). ఋగ్వేదాదులలో వినబడుచుండిన దస్యులనగా ఈపైనచెప్పబడిన బహిష్కరింపబడిన ఆర్యజాతివారలే యని గ్రహించవలెను.

ఆర్యులను హింసించు "దస్యు"లనబడిన వారలు ఆర్యులకు జ్ఞాతులనియు, వారుకూడ ఆర్యజాతికి చెందినవారలే యనియు ఋగ్వేదమునసే వినబడుచున్నది.

శ్రుతి: "యఋక్షా దంహాసో ముచ ద్యోవార్యా త్సప్తసింధుషు."
(ఋగ్వే4-24-28).

తా॥ పరిపరివిధముల మమ్ము హింసచేయు, సప్తసింధుదేశమున గల ఈ యార్యజాతినుండి యేఇంద్రుడు మమ్ము కాపాడగలడో అట్టి ఇంద్రుని ప్రార్థించుచుంటిమి.

ఆర్యులను హింసించుచుండిన వారుకూడ "ఆర్యులే" యనియు

వారు ఈసప్తసింధుదేశనివాసులే అనియు పైఋక్కులో స్పష్టముగా చెప్పబడినది.

శ్రుతి:- "ఇమఇంద్ర భరతస్య పుత్రా అపపిత్వంచపితున్న ప్రపిత్వం"॥
ఇత్యాది (ఋగ్వే. 3-4-53-24)

తా॥ తమతో యుద్ధమునకు తలపడుచున్న శత్రువుల నుద్దేశించి ఆర్యులు ఇంద్రుని ప్రార్థించు సందర్భమున "ఓ ఇంద్రుడా! ఈ భరత పుత్రులను చూడుము. వీరలు స్నేహమెన్నఁడెఱుఁగరు గదా!. సర్వదా శత్రుత్వమునే వహించి యున్నారు. (మూడు జ్ఞాతిసముదాయములో చేరినవారై యుండియు సహజ శత్రువులై కేవలవేగముగా గుర్రములను దఱుముచున్నారు. యుద్ధమునం దుపయోగించుటకు శర, శరాసన, బాణాదుల గొని పోవుచున్నారు. అని తమతో యుద్ధమునకు దలపడుచున్నవారు కూడ "భరతపుత్రుల"ని పై మంత్రమున స్పష్టముగా విశదపడుచున్నది.)

శ్రుతి:- 'ఏతేన పాప్మానం ద్విషంతం భ్రాతృవ్యం హంతి తథోఏవవిజ యతే.'
(శతపథబ్రాహ్మణం 2-4-1-15)

తా॥ ఈయజ్ఞకర్మ పాపులై మనల్ని ద్వేషించుచున్న యీజ్ఞాతిసముదాయమును చంపును. ఆవిధముగా జయము కలుగుగాక!

పైమంత్రములో ఆర్యులను ద్వేషించి వారితో యుద్ధములకు సిద్ధమగుచుండిన దస్యులు ఆర్యులకు జ్ఞాతిసముదాయములోనివారలే యని స్పష్టము చేసి యున్నది.

శ్రుతి:- "ఏతచ్ఛతఘ్నీం యజమానో భ్రాతృవ్యాయ ప్రహరతి॥"
(తై. సం. 1-5-7-6-2)

తా॥ ఈ శతఘ్నీ యను ఆయుధమును (అనగా ఒకేసారి నూరు మందిని చంపగల యుద్ధములో నుపయోగించు ఒక యంత్రము) మాకు జ్ఞాతులైన యీదస్యులను జంపుటకు యజ్ఞముచేయు యజమానునిచే ప్రయోగింపబడుచున్నది.

ఈ వైమంత్రములో ఆర్యులకు శత్రువులై వారితో యుద్ధము చేయుచున్నది వారికి జ్ఞాతులని-అనగా పినతండ్రి పెదతండ్రిబిడ్డలని-స్పష్టముగా వినబడుచున్నది. నూరుగురిని ఏకకాలమున చంపగలఆయుధ మానాటికే ఆర్యులు కలిగియున్నారని వైమంత్రముననే వినబడుచున్నది.

ఆర్యులు, దస్యులు వేరువేరు జాతులవారు కారనియు వారందరు జ్ఞాతిసముదాయములోని వారలేయనియు ఉభయులకు యజ్ఞప్రియత్వ యజ్ఞద్వేషిత్వములే వారివిభాగమునకు హేతువులైనవనియు, యజ్ఞప్రియులు ఆర్యులనియు యజ్ఞద్వేషులగు ఆర్యులు అనార్యులు,అయజ్వులు దస్యులు, మ్లేచ్ఛులు, మొదలైన పేర్లతో పిలువబడిరనియు వేదమంత్రములవలననే మనకు తెలియుచున్నది.

ఆర్య, దస్యు శబ్దములను వేదమే యనుగ్రహించినది. దానిని జూచువఱకు పాశ్చాత్యులీశబ్దముల నెఱుగరు.

ఆర్యులకు దస్యులకు నిరంతరము యుద్ధములు సాగుచుండుట వలన శాంతికాములైన ఆర్యులు భారతవర్షమును రెండుభాగము లొనర్చి సింధునదికి పశ్చిమముగాగల యిప్పటి భారతవర్షములోని మ్లేచ్ఛరాష్ట్రములతో గలిపి ఆఫ్రికాఖండములోని భారతవర్షభాగము లన్నియు దస్యులైన క్షత్రియశాఖలవారి కిచ్చి సదాచారులై వేదధర్మముల నాచరించెడి ఆర్యులు సింధునదికి తూర్పుభాగమున నివసించిరి.

"సింధుస్థాన మితి జ్ఞేయం రాష్ట్ర మార్యస్యచోత్తమం
మ్లేచ్ఛస్థానం పరం సింధోః కృతం తేన మహాత్మనా."

(భవిష్యపురాణము 3-3-2-20-21)

"సింధునదికి తూర్పుభాగమున గల వైదికార్యులు నివసించెడి దేశమునకు 'సింధుస్థాన' మనిపేరీయబడినది. దీనినే భరతఖండమని మన మిప్పుడు పిలుచుచుంటిమి. సింధునదికి పశ్చిమభాగమున గల భారత

వర్ష భాగమునకు "మ్లేచ్ఛస్థాన" మని పేరు పెట్టబడినది. దీనిని మ్లేచ్ఛ ఖండమనియు పిలిచెడివారు.

## మ్లేచ్ఛార్యుల ప్రపంచవ్యాప్తి

అట్లు దేశవిభాగ మొనర్చి యీయబడినను శక, యవన, హూణా దులైన మ్లేచ్ఛార్యులు చౌర్య హింసాదులు ప్రధానవృత్తిగా పెట్టుకొనుట చేతను అందును వారు వీరులైన సూర్యవంశ క్షత్రియు లగుటచేతను నిరంతరము భరతఖండముమీదకు దండెత్తివచ్చి అందినపట్టణములనుపల్లె లను దోచుకొనుచు, స్త్రీల నెత్తికొనిపోవుచు ఆర్యులకు నిరంతరము హాని చేయుచుండెడివారు. ఆర్యరాజులు వీరిమీదకు దండెత్తి వీరిని అదు పులో నుంచుచుండెడివారు. క్రమ క్రమముగా వారలు పశ్చిమ, ఉత్తర ఆసియా ఐరోపా దేశములకు పోయి అచ్చట నివసించి రాజ్యస్థాపనను చేసియుండిరి. అట్లుపోయినవారిలో యవనులు నేడు గ్రీసుఅని పిలువబడు చుండిన ప్రదేశమున నివసించి దానికి "అయోనియా"అని పేరిడిరి. భారతదేశములోని కాశ్మీరమునకు పశ్చిమమున గల అభిసార, ఉరగ, సింహపుర, దివ్యకటక, ఉత్తరజ్యోతిష-అను అయిదును భారతయవనరాష్ట్ర ములైయున్నవి. పిమ్మట క్రీ.పూ. పదునశతాబ్దప్రాంతమున గ్రీకులనెడి అనాగరికులగు మోటుజాతివారు వారినిజయించి వారితో పాటందు నిలిచి దానికి "గ్రీసు"అని పేరును మార్చియుండిరి. గ్రీసువారి నాగరికత భారతవర్షమునుండి మ్లేచ్ఛ యవనక్షత్రియులవలన కొంపోబడినదై యున్నది. వీరు కేవలము గుంపులుగా పోయి రాజ్యస్థాపనము చేసియుండి రనునది పొరబాటు. వీరికి రాజులుండెడివారు. వారి రాజుల యాజమాన్య మునసే దండయాత్రలు జరుగుచుండెడివి.

భరతవర్షములోని ఆర్యరాజులు ఈశక యవనాది మ్లేచ్ఛక్షత్రియ వీరులను తమసైన్యములో నొకభాగముగా చేర్చుకొనెడివారు. వీరంద రాయుధోపజీవులైనందున తమకు జీతములిచ్చి పోషించెడి రాజుల వద్ద సైన్యములలో జేరి వారికిగాను యుద్ధములలో పాల్గొని ప్రాణము

లర్పించెడివారు. యవనస్త్రీలు చాల సుందరులును వీర నారీమణులునై యుండిరి. ఆర్యరాజులవద్ద వీరు అంగరక్షకులుగాను చామరగ్రాహిణులుగాను ఉండెడివారు.

యవనులకు జ్యోతిశ్శాస్త్రమందు ఎక్కువప్రీతి. వారిలోచాలమంది జ్యోతిశ్శాస్త్రప్రవీణు లుండెడివారని భారతము చెప్పుచున్నది. యవనసిద్ధాంత మను జ్యోతిశ్శాస్త్రమును రచించిన 'యవనఋషి' యవనరాష్ట్రములో నివసించెడి మ్లేచ్ఛయవనబ్రాహ్మణుడు. యవనులువైదికధర్మముల వదలి మ్లేచ్ఛులైనను వారు తమలో పరంపరగ వచ్చెడి నాలుగువర్ణములను గలిగియుండి ఆయా వర్ణనామములతోడనే గుర్తింపబడుచుండెడివారు. కల్హణ పండితుని రాజతరంగిణి గ్రంథమునందు యవనదేశమున బుట్టిన లోష్టకు డనెడి పేరుగల యొకయవనబ్రాహ్మణుడు కాశ్మీరమున కాశ్మీరరాజులజాబితాలో130వవాడగుకలశుడనెడిరాజువద్ద క్రీ॥శ.1078-88 సం॥రములలో సలహాదారుగా నుండినట్లును ఆతడు జ్యోతిశ్శాస్త్రవేత్తయైనట్లును చెప్పబడినది. శ్రీములుగు పాపయారాధ్యకృతాంధ్ర దేవీభాగవతము పంచమస్కంధము 532పుటలో 'సమాధి' యనెడి పేరుగల కిరాతశాఖకు చెందిన యొక వైశ్యునికథ చెప్పబడినది. ఇది రామాయణ చరిత్రకు పిమ్మటికాలమున జరిగినది. ఈవిధముగా శక, యవన, హూణ కిరాతాది క్షత్రియశాఖలవారు మ్లేచ్ఛులైనను వారితోపాటు ఆయాదేశములయందుండిన బ్రాహ్మణ, వైశ్య, శూద్రాదులు గూడ వైదిక ధర్మముల విడిచినను ఆయాదేశములందు కులవిభాగములతోడనే గుర్తింపబడుచుండెడివారు.

క్రీస్తుశకము పండ్రెండవ శతాబ్దములో పశ్చిమోత్తరభారతమున గల యవనాది క్షత్రియశాఖలవారు మహమ్మదీయులుగా చేయబడినందున. ఆశాఖలపేర్లు విస్మరింపబడినవి.

## —: ఆర్యుల భరతఖండ వ్యాప్తి :—

బ్రహ్మావర్తమునుండి మధ్యదేశమువఱకు నివసించిన ఆర్యులు క్రమక్రమముగవృద్ధినొందిసరస్వతీనదీప్రాంతములనుండితూర్పుగను,పశ్చిమముగను, దక్షిణముగను పోయి భారతవర్షమంతటను నిండిరి. ఆర్యజాతీయులతోబాటు బాహ్యజాతివారలుకూడ నున్నందున వారికి చాతుర్వర్ణ్యస్థులగు ఆర్యులు నివసించెడి గ్రామబహిఃప్రదేశములందు స్థిరనివాసములు కల్పింపబడినవి. చాతుర్వర్ణ్యస్థులు, బాహ్యులు అనబడెడి ఆర్యశాఖలవారందరు ఎవరిహద్దులలో వారుండి వారివారికేర్పడిన నియత కార్యముల నొనర్చుకొనుచు ఐకమత్యముగలవారై వృద్ధిపొందిరి. అందులకు విరుద్ధముగనడచుచు ప్రజాపీడాకరులైనవారు దేశమునుండి వెడలగొట్టబడిరి. ఆసేతుహిమాచలముగాగల భారతవర్షమంతటను ఈచాతుర్వర్ణ్యములతో పాటు బాహ్యజాతివారలు కూడ పోయి వారిప్రక్కనే నివసించుచుండిరనెడి సంగతిని మనము మరువరాదు. వీరే దేశముచేరిన ఆ దేశనామముచే పిలువబడుదురని మనువు 10-21-22-23లో చెప్పియున్నాడు. ఈబాహ్యజాతివారందరు ఆర్యసంఘములో చేరినవారే కాని బయటివారు కారు.

## —: ఆంధ్ర దేశము :—

ఇట్లు కాలము గడచుచురాగా చంద్రవంశక్షత్రియుడగు యయాతి చక్రవర్తి నాలుగవ కుమారుడగు 'అనువు' వంశములో 'అనువు' నుండి లెక్కింపగా పదమూడవ ప్రముఖవంశమువాడగు 'బలి' అను రాజు బంగాళదేశము లగాయతు దక్షిణముగా మద్రాసుకు దిగువ భాగమునగల ప్రదేశమువఱకు పరిపాలించుచుండెను. ఆతని పితృపితామహులు కూడ దీనిని పాలించియుండిరి. ఈ రాజ్యమునకు 'ప్రాచ్యక' రాజ్యమని పేరు. ఈ ప్రాచ్యకరాజ్య మంతటను చాతుర్వర్ణ్యస్థులైన ఆర్యులును వారియందంతర్భూతమై యుండిన బాహ్యకులములవారును ఇంకను గల అనులోమ, విలోమ శాఖలకు చెందిన

వివిధ కులములవారును నివసించియుండిరి. రాజును ప్రజలును వేద ధర్మముల నాచరించెడి వైదిక సాంప్రదాయములకు చెందినవారైయుండిరి.

ప్రాచ్యక రాజ్యప్రభువగు 'బలి' మహారాజునకు ఆఱుగురు కుమారులు గలరు. వారు: 1. అంగరాజు 2. వంగరాజు 3. కళింగ రాజు 4. సుంహ్మరాజు 5. పుండ్రరాజు 6. ఆంధ్రరాజు అనెడి పేరులు గలవారైయుండిరి. తండ్రి అనంతరము వారార్గురును తమ ప్రాచ్యక రాజ్యమును ఆఱు భాగములుగా విభజించుకొని ఎవరి వంతునకు వచ్చిన రాజ్యభాగమునకు వారు తమతమ పేరులు పెట్టి రాజ్యము చేసియుండిరి.

ఈ చరిత్రను భాగవత పురాణ మిట్లు చెప్పియున్నది:-

(శ్రీ)మద్భాగవతే నవమస్కంధే౨౩అధ్యాయే 5,6 శ్లోకాః-

శ్లో॥ అంగ వంగ కళింగాద్యాః సుంహ్మ పుండ్రాంధ్ర సంజ్ఞితాః
జజ్ఞిరే దీర్ఘతమసో బలేః క్షేత్రే మహీక్షితః॥

శ్లో॥ "చక్రుస్స్వనామ్నా విషయాన్ షడిమాన్ ప్రాచ్యకాంశ్చ తే॥"

తా॥ "బలి యను మహారాజునకు దీర్ఘతముడను ఋషియనుగ్రహమున అంగ, వంగ, కళింగ, సుంహ్మ, పుండ్ర, ఆంధ్రయనుపేరులుగల ఆర్గురు కుమారులు గలిగిరి. వారు తూర్పుదేశమునకు రాజులై ఆరుదేశ భాగములకు తమ నామములనే పేరులుగా నుంచి యేలిరి."

పై శ్లోకములకు పూర్వాపర సందర్భములను చేర్చి (శ్రీ) బమ్మెర పోతనామాత్యు డిట్లు తెనిగించి యున్నాడు:- "తితిక్షునకు రుశద్రథుండు, రుశద్రథునకు హేముండు, హేమునకు సుతపుండును, సుతపునకు బలియు బుట్టిరి; ఆ బలివలన అంగ, వంగ, కళింగ, సుంహ్మ, పుండ్రాంధ్రు లను పేరులుగల వారార్వురు కుమారులు పుట్టిరి. వారలు తూర్పు దేశంబులకు (ప్రాచ్యక దేశభాగములు) రాజులై దేశంబులకు తమతమ నామ ధేయంబు లిడి యేలిరి."

((శ్రీ) మద్భాగవత నవమస్కంధము 685 వచనము చూడుడు)

చంద్రవంశ క్షత్రియుడగు యయాతిచక్రవర్తి వంశపరంపరలో వచ్చిన రాజులు భారతదేశములోని వివిధరాష్ట్రములకు రాజులై అదివర కా దేశములకు గల ప్రాచీన నామములను మార్చి తమతమ పేరుల నాయా దేశములకుంచి రాజ్యములు చేసియుండిరని పురాణములు వివరించు చున్నవి. ఆ వివరములు క్రింద చూపబడుచున్నవి.

### రాజనామములచే పిలువబడిన దేశములు-ప్రజలు.

| వరుస నెంబరు | రాజుపేరు | రాజ్యమునకు పెట్టినపేరు | ప్రజలకు కలిగిన నామము |
|---|---|---|---|
| 1. | యయాతికుమారుడు యదువుసంతానములో యయాతినుండిఏడవవాడు కుంతలుడు | కుంతలదేశము | కుంతలులు |
| 2. | డిటో, తొమ్మిదవవంశము వాడు మహిష్మంతుడు | మహిష్మతీ పురము | మాహిష్మతులు |
| 3. | డిటో, క్రోష్టువు వంశములో యయాతినుండి పదిహేనవ తరమువాడు విదర్భుడు | విదర్భదేశము | విదర్భులు |
| 4. | డిటో, విదర్భుని వంశములోని వాడును యయాతినుండియిరు వదవతరమువాడగు చేది | చేదిదేశము. | చైద్యులు |
| 5. | యయాతి కుమారుడు పూరుని వంశములో యయాతి నుండి ఇరువది రెండవతరమువాడు హస్తి | హస్తినాపురము | |

| | | |
|---|---|---|
| 6. యయాతి కుమారుడు పూరుని వంశములో యయాతి నుండి 26వ తరము వాడు 'ఋక్షుని' సంతానములో యయాతినుండి యిరువదియారవ తరము లోనివాడు కురు | కురుక్షేత్రము | కౌరవులు |
| 7. యయాతి కొడుకు ద్రుహ్యునివంశములో యయాతి నుండి ఐదవతరమువాడు గాంధారుడు | గాంధార దేశము | గాంధారులు |
| 8. డిటో,పదవవంశము లోని సంతానము నూరుమంది మధ్యాసియాలోని మ్లేచ్ఛ క్షత్రియుల దేశప్రభువు లైన వారు | యవన, బాహ్లీక తురుష్క, (టర్కీ—, శక, పహ్లవ, కంపిల (కాబూలు) ఆదిగాగల మ్లేచ్ఛదేశములు | యవనులు బాహ్లీకులు తురుష్కులు శకులు, పహ్లవులు కాంపిలులు (కాబూలీలు) |
| 9. యయాతికొడుకు అనువు వంశములో యయాతినుండి పదవతరమువాడు ఉశీనరుడు | ఉశీనర దేశము | ఉశీనరులు |
| 10. యయాతికొడుకుఅనువు వంశములో పన్నెండవ తరమువాడు వృషదర్భుడు | వృషదర్భ దేశము | వృషదర్భులు |
| 11. డిటో,పండ్రెండవతరము లోని రాజులు సువీర | సౌవీరము | సౌవీరులు |

| | | |
|---|---|---|
| 12. మద్ర | మద్రదేశము | మద్రులు |
| 13. కేకయ | కేకయదేశము | కేకయులు |
| 14. యయాతికొడుకు అనువు వంశములో యయాతినుండి పదియాఱవ వంశములోని రాజులు- అంగరాజు | అంగదేశము | అంగులు |
| 15. డిటో- వంగరాజు | వంగదేశము | వంగులు |
| 16. డిటో- కళింగరాజు | కళింగదేశము | కాళింగులు |
| 17. డిటో- సుంహ్మరాజు | సుంహ్మదేశము | సుంహ్ములు |
| 18. డిటో- పుండ్రరాజు | పుండ్రదేశము | పుండ్రులు |
| 19. డిటో- ఆంధ్రరాజు | ఆంధ్రదేశము | ఆంధ్రులు |
| 20. యయాతికొడుకు తుర్వసు వంశములో యయాతినుండి పదకొండవతరము రాజులు-పాండ్యరాజు | పాండ్యదేశము | పాండ్యులు |
| 21. కేరళరాజు | కేరళదేశము | కేరళులు |
| 22. చోళరాజు | చోళదేశము | చోళులు |
| 23. కుల్యరాజు | కుల్యదేశము | కుల్యులు |
| 24. వైవస్వత మనువునుండి రెండవవంశమువాడు కరూశుడు | కారూశదేశము | కారూశులు |

జంబూద్వీప విభాగములు రాజ నామములచే నేర్పడినవి.

ఋషభ చక్రవర్తి కుమారులు:-

| | | |
|---|---|---|
| 25. భరతుడు | భారతవర్షము | భారతులు |
| 26. కింపురుషుడు | కింపురుషవర్షము | కింపురుషులు |

| | | | |
|---|---|---|---|
| 27. | హారి | హారివర్షము | హారివర్షీయులు |
| 28. | ఇలావృతుడు | ఇలావృతవర్షము | ఇలావృతులు |
| 29. | కేతుమాలుడు | కేతుమాలవర్షము | కేతుమాలులు |
| 30. | భద్రాశ్వుడు | భద్రాశ్వవర్షము | భద్రాశ్వులు |
| 31. | రమ్యకుడు | రమ్యకవర్షము | రమ్యకులు |
| 32. | హిరణ్యాక | హిరణ్యాకవర్షము | హైరణ్యాకులు |
| 33. | కురు | కురువర్షము | కురువర్షీయులు |
| 34. | స్వాయంభువునకు భరతుడను నామముకలిగినందున ప్రథమమున మనభూభాగమునకు భారతవర్షమని పేరు కల్గినది. అతనికిపిమ్మట అతని కుమారుడగు నాభియనువాడు రాజై యీభారతవర్షమునకు అజనాభమని పేరు మార్చి యుండెను. | అజనాభము | అజనాభులు |
| | నాభికి పిమ్మట అతని (కుమారుడగుఋషభునితనయుడు) మనుమడగు భరతునివలన ఈ అజనాభము తిరిగిభారతవర్షమని పిలువబడినది. (ఈతడే జడభరతుడని పేరొందిన వాడు) | భారతవర్షము | భారతులు |

ఇట్లు రాజనామములచే దేశములు పిలువబడినందున ఆయా దేశవాసు లాయా దేశనామములచే పిలువబడిరి. అదే ప్రకారము ఆంధ్ర రాజువలన పరిపాలింపబడి అతనిపేరున "ఆంధ్రదేశ"మని పిలువబడిన-

కృష్ణాగోదావరీపుణ్యానదులచే పవిత్రమగు చుండిన ఈ దేశమున నివసించుచుండిన చాతుర్వర్ణ్య ప్రజలును, అనులోమ విలోమాది కులములకు చెందిన జనులందరును ఆంధ్రులని వ్యవహరింపబడుచుండిరి. బ్రహ్మావర్తమునందు పుట్టి భారతవర్షమందంతటను వ్యాపించిన ఆర్యులు వారు వారు నివసించెడి రాష్ట్రముల పేర్లతో పిలువబడిరని మనకు స్పష్టముగా తెలియుచున్నది. ఆ రాష్ట్రములు వాటిని పరిపాలించిన రాజనామమున పిలువబడినవి. ఆంధ్ర దేశమున నివసించెడి ఆర్యప్రజలకు ఆంధ్రులనెడి పేరు మధ్య వచ్చినది గాని ప్రథమమునుండి వచ్చినది కాదు. ఇటులనే ద్రవిడ, కర్ణాట, కేరళ, మరాట, గుజరాతు, సింధు మొదలుగాగల రాష్ట్రములందు నివసించిన వైదికార్యులు రాష్ట్రనామములచే ద్రవిడులనియు, కర్ణాటకులనియు, కేరళులనియు, గుజరాతీయులనియు, సింధీయులనియు లేక సైంధవులనియు దేశనామములచేతనే ఈ నాటివరకును పిలువబడుచుండిరి. వీరందరును ఆర్యసంతానమేగాని ఆ ర్యేతరులు కారు. వీరి ప్రక్కనే బాహ్యకులముల వారును నివసించి ఆయా రాష్ట్రనామములనే కలిగియున్నారు.

రాష్ట్రనామములచే పిలువబడినంతమాత్రమున వారు ఆర్యులకంటె వేఱుజాతివారని యెంచరాదు. ఆర్యజాతియొక్కటే శాఖోపశాఖలై ప్రపంచమంతట వ్యాపించియుండినదని తెలియవలెను. ఆర్యులు నాలుగు కులములు, ఆకులముల సాంకర్యమున జనించిన అనులోమ విలోమ కులములవారు (Mixed castes), ఆర్యధర్మముల వదలి స్వేచ్ఛాచారులై తమకు తోచినవిధమున ధర్మనిర్ణయములు చేసికొని సంచరించెడి దస్యు, మ్లేచ్ఛ, అనార్యాదిశబ్దములచే పిలువబడుచుండి వేదబాహ్యత నొందినశాఖలు క్షత్రియాది దస్యుజాతులుగను, అందంతరములైన ఇతరకనేకశాఖలుగాను ఏర్పడిరి. అందు దస్యులుగా పరిగణింపబడినవారలు ఐరోపా, ఆఫ్రికా, ఉత్తర ఆసియాల నాక్రమించి యుండిరి.

ఆర్యులకురువర్ష (ఇప్పటిమధ్యఅమెరికా) నివాసము.

చాతుర్వర్ణ్య ఆర్యులు అనులోమవిలోములతోకలిసిభారతవర్షము లగాయతుతూర్పుగాసముద్రమునమునిగిపోయిన లెమూరియాఖండమును దానిగుండామధ్యఅమెరికా భాగముల్లాక్రమించి నివసించిరి. అమెరికాలో అతిప్రాచీన కాలమునుండి నివసించుచుండిన "ఎర్రఇండియను" (Red Indians) లనబడెడివారందరు భారతవర్షమునుండి బహుప్రాచీన కాలమున వలసపోయి నివసించిన చాతుర్వర్ణ్యస్థులైన వైదికార్యు లని తెలియవలెను. వారియిండ్లలో సుమారు నాలుగైదువేల సంవత్సరములకు పూర్వము వెలిగింపబడి అప్పటినుండియు నారాధింపబడుచుండిన అగ్నిహోత్ర మీనాటికిని బూజింపబడుచుండినది. నిత్యము ఉదయముననే స్నానమొనర్చి "సోమము" అనుపేరున ఒక తీగెను దంచి తీయబడిన రసమును అగ్నిహోత్రములో పోసి నమస్కరించి వారి పనులకు వారు పోవుచుందురని శ్రీ చమన్‌లాలు మహాశయుడు తన "హిందూఅమెరికా" అనెడి గ్రంథములో వ్రాసియున్నాడు. ఆయన స్వయముగా అమెరికాలోని ఎర్రయిండియనుల యిండ్లలో బసచేసి వారి ఆచార వ్యవహారములను స్వయముగా అవగాహన చేసికొనియున్నవాడు. ఎర్ర ఇండియను లందరు దక్షిణభారతమునుండి పోయిన ఆంధ్రులు ద్రవిడులు మొదలగువారలును, నేపాలుప్రాంత వాసులగువారలు కొందరును కలిసియుండి రని వ్రాసియున్నాడు. ఈవిధముగా ఆంధ్రులనబడెడి వైదికార్యులు దక్షిణ భారతమునుండి "లెమూరియా" యనబడు పసిఫిక్కు మహాసముద్రముగా మారిపోయిన ఖండమును, దానికి దక్షిణముగా గల సుమిత్రా. జావా మొదలుగాగల ద్వీపములను అమెరికాఖండములో చాలభాగమును ఆక్రమించి కోట్లసంవత్సరములక్రిందటనే అచ్చట నివసించిరి. ఇప్పు డాంధ్రులని పిలువబడెడివారలు స్వచ్ఛమైన ఆర్య జాతివారైయున్నారు. వారు పోయినివసించిన ప్రదేశమునకు "ప్రాచ్యకదేశమ" ను పేరు కలిగినప్పుడు వీరు "ప్రాచ్యక" జాతీయులని (తూర్పుభారతమున నివసించిన ఆర్యులని) పేరు కలిగినది. పిమ్మట "ఆంధ్రరాజు" తనకు భాగలబ్ధమైన ప్రాచ్యక రాజ్యభాగమునకు

"ఆంధ్రదేశ" మని పేరుపెట్టినపుడు అందు నివసించుచుండిన ఆర్య కులములకు చెందిన ఆర్యులును, అందుండిన దస్యుజాతివారలును, నాగవంశీయు లాదిగాగల జనసమూహ మంతయు "ఆంధ్రజాతీయులు" లేక "ఆంధ్రులు" అని పిలువబడిరి. వారు మాట్లాడుచుండిన ప్రాకృత భాషలలో నొకటియగు తెలుగుభాష "ఆంధ్రము" లేక "ఆంధ్రభాష" యని పిలువబడజొచ్చినది. వేదభాషయైన దేవనాగరిభాష నుండి సంస్కృతమును అందుండి ప్రాకృతభాషలును, ప్రాకృతమునుండి వికృతినొంది తెలుగు మొదలుగాగల వివిధ రాష్ట్రభాషలును ఉద్భవించినవి. ఈ తెలుగే కాలక్రమమున ఉచ్చారణలోను, వ్యాకరణములోను చాలమార్పులను జెంది చివరకు "ఆంధ్రము" అనెడి దేశనామమును కూడ గ్రహించినది. తెలుగు, ఆంధ్రము వేరువేరు భాష లనెడి వాదమునకు తావు లేదు.

## ఆంధ్రరాజుకాలము

ఇప్పుడు జరుగుచుండిన సృష్టి ప్రారంభమై నేటికి (అనగా కలి 5054 సంవత్సరమునకు) నూటతొంబది యైదుకోట్ల యేబదియెనిమిదిలక్షల యెనుబది యైదువేల యేబది నాలుగు సంవత్సరములు గతించినవి. ఈ కాలములో అంతర్భాగములుగా ఆరు "మనుకాలములు" గతించినవి. అందు మొదటిది 'స్వాయంభువ' మను కాలము. రెండవది 'స్వారోచిష' మూడవది 'ఉత్తమ' నాలుగవ 'తామస' ఐదవ 'రైవత' ఆరవ 'చాక్షుష' మనుకాలములను పేరుగలవి గతించినవి. ఏడవదగు వైవస్వత మనుకాలమున ఇప్పుడు మన ముండుచుంటిమి. ఈ వైవస్వత మను కాలములో ఇరువదియేడు మహాయుగములు గతించినవి. (ఒక్కొక్క మహాయుగము 43,20,000 సంవత్సరములకాలము) ఇరువది యెనిమిదవ మహాయుగములో కృత, త్రేతా, ద్వాపరయుగములు మూడు (38,88,000 సం) ను గతించినవి. మనమిప్పుడు ఇరువది ఎనిమిదవ కలియుగములో 5054 సంవత్సరములు గడిచి 5055 సంవత్సరములో నుంటిమి. ఏడవ మనుకాలములోని ఇరువదినాలుగవ మహా

యుగములో శ్రీమద్రామాయణములోని రామ, రావణ యుద్ధము జరిగియున్నది. అది జరిగి ఇప్పటికి ఒకకోటి నలుబది ఆఱులక్షల పైకాలము గతించినది. అట్లుకాక కొందఱెంచినట్లు ఈయిరువదెనిమిదవ మహా యుగములోని త్రేతాయుగాంత మని యెంచినచో ఇప్పటికి తొమ్మిదిలక్షల సంవత్సరముల పైకాల మగును. శ్రీరాముని తండ్రి "దశరథుడు" సూర్యవంశపు రాజు. చంద్రవంశమునకు చెందిన "రోమపాదుడ"నెడి రాజు ఈదశరథునికి ప్రాణమిత్రుడు. వీరిద్దరును సమకాలికులు. దశరథుడు తన కొమార్తెయైన "శాంత"ను సంతానము లేని రోమపాదునకు పెంచికొనుట కిచ్చియుండెను. ఉశీనర, తితిక్షువు లనువార లిద్దర న్నదమ్ములు. అందు ఉశీనరునినుండి ఏడవ తరమువాడు "రోమపాదుడు." ఉశీనరుని తమ్ముడగు తితిక్షువునుండి ఆఱవతరము వాడు "ఆంధ్రరాజు." ఈ రోమపాద-ఆంధ్రరాజులు సమకాలికులు. రోమపాదుడు దశరథునికి మిత్రుడు. దశరథుని కుమార్తెయైన శాంతాదేవిని పెంచికొనినవాడు. అందువలన రోమపాదుడు, దశరథుడు, ఆంధ్రరాజు ఈముగ్గురు సమకాలికులు. (భాగవతము 9-685-686 చూడుడు.)

## ఆర్యాంధ్రులు

ఆద్యులైన ఈ తెలుగుజాతీయులుచాల ఉదారులు. పరాక్రమవంతులై ప్రజారంజకముగా చిరకాలము రాజ్యపాలన మొనర్చియుండిరి. వారిచరిత్ర గుఱించుక దిగువ ఉదాహరింప బడుచున్నది. ప్రాచ్యక దేశస్థులగు ఈ ఆర్యాంధ్రులను గురించి శ్రీ రామాయణము నందు సుగ్రీవుడు సీతాన్వేషణమునకు వానరులను పంపు ఘట్టమున, స్మరింపబడెను. శ్రీ దేవీభాగవతమున సుక్షత్రియుడైన సింహళదేశాధీశుడు తన కుమార్తెను ఆంధ్రదేశపు రాజున కిచ్చుటకు రాయబారములు నడిపియుండెను. భారతములో రాజసూయాధ్వరము చేయు ప్రయత్నమున జరుపబడిన దిగ్విజయ యాత్రాసందర్భమున సహదేవునివలన జయింపబడిన రాజ్యములలో "ఆంధ్రదేశము" గలదు.

(సభాపర్వాంతర దిగ్విజయ పర్వం 31 అధ్యా)

అశ్వమేధపర్వము- చతుర్థాశ్వాసమున యజ్ఞాశ్వముతో వెళ్ళిన అర్జునుడు దక్షిణ సముద్ర తీరంబున గల ద్రవిడ, ఆంధ్ర, రౌద్ర, మాహిషక, కేరళ కర్ణాట దేశాధీశులను జయించి యజ్ఞాశ్వమును తోలుకొని పోయినట్లు గలదు. ఉషాకన్య స్వప్నమందు గనిన పురుషుని గుర్తించుకొనుటకు ఆమె చెలికత్తె వ్రాసి చూపిన పటములలో ఆంధ్రరాజుకూడ గలడని చెప్పబడెను. ఈవిధముగా శ్రీమద్రామాయణ చరిత్ర జరుగుటకు పూర్వము మనోరథుని కాలమునుండియే 'ప్రాచ్యక' దేశభాగమైన యీదేశమునకు "ఆంధ్రదేశ" మను పేరు వచ్చినట్లు స్పష్టమైన చరిత్రి గలిగియుండగా మన ఊహలతో కల్పింపబడిన గాథల కెట్టి విలువయు గలుగబోదని వేఱుగా చెప్ప నక్కఱలేదు.

ఆంధ్రిరాజుయొక్క దరిమిలా వంశపరంపర మనకు దొరకుటలేదు. అది త్రేతాయుగములోని చరిత్రి. ద్వాపరయుగాంతమున జరిగిన మహాభారత యుద్ధములో ఆంధ్రుల ప్రశంస వచ్చినట్లు కనబడదు. వీరుభయపక్షములలో నే పక్షమునకును సాయపడి యుద్ధము చేసినట్లు కనుబడదు. కాశ్మీరరాజు పసిబాలుడుగా నుండుటవలన కాశ్మీర సైన్యములు భారతయుద్ధమున పాల్గొనియుండలేదని కల్హణపండితుడు తన రాజతరంగిణియందు వ్రాసియున్నాడు. భారతయుద్ధవర్ణనమునం దెచ్చటను కాశ్మీరసైన్యములు పాల్గొనినట్లు చెప్పబడి యుండలేదు. అటులనే నాటి ఆంధ్రరాజు ఏపక్షమునను చేరక తటస్థుడుగా నుండి యుండుటవలన ఆంధ్రిరాజుగాని, సైన్యములుగాని భారతయుద్ధవర్ణనమున గానిపించుటలేదు. కొందఱు ఆంధ్రిసైన్యములు భారతయుద్ధములో కౌరవపక్షమున చేరి పాండవులతో యుద్ధము చేసినట్లు మాతో వాదించి యుండిరి గాని వారు భారతములోని వాక్యముల నుదాహరించలేక పోయిరి. ఆంధ్రిసైన్యములు భారతయుద్ధములో పాల్గొని నట్లు తెలుపు వాక్యములు భారతమున చూపిన వారికి కృతజ్ఞులుగా నుందుము. అంతవరకును భారతయుద్ధములో పాల్గొనక తటస్థులుగా నుండినటులు ఒప్పుకొనక తప్పుటలేదు. భారతయుద్ధము కలిశక

ప్రారంభమునకు పూర్వము 36 వత్సరముల క్రిందట జరిగియున్నది. కలిశకము క్రీస్తునకుపూర్వము 3102 సంవత్సరములలో ప్రారంభించినది. క్రీ॥పూ॥ 3102 + 36 = క్రీ॥పూ॥ 3138 సంవత్సరము భారతయుద్ధ కాలము. భారతయుద్ధము ముగియగనే క్రీ॥పూ॥ 3138 సం॥రములోనే మగధలో బార్హద్రథవంశములో సోమాధి లేక మార్జారి యను వాడు మగధకు రాజధానియగు "గిరివ్రజ" పట్టణమున పట్టాభిషిక్తుడై నట్లు మత్స్య, వాయు, బ్రహ్మాండ, భాగవత, విష్ణు, కలియుగరాజ వృత్తాంతాది గ్రంథములు చెప్పుచున్నవి.

# మగధ రాజ వంశములు

| | వంశము పేరు | రాజుల సంఖ్య | రాజ్య కాలం | క్రీ॥పూ. నుండి | వరకు |
|---|---|---|---|---|---|
| 1 | బార్హద్రథ వంశము | 22 | 1006 | 3138 | 2132 |
| 2 | ప్రద్యోతవంశము | 5 | 138 | 2132 | 1994 |
| 3 | శిశు నాగ వంశము | 10 | 360 | 1994 | 1634 |
| 4 | నందవంశము, మహాపద్మనంద, ఆతని కుమాళ్ళు 8 మంది వెరశి 9 మంది వీనిని రెండుతరములుగా చారిత్రికు లెంచుచున్నారు. | 2 | 100 | 1634 | 1534 |
| 5 | మౌర్యవంశము, చంద్రగుప్తమౌర్య నింకో ఆతని వంశమువారు | 12 | 316 | 1534 | 1218 |
| 6 | శుంగవంశము | 10 | 300 | 1218 | 918 |
| 7 | కాణ్వవంశము | 4 | 85 | 918 | 833 |
| 8 | ఆంధ్రవంశము | 32 | 506 | 833 | 327 |
| 9 | ఆంధ్రభృత్యవంశము—వీరే గుప్త వంశపురాజులు | 7 | 245 | 327 | 82 |

| | | | |
|---|---|---|---|
| 10 పాన్వారు లేక పరమారవంశములో ఎనిమిదవాడగు విక్రమాదిత్యుని లగాయతు | 24 | 1275 | 82— క్రీ.శ. 1193 వఱకు |

పైజాబితాలోని మగధసామ్రాజ్యమును పరిపాలించిన రాజ వంశములలో ఎనిమిదవది ఆంధ్రవంశము. మనకు ఆంధ్రులను పేరు వచ్చుటకు కారణమైన ఆంధ్రరాజులగాయతు ఆంధ్రరాజ్యము ప్రత్యేకముగా ఆర్యాంధ్ర రాజులచే పరిపాలింప బడుచుండినది. ఆంధ్రరాజులగాయతు రాగా రాగా మనకు తెలియవచ్చిన ఆంధ్రదేశచరిత్రాకాలము కలిశకము 2269 సం॥ (అనగా క్రీ.పూ. 833 సం॥) ఐయున్నది. చివరి కాణ్వరాజు కొలువులోనుండిన శ్రీముఖు డనెడి ఆంధ్రుడు మగధ చక్రవర్తియైన కాణ్వరాజు 'సుశర్మ' యనువాని కొలువులో చేరి క్రమక్రమముగా మగధసామ్రాజ్యమునకు ముఖ్యమంత్రియు, సేనాధ్యక్షుడు నాయెను. ఆతడు మగధరాజుల కొలువులో ఆంధ్రసైన్యములను చేర్చి కొంతకాలమునకు చివరి కాణ్వరాజగు సుశర్మను సంహరించి ఆంధ్రసైన్య సహాయమున తాను మగధసామ్రాజ్యమునకు చక్రవర్తి యాయెను. ఆనా డాసేతుహిమాచలముగా గల భరత ఖండ మంతయు మగధచక్రవర్తులకు లోబడి యుండెడిది.

## శాతవాహన చక్రవర్తులు

మగధసామ్రాజ్యమును పాలించిన ఆంధ్రచక్రవర్తులను శాత వాహన, శాతకర్ణి లనెడి బిరుదులతో పురాణములు వర్ణించుచున్నవి. ఈ చక్రవర్తుల శాసనములలో కూడ ఆబిరుదములే కనబడుచున్నవి. ఈ వంశమునకు "ఆంధ్ర శాతవాహన వంశ" మని పేరు. 'శాత' మనగా సింహము. దానిని వాహనముగా గలవాడు "శాతవాహనుడు" లేక శాతవాహనుని బొమ్మను జాతీయజండాగా గల రాజులు "శాత వాహనరాజులు." సింహముపై నెక్కిన యోధుని బొమ్మతోగూడిన జాతీయజండాను కలిగినందున వీరికి "శాతవాహను"లను బిరుదు కలిగి నట్లు బుద్ధిమంతు లూహించుచున్నారు. ఆంధ్రజాతి మృగములలో

సింహము నెక్కువగా ప్రేమించెడి జాతి. వీరి మత సంబంధమైన దేవతలబొమ్మలలో సింహముపై నెక్కియుండిన స్త్రీ దేవత గలదు. ఆమెకు "సింహస్థా" యనెడి నామము గలదు.

కాత్యాయనీదేవి రాక్షస సంహారమునకై యుద్ధమునకు వెడలు నపుడు సింహవాహనముమీద నెక్కి వెళ్ళియున్నటుల దేవీభాగవత మున వర్ణితమైనది. ఆంధ్రదేశమున అనేక దేవాలయముల మీదను, గృహములముందు ప్రహరీగోడలోని సింహద్వారముల కిరుప్రక్కలను సింహవిగ్రహములు కానవచ్చును. ఆంధ్రజాతి సింహమువంటి బల, పరాక్రమ, గాంభీర్య, ఔదార్యములు గల జాతి. కనుకనే ఆజాతికి సింహము ప్రీతిపాత్రము, స్తుతిపాత్రము నైనది.

1941 సంవత్సరము మార్చినెల "గోష్ఠి" పత్రిక 129 పుట యందిట్లు వ్రాయబడియున్నది.

"అమరావతి శిల్పకాలము లగాయతు ఇటీవలి శతశిల్పి యొక్క సింహచిత్రములవఱకు ఆంధ్రజాతికి సింహముగుర్తే ఆదర్శప్రాయముగా నుండియున్నది. అంతర్వేది, మంగళగిరి, హంపివిజయనగరము, సింహాచలము మొదలుగా "నరసింహము" అనెడి దేవత ఆంధ్రుల కుపాస్య మూర్తి. దీనిని బట్టియే 'ఆంధ్రుడు' మానవులలో 'సింహము' వలె ప్రవర్తింప నిచ్ఛయించుచు ఎల్లప్పుడు నుద్రేకపూరితుడై, కార్య శూరుడై యుండును.

"సింహాసనాధిపత్యము" సింహముమీద కూర్చుండి ఆధిపత్యము వహించుట (అనగా ఉన్నతమాసన మలంకరించుట అని అర్థము) ప్రతి ఆంధ్రుని మనోరథమై యున్నది. ఆంధ్రులలో 'నరసింహము' అను పేరుగల వారనేకులు గలరు.

"నెమిలి బర్మాజాతికి చిహ్నము. బెంగాలు, అయోధ్య, జైన ప్రజలకు 'మత్స్యము' చిహ్నము. తమిళులకు 'చిలుక.' రాజరాజ యను రాజు, గోవు-దూడ చిహ్నమును గలిగి యుండెను. / విజయ

నగర రాజులు ఆదివరాహ చిహ్నము గలవారు. శాతవాహనులు, ఆంధ్రచక్రవర్తులు 'సింహ' చిహ్నము గలవారు. కళింగులకు ఏనుగు. ఈ మొదలగు చిహ్నము లందరికిని గలవు. ఆంధ్రులు సింహము మీద కూర్చుండిన యోధుని చిహ్నము గల జండా కలిగి యుండెడి వారు. అందువలన మగధలోని ఆంధ్రచక్రవర్తులకు "శాతవాహనులు" అను బిరుదు కలిగినది."

## ఆంధ్రచక్రవర్తులు

| వ. సం. | చక్రవర్తుల పేర్లు | రాజ్య | కలి సం॥లు నుండి—వరకు | క్రీ. పూ. నుండి—వరకు |
|---|---|---|---|---|
| 1 | శ్రీముఖశాతవాహన చక్రవర్తి | 23 | 2269 –2292 | 833 –810 |
| 2 | శ్రీకృష్ణశాతకర్ణి | 18 | 2292 –2310 | 810 –792 |
| 3 | శ్రీమల్లశాతకర్ణి | 10 | 2310 –2320 | 792 –782 |
| 4 | పూర్ణోత్సంగశాతకర్ణి | 18 | 2320 –2338 | 782 –764 |
| 5 | శ్రీశాతకర్ణి | 56 | 2338 –2394 | 764 –708 |
| 6 | స్కంధస్తంభిన్ | 18 | 2394 –2412 | 708 –690 |
| 7 | లంబోదరశాతవాహన | 18 | 2412 – 2430 | 690 –672 |
| 8 | ఆపీతక ,, | 12 | 2430 –2442 | 672 –660 |
| 9 | మేఘస్వాతి ,, | 18 | 2442 –2460 | 660 –642 |
| 10 | శాతస్వాతి ,, | 18 | 2460 –2478 | 642 –624 |
| 11 | స్కందశాతకర్ణి | 7 | 2478 –2485 | 624 –617 |
| 12 | మృగేంద్రశాతకర్ణి | 3 | 2485 –2488 | 617 –614 |
| 13 | కుంతలశాతకర్ణి | 8 | 2488 –2496 | 614 –606 |
| 14 | సౌమ్యశాతకర్ణి | 12 | 2496 –2508 | 606 –594 |

| | | | | |
|---|---|---|---|---|
| | B. F. | 239 | | |
| 15 | శాతశాతకర్ణి | 1 | 2508 –2509 | 594 –593 |
| 16 | పులోమశాతకర్ణి (ప్రథమపులోమ) | 36 | 2509 –2545 | 593 –557 |
| 17 | మేఘశాతకర్ణి | 38 | 2545 –2583 | 557 –519 |
| 18 | అరిష్టశాతకర్ణి. ఇతని రాజ్యకాలము పదవ సం॥లో (క్రీ. పూ-509 సం॥లో) శ్రీ ఆది శంకరుల జననము | 25 | 2583 –2608 | 519 –494 |
| 19 | హాలశాతవాహన | 5 | 2608 –2613 | 494 –489 |
| 20 | మండలక ,, | 5 | 2613 –2618 | 489 –484 |
| 21 | పురీంద్రసేన ,, | 21 | 2618 –2639 | 484 –463 |
| 22 | సుందరశాతకర్ణి | 1 | 2639 –2640 | 463 –462 |
| 23 | చకోరశాతకర్ణి | ½ | 2640 –2640½ | 462 –461½ |
| ,, | (అ)మహేంద్రశాతకర్ణి | ½ | 2640½–2641 | 461½–461 |
| 24 | శివశాతకర్ణి | 28 | 2641 –2669 | 461 –433 |
| 25 | గౌతమీపుత్ర(శ్రీ) శాతకర్ణి (ద్వితీయ వినిమయకూర) | 25 | 2669 –2694 | 433 –408 |
| 26 | రెండవపులోమశాతకర్ణి | 32 | 2694–2726 | 408–376 |
| 27 | శివ(శ్రీ)శాతకర్ణి | 7 | 2726–2733 | 376–369 |
| 28 | శివస్కందశాతకర్ణి | 7 | 2733–2740 | 369–362 |
| 29 | యజ్ఞ(శ్రీ)శాతకర్ణి | 19 | 3740–3759 | 362–343 |
| 30 | విజయ(శ్రీ)శాతకర్ణి | 6 | 2759–2765 | 343–337 |
| 31 | చంద్ర(శ్రీ)శాతకర్ణి | 3 | 2765–2768 | 337–334 |
| 32 | మూడవపులోమ(శ్రీ)శాతకర్ణి | 7 | 2768–2775 | 334–327 |
| | | 506 | | |

పైన చూపబడిన జాబితాదాఖలా ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు ముప్పదియిద్దరు కలి 2269సంవత్సరము లేక క్రీ.పూ. 833లగాయతు కలి 2775 లేక క్రీ.పూ.327సం॥ వరకు (506సం॥) అయిదువందల ఆఱుసంవత్సరములు రాజ్యము చేసియుండిరి. వీరికి పిమ్మట ఆంధ్రభృత్యు లనబడు "గుప్తవంశము" మొదటిరాజు 'గుప్త చంద్రగుప్తుడు' చివరి ఆంధ్రరాజులగు చంద్ర(శ్రీ), పులోమల సంహరించి క్రీ.పూ. 327సం॥ లో రాజ్యమునకు వచ్చియుండెను. అలెగ్జాండరు దండయాత్రాకాల మున మగధరాజ్య భాగమును కలుపుకొని పాటలీపుత్రమున పట్టాభిషేక మొనర్చుకొని పరిపాలించినవాడు గుప్తచంద్రగుప్తుడుగాని చంద్రగుప్త మౌర్యుడు కాడు. ఈవిధముగ తప్పుగ గుర్తించినటుల సటించి పాశ్చాత్య చరిత్రకారులు భారతదేశచరిత్రములో క్రీ.పూ. 3138సం॥లో జరిగిన భారతయుద్ధమున కిటీవల క్రీ.పూ. 1534సం.లో గావింపబడిన చంద్రగుప్తమౌర్యుని పట్టాభిషేక కాలమును క్రీ.పూ. 322సం॥లో జరిగినటుల కల్పించి భారతదేశచరిత్ర కాలములో క్రీ.పూ. 1534–322 =1212సం॥లు తగ్గించిరి. ఈవిషయములో పాశ్చాత్యులచే వ్రాయ బడిన వివరములన్నియు మాచే ప్రకటింపబడిన "The Plot in Indian Chronology" అను ఇంగ్లీషు గ్రంథములో చూడగలరు. క్రీ.పూ. 327 సంవత్సరములో ఆంధ్రులసామ్రాజ్యాధిపత్య మంతరించినది. కాని ఆంధ్ర శాతవాహన రాజవంశము లంతరింపలేదు. ఆంధ్ర రాజవంశము లంతః కలహముల కాలవాలమై సామ్రాజ్యమును ముక్కలుగా చేసి పంచు కొని ఎవరికి వారు స్వతంత్రులై అందరును అల్పరాజ్యములను పరిపా లించెడి రాజులైరి. ఈవిధముగా ఆంధ్రరాజవంశము 12విభాగము లైనటుల పురాణములు చెప్పుచున్నవి.

> "ఆంధ్రాణాం సంస్థితాః పంచ తేషాం వంశాశ్చ యే పునః,
> సప్తైవ తు భవిష్యంతి

బ్రహ్మాండపురాణము 77 అధ్యాయము 171వశ్లోకము.

(వాయుపురాణము 99–358)

అటుపిమ్మట అగ్నివంశపురాజులు ఇంకను విభాగములు అయియుండవచ్చును. పల్లవచేత, సేన, కదంబ, రాష్ట్రకూట, విష్ణుకుండిన, బృహత్ఫలాయన, బాణ, గాంగ, హోసల, రాజపుత్ర, శాలంకాయన, వాకాటక, వల్లభి, పైదుంబ, నోలంబ వంశములవారందరు ఆంధ్ర శాతవాహనవంశీయులకు చెందిన రాజబంధువులు. అందు రాజపుత్రులు అనగా రాజుల కుమాళ్ళు అని యర్థము. శాతవాహన రాజులకు కలిగిన సంతానములో జ్యేష్ఠ పుత్రులు రాజ్యమునకు వారసులు కాగా తక్కిన కుమాళ్ళకును, కుమార్తెల నిచ్చి వివాహ మొనర్చిన అల్లుళ్ళు మొదలుగాగల సన్నిహిత రాజబంధువులకును రాజపుటానాలో అల్పరాష్ట్రముల నేర్పరచి వారిని ఆరాష్ట్రములకు ప్రభువులుగా చేసియుండిరి. రాజపుత్రవంశములు అట్లు ఏర్పడినవే. వారినుండియే ప్రమర లేక పరమార, చపహాని లేక చాహుమాన, శుక్లలేక చాళుక్య పరిహార లేక ప్రతీహార అనబడు నాలుగు అగ్నివంశము లేర్పడినవి. అట్లేర్పడిన "అగ్నివంశము"లనేగాక రాజపుత్ర వంశములన్నిటిని బ్రహ్మక్షత్రులని పిలిచెడివారు. అగ్నివంశములకు మూలపురుషులైన పైనలుగురును వేదవేదాంగముల నధ్యయనము చేసిన సద్బ్రాహ్మణులు. వారిని గురించి పురాణ మిట్లు చెప్పుచున్నది :-

"ప్రమర స్సామవేదీ చ, చపహాని ర్యజుర్విదః।
త్రివేదీ చ తథా శుక్లో౽ థర్వణ స్స పరిహారకః॥

(భవిష్యమహాపురాణము-ప్రతిసర్గపర్వము)

తా॥ ప్రమరుడు సామవేదము నధ్యయనము చేసినవాడు, చపహాని యజుర్వేదాధ్యాయి, శుక్లుడు మూడువేదముల నధ్యయనము చేసినవాడు, పరిహారకుడు అథర్వణ వేదము నధ్యయనము చేసినవాడు.

కలి 2710 సంవత్సరమున (క్రీ.పూ. 392) పండితులును తపశ్శాలురునగు పైనలుగురిని అర్బుద పర్వతముమీద(రాజపుటానాలో గలదు) వారియందు క్షాత్రతేజస్సు నిల్పునటుల సంకల్పించి వారిచే అగ్ని

హోత్రమున హవిస్సులను వేల్పించి వారిని దేశములో నాల్గుభాగము లకు రాజులనుగా చేసియుండిరి. (ఇందునుగురించిన వివరములకు నాచే రచింపబడిన 'అగ్నివంశపు రాజులు' అనెడి గ్రంధమును చూడుడు.)

ఈవిధముగా ఆంధ్ర శాతవాహన వంశము అనేక విభాగములై భారతదేశము నంతను పరిపాలించి యున్నది. క్రీ.శ. పండ్రెండవ శతాబ్దములో కల్హణపండితునిచే వ్రాయబడిన రాజతరంగిణి గ్రంధములో ఆంధ్రశాతవాహన వంశజులు కాశ్మీరులోను, లాహోరులోను, అభిసార, ఉరగ, సింహపుర, దివ్యకటక, ఉత్తరజ్యోతిష (చివరి మూడును ఇప్పుడు ఆఫ్ఘనిస్థానములో అంతర్భూతమైనవి. మొదటివి ఇప్పటి కాశ్మీరులో చేరిపోయినవి.) అను క్షత్రియ జనపదరాష్ట్రములలోను క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దమునుండి పరిపాలించుచున్నటుల వ్రాసి యున్నాడు. లోహారువంశము, హిందూసాహివంశము (వీరు తోమర వంశీయులు) ఆంధ్రశాతవాహనులనుండియు, రాజపుత్రులనుండి ఏర్పడిన తోమరవంశము నుండియు ఏర్పడినవైయున్నవి. ప్రమర వంశము పరమార వంశము లేక పొన్వారు వంశము అని ప్రసిద్ధికెక్కినది. ఈవంశములోనే విక్రమాదిత్య శాలివాహన భోజరాజు లుద్భవించిరి. చపహానివంశమువారు చాహుమాన్‌లని పిలువబడిరి. అందు చపహాని కుమారులలో (వీరు తోమర వంశమువారలు) కేవలము క్షత్రియాచార ముల నవలంబించి క్షత్రియులుగానే పరిగణింపబడి రని "తోమరాః క్షత్రియాః స్మృతాః" అని పురాణమే చెప్పుచున్నది. ఈవంశములోనే పృథ్వీరాజు, జయచంద్రుడు, రాణీసంయుక్త మొదలగు మహామహు లుద్భవించిరి. శుక్లవంశము చాళుక్య వంశమనుపేరున ప్రసిద్ధి కెక్కినది. ఈ రాజులు దక్షిణాపథమున రాజ్యములు చేసియుండిరి.

అందు తూర్పుచాళుక్యులు తూర్పురాజ్యములను, పశ్చిమ చాళు క్యులు పశ్చిమ సముద్రతీర రాజ్యములను పరిపాలించి ప్రసిద్ధి కెక్కిరి. మహాభారతమును తెలుగున వ్రాయించిన రాజరాజ నరేంద్రు డీ చాళుక్యవంశములోనివాడు. క్రీస్తుశకమున కిటీవలి శతాబ్దులనుండి యీ చాళుక్యరాజులు క్షత్రియులుగా పిలువబడుటయే గౌరవముగా నెంచి

తమ వంశములను ప్రాచీన క్షత్రియ మూలపురుషులతో కలుపుకొని వంశవృక్షములను వ్రాయించుకొని శాసనములలో తాము క్షత్రియుల మని వ్రాయించుకొనిరి. పరిహార వంశీయులు బెంగాలుదేశమున రాజ్యములు చేసిరి. బంగాళా దేశములోని శాక్తేయ బ్రాహ్మణు లీశాఖకు చెందినవారు.

## కదంబ వంశపు రాజులు—ఆంధ్రులు

ఆంధ్ర శాతవాహన వంశమునుండి యేర్పడిన కదంబ రాజవంశమునకు మూలపురుషుడైన "మయూరశర్మ" మళయ్యాళ (కేరళదేశము) దేశమునకు క్రీ.పూ. ఆఱవ శతాబ్దములో రాజయ్యెను. ఈతని వంశములో 'కాకుత్స్థవర్మ'యను రాజు క్రీ.శ. 550సంవత్సరములో రాజ్యము చేయుచుండెను. (Ancient Dekkan P.27).

ఆకాలమున మళయాళ దేశమున బ్రాహ్మణులు లేకుండుటవలన 'మయూర శర్మ' తన జన్మదేశమైన గోదావరి మండలములోని "అహిక్షేత్రము" (అనగా సర్పవర మనెడి గ్రామము) నుండి బ్రాహ్మణ కుటుంబములను తీసికొనివెళ్లి మళయాళ దేశమున నెలకొల్పెను.

"దక్షిణఇండియా వర్ణములు, తెగలు" అను గ్రంథము 7సంపుటములుగా మద్రాసు దొరతనమువారిచే ప్రచురింపబడినది. అందు మళయాళ (కేరళ) దేశబ్రాహ్మణులను గురించి యిట్లు చెప్పబడినది:—

"బ్రాహ్మణులయొక్క లిఖితములైన కొన్ని గ్రంథములలో కదంబవంశజుడైన మయూరవర్మ కాలమున ఆంధ్రబ్రాహ్మణులు కొందఱు దక్షిణ కన్నడమునకు తీసుకొని పోబడిరని చెప్పబడియున్నది. పరశురాముని శాపానంతరము కదంబవంశములోనిమయూరశర్మ అహిక్షేత్రము నుండి బ్రాహ్మణులను తీసికొని వచ్చువఱకును ఆదేశమునందు బ్రాహ్మణులు లేరు. ఉత్తర కన్నడములోని 'బనవాసి' రాజధానిగా రాజ్యము చేసిన కదంబవంశమునకు మూలపురుషుడు "మయూర వర్మ" యని శాసనములు చెప్పుచున్నవి. (మయూర శర్మ, మయూరవర్మ యని

రెండువిధముల ప్రయోగములు ఆయనకు గలవు. మయూరశర్మ బ్రాహ్మణవంశమైన కదంబ వంశమునకు మూలపురుషుడు.)

నంబూద్రి బ్రాహ్మణుల కథలు, వ్రాతలన్నియు మయూరశర్మ వఱకును తీసికొని పోగలవు. మయూరవర్మచే బ్రాహ్మణులు కొనిరాబడి నపుడు వారు భట్టాచార్యులవారి (కుమారిలభట్టు) శిష్యులుగా నుండిరి. కాని పడమటి తీరమునకు వీరు వచ్చినపిమ్మట మళయాళ దేశపు వేదాంతగురువగు శంకరాచార్యులవారి (వీరి జననము క్రీ. పూ. 509సం) సిద్ధాంతముల నంగీకరించిరి.

పైగ్రంథముననే ఐదవ సంపుటములో శ్రీ సుబ్రహ్మణ్య అయ్యరు గారిట్లు వ్రాయుచున్నారు:—

"కేరళ మాహాత్మ్యములో వ్రాయబడిన దంతకథా పరంపర (కేరళదేశములోని) నంబూద్రీ బ్రాహ్మణులు అహిక్షేత్రమునుండి వచ్చినట్లుగా చెప్పును."

ఈ పైవాక్యములు కేరళ మాహాత్మ్యము, కేరళోత్పత్తి యను సంస్కృత గ్రంథములనుండి గ్రహింపబడినవి.

మయూరవర్మయును, భట్టాచార్యులవారును, శ్రీ శంకరాచార్యులవారును 'ఆంధ్రుల'ని ఆంధ్రమహాసభవారిచే ప్రచురింపబడిన 'ఆంధ్రప్రచలనము' అను చిన్న గ్రంథమున ప్రథమ ఆంధ్రసభానంతరము ప్రచురింపబడెను. మఱికొన్ని దంతకథలును పైవిధముననే చెప్పుచున్నవి. అని వ్రాసియుండెను.

"కనరా రాష్ట్రమును, మైసూరురాష్ట్రములోని ఉత్తరజిల్లాలను క్రీ.శ. మూడవ శతాబ్దమునుండి ఆఱవ శతాబ్దమువఱకు పరిపాలించిన కదంబవంశపు రాజులు బ్రాహ్మణులు." (వి. ఎ. స్మిత్ యొక్క అర్లీ హిస్టరీ ఆఫ్ ఇండియా గ్రంథము 43పుట చూడుడు). కేరళదేశమును క్రీ.పూ. ఆఱవశతాబ్దమునుండి క్రీ.శ. ఆఱవ శతాబ్దమువఱకు పరిపాలించిన కదంబవంశపు రాజులును వారిచే తీసికొని పోబడిన బ్రాహ్మణులును ఆంధ్రులైయుండిరి.

అట్లు గోదావరీమండలములోని సర్పవర గ్రామము (అహీ క్షేత్రము) నుండి కేరళదేశపు బ్రాహ్మణరాజగు మయూరశర్మ చే ప్రేరేపింపబడి వలసపోయిన ఆంధ్ర బ్రాహ్మణ కుటుంబములలో శివగురు వనెడి పండితుడు గలడు. ఆతడు కేరళదేశములోని "కాలటి" అగ్రహారమున స్థిరపడిన పిమ్మట ఆతనికి శ్రీ శంకర భగవత్పాదాచార్యులవా రవతరించిరి. కనుక శ్రీ శంకరులును, కేరళదేశములోని నంబూద్రి బ్రాహ్మణులును 'ఆంధ్రులై' యుండిరి. విశిష్టాద్వైత మత స్థాపనాచార్యులైన శ్రీ రామానుజాచార్యుల వారింటిపేరు 'ఆసూరివారు.' ఇంటిపేర్లు తెలుగు వారికి మాత్రమే కలవు. తమిళులకు ఇండ్లపేర్లు లేవు. శ్రీరామానుజాచార్య స్వాములు తెలుగుదేశమునుండి పోయి అరవదేశములో స్థిరపడిన ఆంధ్ర బ్రాహ్మణ కుటుంబమునకు చెందినవారై యున్నారు. అటులనే ద్వైత మత స్థాపకులగు శ్రీమధ్వాచార్యస్వాములవారి యింటిపేరు 'నడిమింటి' వారు. వీరును కర్ణాటదేశమున నివసించిన ఆంధ్రబ్రాహ్మణ కుటుంబమునకు చెందినవారైయుండిరి. గొప్ప మతకర్తలై పీఠాధిపతులైన శ్రీ శంకర, శ్రీరామానుజ, శ్రీమధ్వాచార్యులను ఆచార్యత్రయమును ఆంధ్రులై యున్నారు. క్రీ.శ. 15వ శతాబ్దములోని శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులును ఈయనకుమారుడు శ్రీతిరువెంగళయ్యగారును, క్షేత్రయ్యపదములను రచించిన క్షేత్రయ్యగారును (17వ శతాబ్దము) భక్తిజ్ఞానవైరాగ్యములను సంగీతమున మేళవించి అసంఖ్యాక కృతులను రచించిన త్యాగరాజుగారును (18వశతాబ్దము) ఆంధ్రమాత కనిన బిడ్డలై యున్నారు. జైన, బౌద్ధమతముల వ్యాప్తి నరికట్టి వైదిక మత సంరక్షణమొనర్చిన "కుమారిలభట్టు" (557 B.C ) ఆంధ్రుడై యున్నాడు. నాలుగు వేదములకు భాష్యములను రచించి ప్రపంచమున కీనాడు వేదార్థమును దెలిపిన మహామహుడు శ్రీ విద్యారణ్యస్వామి ఆంధ్రుడు.

"ఆంధ్రత్వ మాంధ్రభాషా చ, ప్రాభాకర పరిశ్రమః।
తత్రాపి యాజుషీ శాఖా నాల్పస్య తపసః ఫలం॥"

(అప్పయ్యదీక్షితులు)

"తా॥ఆంధ్రుడుగా పుట్టుట,ఆంధ్రభాష మాతృభాషగలవాడుగా నుండుట, వైదిక ధర్మావలంబి యగుట అందునను యజుశ్శాఖా ధ్యాయి యగుట అల్పతపస్సు గలవానికి లభ్యము కానేరదు. అనగా పూర్వజన్మమందు గొప్ప తపస్సు చేసినవానికే ఆంధ్రభాషను మాట్లాడు ఆంధ్రుడుగా పుట్టు భాగ్య మబ్బునని తాత్పర్యము."

అని అప్పయ్యదీక్షితులవారు చెప్పియున్నారు. వీరు ఆంధ్రులని వేఱుగ చెప్పవలసిన పని లేదు. (కొందరు వీరు ద్రవిడశాఖకు చెందినవా రని అనుచున్నారు. అటులైనను వీరు "ఆంధ్రదేశము"న స్థిరనివాసము లేర్పరచుకొని (ద్రవిడభాషను మఱచి) ఆంధ్రమునే మాతృభాషగా చేసికొని ఆంధ్రదేశమున నివసించిన ద్రవిడులని చెప్పుట సమంజసము. ఎటులైనను వారాంధ్రులనియే చెప్పుట న్యాయము.) ఇంకను అనేకులు మహామహులు ఆంధ్రులలో అన్ని శాఖలలోను గలరు.

## శైవమత వ్యాపకులు

ఆంధ్రదేశములో శైవమతవ్యాప్తి నడంచిన శైవమతస్థు లెందరో కలరు. వారిని నిచట స్మరించుచుంటిమి. వీరందరును ఆంధ్రులు.

1 శ్రీరేవణారాధ్యులు:- వీరు సోమేశ్వరలింగానుగ్రహంబున జన్మించిరి. వీరిది ఆత్రేయస గోత్రము.శ్రీశైలమునకు ఉత్తర ముగానున్న బళ్ళారి జిల్లాలోని కొలనుపాక గ్రామనివాసులు. (కొలనుపాక గ్రామము నైజాములోకూడ నొకటి గలదు. ఇదికూడ కావచ్చునని కొంద రనుచున్నారు. కాని ఆ గ్రామము శ్రీశైలమునకు పశ్చిమోత్తరముగా నుండును. కాని సరిగా ఉత్తరము కానేరదు.) శ్రీశైలము కర్నూలు జిల్లాలోనిది. కర్నూలునకు ఉత్తరముగా బళ్ళారి కలదు. శ్రీశైలమునకు బళ్ళారి సమీపములో నున్నందున హద్దులను చెప్పునపుడు సమీపములోనున్న దానిని చెప్పుటయే ఆచారమును న్యాయమునుకూడ నైయున్నది. (బుద్ధిమంతులు విచారించి నిర్ణయింప గల రని దీని నింతటితో విడచుచుంటిని.)

2 పల్లినాథుడు: ఈయన ఏకోరామారాధ్యుని కుమారుఁడు. ఈయన కొలనుపాకలో ఒక తటాకమును త్రవ్వించి గ్రీష్మకాలములో ఒక రాజుయొక్క దప్పిని దీర్చినందున ఆరాజువలన 'మల్లంపల్లి' అగ్రహారమును పొందెను. ఆగ్రామమున నివసించిన వీరికి 'మల్లంపల్లి' వారనియింటిపేరు కలిగినది. వీరిది హారితస గోత్రము. వీరు ఆంధ్రులు.

3 నీలకంఠ శివాచార్యులు: తండ్రి విశ్వేశ్వరారాధ్యులు. తల్లి గౌరీదేవి. భారద్వాజస గోత్రము. హైదరాబాదులోని "కరీంనగరు" జిల్లాలోని కాళేశ్వరమువీరికాపురము. ఈయనకు: 1 సోమేశ్వర 2 అఘోరనాథ 3 కాళేశ్వర 4 శ్రీగిరీశ్వర అను నలుగురుకుమారులు గలరు.

ఈ నీలకంఠాచార్యులవారు ప్రస్థానత్రయ భాష్యములను రచించినారు. ఈతనికి "బోధాయన" మహర్షి ఉపనయనము చేసినట్లు నీలకంఠ విజయములో గలదు. ఈతఁడు ఆంధ్రుఁడు.

4 విశ్వారాధ్యులు:- తండ్రి సోమేశ్వరుడు. తల్లి భవాని. వీరిది కాశ్యపస గోత్రము. నైజాములోని 'పాలకుర్తి' యను గ్రామము వీరి నివాసము. ఇంటిపేరు ఇవటూరివారు. వీరు ఆంధ్రులు. ఈయన క్రీ.శ. 12వశతాబ్దము వాడని అందురు. విచారించవలెను.

5 వేమనారాధ్యులు:- వీరింటిపేరు ములుగువారు. కౌండిన్యస గోత్రము. తండ్రి మల్లికార్జునుడు. తల్లిపేరు తెలియదు. వీరిది నైజాములోని ములుగు గ్రామసమీపమున గల 'బెలిదేవి' యనెడి గ్రామము. వీరును 12వశతాబ్దము వారు అని చెప్పబడినది.

6 శ్రీపతిపండితులు:- శ్రీశైలనివాసి. తండ్రి మల్లికార్జునుఁడు. తల్లి భ్రమరాంబ. ఈతడనంత భూపాలుడనెడి రాజునకు గురువు. ఈ శ్రీపతిపండితులు బెజవాడ యందే నివసించిరి. ఈతడు ఆంధ్రుడు. 11వ శతాబ్దమువాడు.

7 శివలెంక కుంచెస పండితులు:- వీరు కాళహస్తి నివాసులు. వీరిది సాంఖ్యాయనస గోత్రము. ఈయన తాతగారు 'సోమశంభుడు.'

వీరు గౌడదేశములోని "గోళకి" మతమునకు కూడ ఆధిపత్యమును వహించిరి. ఈయన 11వ శతాబ్దివా డనుచున్నారు. ఇంకను పరిశోధించ తగియున్నది.

8 మల్లికార్జున పండితులు:- గోదావరి జిల్లాలోని ద్రాక్షారామ నివాసి. తండ్రి భీమన పండితుడు. తల్లి గౌరాంబ. గౌతమస గోత్రము. శివతత్త్వ నాదము, లింగోద్భవ దేవ గద్య, అమరేశ్వరాష్టకము మొదలగు గ్రంథములను రచించెను. ఈతని చరిత్రము గల శిలాశాసనము గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని చందవోలుగ్రామమున గలదు. దాని నకలు ఆంధ్రసాహిత్య మండలివారు ప్రకటించిన "శివతత్త్వసార" మనెడి గ్రంథములో గలదు. వీరింటిపేరు తెలియదు. కాని వీరిప్రాముఖ్యము ననుసరించి వీరిపేరే వీరివంశీయులకు ఇంటిపేరైనది. అనగా "మల్లికార్జున పండితారాధ్యులవారు"అని ఏర్పడినది. వీరు ఆంధ్రులు. వీరందరు వైదికధర్మానుసారులై వర్ణాశ్రమ ధర్మాదుల ననుసరించుచు శైవమతవ్యాప్తి నొనర్చినవారు.

9 విశ్వేశ్వర శివ దేశికులు:- వీరు శైవమతమును స్థాపించి పాలించియుండిరి. కాకతీయ గణపతిదేవుని ప్రాపున శైవమత వ్యాప్తి నొనరించిరి. వీరు శివతత్త్వ రసాయనము, పురుషార్థ సారము, మొదలగు గ్రంథములను రచించిరి. శ్రీ గణపతి దేవ చక్రవర్తికి వీరు గురువర్యులైయుండిరి. ఈయనగారి వంశీయులు "శివదేవునివారు" అనెడి ఇంటిపేరున ఇప్పుడు వ్యవహరింపబడుచున్నారు. వీరిది శ్రీవత్సస గోత్రము, ఆపస్తంబ సూత్రము, యజుశ్శాఖ. వీరు ఆంధ్రులు. 14వ శతాబ్దికి చెందినవారు.

10 ముదిగొండ వీరభద్రారాధ్యులు:- వీరు భారద్వాజస గోత్రజులు. వినుకొండ తాలూకాలోని 'తెల్లపాడు అగ్రహారము' వీరి కాపురము. వీరిచే "సిద్ధాంతోత్తర కౌముదీ" "చిన్మయ దీక్ష" అను గ్రంథములు రచింపబడినవి.

11 శివపురపు బ్రహ్మయ్య లింగారాధ్యులు:- వీరిది కౌండిన్యస గోత్రము. వెంకటగిరి ప్రభువుచే సన్మానింపబడి "కుంకుపాడు" అను అగ్రహారమును పొందెను (ఇది వినుకొండ తాలూకాలోనిది). ఈయన గారు అక్కన్న, మాదన్నల కాలపువాడు. ఈయనగారి వంశీయులు "శివపురపు" వారను ఇంటిపేరున పిలువబడుచున్నారు.

## వీర శైవ మతము

శైవ మతస్థులలో సంఘ సంస్కార మొనర్చినవారు గలరు. వీరు వర్ణాశ్రమాచారముల వదలి, "లింగధారు"లైనవారందరును ఒకటే కుల మని అనెడివారు. దీనికి "వీర శైవ మత" మని పేరు. వీరు మత, సంఘ సంస్కారులు. వర్ణాశ్రమ ధర్మ భేదములను పాటింపరు. ఈ మత స్థాపకుడు, 'బసవేశ్వరుడు.' ఈతడు ఆంధ్రుడు. నియోగి బ్రాహ్మణుడు. ఇంటిపేరు బండారువారు. వీరి కాపురము తెలంగాణాలోని "కల్యాణ పురము,'' బిజ్జలరాజు పరిపాలనకాలములో బసవేశ్వరుడు ఆయనవద్ద మంత్రిగా నుండియుండెను. (క్రీస్తుశకము 12వ శతాబ్దము). ఈతడు సంఘ సంస్కారి యై కులభేదములను పాటింపక లింగధారణ మాత్రమే చాలునని వైదిక సంస్కారములైన ''ఉపనయనాది సంస్కారము'' లను త్యజించియున్నాడు. ఈతని మేనమామ యగు ''బలదేవ మంత్రి'' తాను వైదిక ధర్మావలంబి యయ్యు తన కుమార్తెను మేనల్లు డైన బసవేశ్వరున కిచ్చి వివాహ మొనర్చియున్నాడు. అందువలన బ్రాహ్మణసంఘమునుండి వీరుభయులును బహిష్కరింపబడిరి. ఈ బస వేశ్వరుని మత మవలంబించిన వారందరు 'లింగాయతు' లనియు, వారి మతమునకు ''లింగాయతు'' మతము లేక ''వీరశైవ'' మత మనియు పేరులు. లింగాయతులు లింగబలిజులని పిలువబడుచున్నారు.

## రాజ పుత్రులు

రాజపుటానాలో అల్ప రాజ్యములను కల్పించి ఈయబడిన ఆంధ్ర శాతవాహన చక్రవర్తుల కుమారులును ఇతర రాజబంధువులును

'రాజపుత్రు'లను నామమున ప్రసిద్ధికెక్కిరి. వీరలు ముప్పది ఆరు వంశములుగా ఏర్పడిరి. కాని క్రీస్తుశకము పదునారవ శతాబ్దములో వ్రాయబడిన "పృథ్వీరాజరాసా" యనెడి గ్రంథమున నీయబడిన జాబితాలో ఇరువది రెండు (22) శాఖల పేరులు మాత్ర మీయబడినవి. మిగిలిన పదునాలుగు శాఖలును ఆనాటికి నశించి యుండవచ్చును.

ఆ శాఖల పేరులు:- 1. రవి 2. శశి 3. యదు 4. కాకుత్స్థ 5. పరమార 6. సదావర లేక తోమర 7. చౌహాన్ 8. చాలుక్య 9. భిండక 10. సిలార 11. అభీర 12. తోయమట లేక మక్వానా 13. చపోత్కట 14. పరిహార 15. ధాన్యపాలక 16. రాజ్యపాలక 17. నికుంప 18. హూణ 19. గుహిల లేక గుహిలపుట్ర 20. రాథోడు 21 కారట్టపాల 22. అనిగ. ఈ పేర్లు కొద్దిమార్పులతో 'కుమారపాల చరితము'న కూడగలవు. అందు:-

1. కాకుత్స్థ వంశమువారిది 'గ్వాలియరు' రాష్ట్రము.
2. పరమార వంశమువారిది 'మాల్వా.' (ఉజ్జయిని ముఖ్యస్థానము)
3. సదావర లేక తోమర వంశమువారిది "ఢిల్లి."
4. చాహుమాన వంశమువారిది "సంభార్."
5. ఛందాక లేక ఛండెవారిది "జిఝూటి." (బుందేలుఖండు అని ఇప్పటి పేరు). ఇది నెగిరు భిండకవంశము కావచ్చును.
6. సిలారా లేక సిలాహారులది 'తానారాష్ట్రము.'
7. ఆభీరులది దక్షిణఇండియాలోని రాజ్యము.
8. ఛపోట్కటులది 'అనహల్వాడారాష్ట్రము.'
9. పరిహారులది 'కనోజి', 'మండవార్.'
10. గుహిలాటులది మీవాడును కథియవాడులోని మంగ్రోలును.

యాదవ, ఛాటీ, జాడేజా, చూడాసమ అనెడి ఇతర కులముల వారు యుద్ధవిద్యయందు ఆరితేరిన శాఖలు. ఇవి కథియవాడులో గలవు. వీరి రాజ్యములు బియానా, మధుర, మహావన అనునవి ఐయున్నవి.

రాజపుత్రు లనబడు శాఖలన్నియు ఆంధ్ర శాతవాహన వంశమునకు చెందిన బ్రాహ్మణశాఖలు. వీరికి రాణాలనునది బిరుదనామము. వీరందరును దేశములను కొల్లగొట్టి స్త్రీ బాల వధాదులను చేయుచు తిరుగుచుండెడి హూణ, ఘూర్జరులను మ్లేచ్ఛులకు పుట్టినవారని పాశ్చాత్య పండితులును వారి ననుసరించి భండార్కరుగారును వ్రాసియుండిరి. దానిమీాద పండిట్ మోహన్‌లాల్ విష్ణులాల్ పాండియా అనెడి పండితుడు పైవారి వ్రాతలను ఖండించుచు గ్రంథమును వ్రాసి రాజపుటానాలోని రాణాలందరును బ్రహ్మక్షత్ర వంశమునకు చెందిన బ్రాహ్మణులనియు, వారు వల్లభిరాజ వంశస్థు లనియు, డెబ్బదిఅయిదు సంవత్సరముల క్రిందటనే ఋజువు పరచియుండెను.

క్రీస్తుపూర్వము 1218సంవత్సరమునుండి క్రీస్తుపూర్వము833సంవత్సరమువరకును రాజ్యముచేసిన శుంగ, కాణ్వ వంశములు రెండును బ్రాహ్మణ వంశములు. అందు శుంగవంశపు మూలపురుషుడు 'శుంగ భారద్వాజ' సగోత్రజుడైన ఆంధ్ర బాహ్మణు డని కొందరనుచున్నారు. అనేకులు చరిత్రకారులావిషయమున మూకీభావము వహించిరి. కాణ్వ రాజులు ఆంధ్రులే ఐయున్నారు. ఈవిషయమును గురించి కణ్వశాఖీయుడగు శ్రీకనుపూరి సీతారామయ్యగారు ఇట్లు వ్రాయుచున్నారు:-

కా ణ్వ శా ఖ వా రాం ధ్రు లు

కణ్వమహర్షి మన దేశభాష యగు నాంధ్రభాషకు వ్యాకరణమును రచించియున్నాడు.

"అధోక్షజ ఫక్కిక"యనెడి ఆంధ్ర వ్యాకరణ గ్రంథమునందు ఆంధ్ర వ్యాకరణ కర్తలు ఇట్లు పేర్కొనబడిరి:-

"వాక్పతిం పుష్పదంతం చ కాణ్వం సోమ మథర్వణమ్॥
హేమచంద్రం నమస్కృత్య వక్ష్యేఽధోక్షజ ఫక్కికామ్॥"

మఱియు:-

"బార్హస్పత్యాని సర్వాణి కాణ్వం వ్యాకరణం విదుః ।
కరోమ్యథర్వణంశబ్దం సర్వలక్షణలక్షితమ్ ॥" (అథర్వణకారికలు)

"ఆథర్వణాని కాణ్వాని బార్హస్పత్యాని సంవిదన్
కౌముదీ మాంధ్రశబ్దానాం సూత్రాణి చ కరోమ్యహం."
(ఆంధ్ర కౌముదీ)

పై ప్రమాణములవలన కణ్వమహర్షి ఆంధ్ర వ్యాకరణమును రచించినట్లు స్పష్టముగా తెలియు చున్నది.

ఆంధ్రదేశమున కణ్వానది కలదని ప్రమాణము కలదు:

"ఆంధ్ర భూమండలీ మధ్యం సంఫుల్ల సరసీరుహామ్ ।
గౌతమీ–సింధు–కౌంతేయ–కణ్వానద్యో జగన్నుతాః॥"
(భీమేశ్వర పురాణము 25 పుట)

(ఈ కణ్వానది యేదియో గుర్తింపరాకున్నది.)

కణ్వ మహర్షి గోత్రకర్త. సూత్రకర్త యగు బోధాయనుడు కణ్వుని కుమారు డని తెలియుచున్నది.

"బోధాయన పితృత్వాచ్చ ప్రశిష్యత్వా ద్దివస్పతేః ।
యాజ్ఞవల్క్యస్యశిష్యత్వాత్ కణ్వోఽభూన్మహతాం మహాన్॥"
(ఆదిత్య పురాణము, ఉత్తర ఖండము, 2వఅధ్యాయ. 33శ్లో.)

తా॥ బోధాయన మహర్షి యొక్క తండ్రి యగుటచేతను, సూర్యునికి ప్రశిష్యు డగుటచేతను, యాజ్ఞవల్క్య మహర్షి శిష్యు డగుటచేతను కణ్వమహాముని మహానుభావులైన మునులలో గొప్పవా డని తాత్పర్యము.

"కాణ్వాయ బౌద్ధాయనాయ."
(బోధాయన గృహ్యసూత్రము 3-13)

తా॥ కణ్వుని పుత్రుడు బౌద్ధాయను డని అర్థము.

శుక్ల యజుర్వేదమును సూర్యునియొద్ద ప్రథమమున అధ్యయనము చేసినది యాజ్ఞవల్క్యుడు. ఆయనవద్ద అధ్యయనము చేసిన శిష్యులలో

ప్రథముడు కణ్వామహర్షి. ఈయనకుమారుడు బోధాయనుడు. ఈయన బోధాయన సూత్రములను ధర్మశాస్త్రమును రచించిన సూత్రకర్త. కణ్వామహాముని ఆంధ్రుడు. కాణ్వ శాఖాఽధ్యయనము చేసిన కాణ్వ బ్రాహ్మణులు విస్తారముగా ఆంధ్రదేశమున గలరు. వీరికి ప్రథమశాఖా బ్రాహ్మణు లని పేరు. వీరిలో వైదిక, లౌకిక శాఖా భేదములు గలవు. కణ్వామహాముని తెలుగు వ్యాకరణమును రచించి యుండుటచే ఈయన తప్పక ఆంధ్రుడని దృఢపడుచున్నది. ఈయన ఆశ్రమము "కణ్వానదీ" తీరమున గలదు. ఈ "కణ్వానది" కృష్ణా నది యుపనదులలో నొకటి కావచ్చునని సందేహవాక్యములతో చెప్పుచున్నారు. ఇదమిత్థమని నిర్ణయించుట కవకాశము కలుగలేదు. అవకాశము కలిగిన సరియైన నిర్ణయము చేసి ప్రకటించగలము. శకుంతలను పెంచిన దీ కణ్వుడే. కాణ్వ శతపథ బ్రాహ్మణమునందీ శకుంతలయొక్కయు, ఆమె కుమారుడును భారత చక్రవర్తియునగు భరతుని యొక్కయు, కణ్వుని ఆశ్రమము యొక్కయు నామములు స్మరింపబడినవి.

"అథ తృతీయయా శకున్తలా నాలపిత్యప్సరా భరతం దధే పరః సహస్రా నిన్ద్రాయాఽశ్వాన్మేధ్యాన్య ఆహర ద్విజిత్య పృథివీగ్ సర్వామితి."

(కాణ్వ శతపథ బ్రాహ్మణము. 139కాండ.39అధ్యా.4బ్రా.14కం)

"ఏతద్ విష్ణోః క్రాన్తం తేనహైతేన భరతో దౌష్మన్తి రీజే"

(కాణ్వ శతపథ 139కాండము. 39అధ్యా. 4బ్రాహ్మణము12కం.)

"నాలపిత్య"మనెడి కణ్వాశ్రమమునకు చెందిన అప్సర యగు శకుంతల దుష్యంతునివలన భరతుని కనెను. పిమ్మట భరతుడు భారత వర్షము నంతను జయించి వేయి అశ్వమేధ యాగముల నింద్రుని గుఱించి చేసెను. దీనివలన కణ్వాశ్రమమునకు "నాలపిత్య"మను పేరుండినట్లు తెలియుచున్నది. శుక్లయజుశ్శాఖకు చెందిన 'మాధ్యందిన' శాఖవారు ఉత్తర హిందుస్థానమున విశేషముగా గలరు. పర్యవసానమేమన కణ్వాశ్రమము ఆంధ్రదేశమున గల కణ్వానదీ తీరమున గలదు.

కణ్వుడు ఆంధ్ర వ్యాకరణ పితామహు డగుటవలన ఆత డాంధ్రు డని స్పష్టము.

వేదవ్యాసుడు భారత యుద్ధకాలమునకు పూర్వమే గలడు. భారతయుద్ధకాలము క్రీస్తుపూర్వము 3138సం. ఆనాటికి భీష్ముడు 236 సంవత్సరములవయస్సుగలవాడు. భీష్ముడును వేదవ్యాసులును కొంచెము ఇంచుమించుగా సమవయస్కు లని చెప్పవచ్చును. కనుక వేదవ్యాసుని జననము క్రీ. పూ. 3138 + 236 = 3374 B.C. వేదవ్యాసుల శిష్యుడు వైశంపాయనుడు. ఆతని కాలము 3300 B.C.గా నిర్ణయించవచ్చును. వైశంపాయనునియొద్ద యాజ్ఞవల్క్యుడు కృష్ణ యజుర్వేదమునభ్యసించెను. గురుశిష్యులమధ్య భేదాభిప్రాయముగలిగినం దున యాజ్ఞవల్క్యుడు సూర్యు నారాధించి శుక్లయజుర్వేదము నభ్య సించి లోకమున కనుగ్రహించెను. ఉపనిషత్తులలో మేటియగు "బృహ దారణ్యకోపనిషత్తు" శుక్లయజుర్వేదము లోనిది. అది యాజ్ఞవల్క్యుని వలన భూలోకమునకు తేబడినది. కనుక యాజ్ఞవల్క్యుని కాలము కలి పూర్వము 198 లేక క్రీ.పూ. 3300గా నిర్ణయించవచ్చును. యాజ్ఞ వల్క్యుని శిష్యుడైన కణ్వుడు శుక్లయజుస్సులో నొకశాఖను ప్రథమ మున అభ్యసించినందున అది "ప్రథమశాఖ" యను పేరును పొంది నది. దీనికే 'కాణ్వ శాఖ' యని పేరు. కనుక కణ్వుడు క్రీస్తుపూర్వము 3300కాలపువాడని లెక్క తేలుచున్నది. క్రీస్తుపూర్వము 3300 + 1954 A.D.=5254సంవత్సరములక్రిందట కణ్వుడు గలడని మనము నిర్ణయిం చుకొన వచ్చును. కాని భరతుడును వాని తల్లియగు శకుంతలయు తండ్రియగు దుష్యంతుడును తాతయగు కణ్వుడును ద్వాపరయుగము నాలుగవపాదములో—అనగా రెండుప్ప రలక్షలసంవత్సరముల క్రిందట నున్నట్లు పురాణప్రసిద్ధి కలదుకదా! కనిబట్టి వారు వేరు కావచ్చునని తోచుచున్నది.

ఇవి కాక ఆంధ్రులచరిత్రలో ఇప్పటికి దొరకిన శాసనముల ననుసరించి చతుర్వర్ణములకు చెందిన అనేకములగు ఆంధ్రరాజ కుటుంబములు వర్ణితములయి యున్నవి. సమగ్రమైన ఆంధ్రులచరిత్ర

వ్రాయునపుడు వాటిప్రశంస రాగలదు. గ్రంథవిస్తరభీతిచే ఇచట నవి ఈయబడలేదు.

## ఆర్య శాఖలు

భరత ఖండమున వివిధ రాష్ట్రములలో నివసించుచుండినదియు వర్ణాశ్రమ ధర్మముల ననుసరించుచు వైదిక ధర్మముల నాచరించునదియు నగు ప్రజా సమూహ మంతయు ఆర్యజాతీయులై యుండిరి. ఉత్తర ప్రదేశ్ లో హిందీ మాటలాడెడివారలును, బెంగాలులోని బెంగాలీలును, బీహారీలును, కళింగులును, ఓఢ్రులును, సుంహ్ములును, పుండ్రులును, ఆంధ్ర దేశములోని ఆంధ్రులును, ద్రవిళ దేశములోని తమిళులును, కేరళులును, కర్నాటకులును, మహారాష్ట్రులు, పాంచాలురు, మద్రులు, కాంభోజులు, గాంధారులు, కాశ్మీరులు, నేపాలీలు, త్రిగర్తులు మొదలుగాగల భారతీయులందరును స్వచ్ఛమైన ఆర్యజాతివారలై యుండిరి. వారితోబాటు వారియందు అనులోమవిలోమ సాంకర్యమున జనించిన మిశ్రమ కులములవారు కూడ వారిప్రక్కనే నివసించుచు వారికి నిత్య జీవితమున సర్వ విధముల తోడ్పడుచు జీవించుచుండెరి.

మ్లేచ్ఛులుగా పరిగణింప బడిన శాఖలు:

పౌండ్రకులు, ఓఢ్రులు, ద్రవిడులు, కాంభోజులు, యవనులు, శకులు, పారదులు, పహ్లవులు, చీనులు, కిరాతులు, దరదులు, ఖశులు, బర్బరులు, హారులు, హూణులు, పరశకులు, బాహ్లీకులు మొదలయిన క్షత్రియ శాఖలును యయాతికుమారులలో తుర్వసుని సంతానము నూరుగురును పశ్చిమోత్తర భారతమున, పశ్చిమ ఆసియాలోని రాష్ట్రములకు ప్రభువులై అచ్చటనే స్థిరపడిన వారి సంతాన పరంపరలును మ్లేచ్ఛులుగా పరిగణింపబడిరి. తుర్వసుని సంతానము తుర్వసులనియు లేక తురుష్కులనియు పిలువబడిరి. వీరిచే ఆక్రమింపబడిన దేశములు తురుష్క స్థానము (Turkey) రష్యన్ తురుష్కస్థానము (Russian Turkistan) అయియున్నవి. ఇటీవలికాలమున క్రీ.శ. 11, 12 శతాబ్దములలో వీరు మహమ్మదీయులుగా చేయబడిరి.

అందు సంఘమునుండి బహిష్కృతులయిన బాహ్లీకు లనేకులు పోయి హిమాలయముల కుత్తరముగా పశ్చిమ భాగమున గల "బాక్" నగరము ప్రధాన స్థానముగా గల దేశమున నివసించిరి. శకులు నివసించిన దేశము "శాకస్థాన" మని (ఇది పర్షియాలో దక్షిణ పశ్చిమముగా గలదు.) పేరొందినది. "పరశకులు" పోయి నివసించినభూమి 'పారశీక' మైనది. ఇందే పల్లవులు కూడ (దక్షిణమున) నివసించిరి. బహిష్కృతులయిన భారతీయ క్షత్రియ జాతివారగు యవనులు భారతమున గల యవన రాష్ట్రములనుండి అసంఖ్యాకులుగా వెడలిపోయిరి. అట్టివారిచే ఆక్రమింపబడిన ప్రదేశము "అయోనియా" యని పేరుపొందినది. అందు నివసించినభారతీయక్షత్రియశాఖవారు 'అయోనియను' లనబడిరి. కాలము గడచుచుండగా ఉత్తర ఐరోపానుండి క్రీ.పూ. వేయిసంవత్సరములక్రింద దిగివచ్చిన "గ్రీకు" లను పేరుగల మోటుజాతివారివలన "అయోనియను"ల నాగరికత యంతయు నాశన మొనర్పబడినది. అయోనియనులును గ్రీకులునుకలిసి సాంకర్యమును జెందిరి. అయోనియా దేశము జయించిన జాతివారల పేరున "గ్రీస్" అని పిలువబడినది. అందు నివసించుచుండిన అయోనియనులు కూడ గ్రీకుల సాంకర్యమున 'గ్రీకు' లని పిలువబడిరి. కాని నాగరికులగు అయోనియనులతో రక్తసంబంధము కలిగినందున గ్రీకులు క్రమక్రమముగా నాగరికులయి అయోనియనులతో మిశ్రమమయి పోయిరి. క్రూరత్వములో ఉభయులును సమానులైనందున అది ఆ మిశ్రమజాతులందు మితిమీరిపోయినది. ఉభయజాతి వారలును నాగరికులగు అయోనియనుల పేర్లనే హెచ్చుగా పెట్టుకొనుచుండిరి. అతిపురాతనకాలమున భారతవర్షమునుండి పారశీకమునకును అచటినుండి క్రమక్రమముగా ఐరోపాకును పోయి అచట గిరిగహ్వరములయందు నివసించెడి భారతీయులయిన మోటుజాతి వారును భారత దేశమునుండి వలసపోయిన శక, యవన, హూణ, రూమకాది బహిష్కృత క్షత్రియజాతివారును కలిసి ఒకరొకరితో రక్తసంబంధములను కలుపుకొని వారితో మిళితమై అనేక సంకీర్ణజాతులు ( **Mixed**

Races )గా ఏర్పడిరి. ఈ విషయమును గురించి 'కెల్లారు, టైలరు'అనెడి ఇరువురు పాశ్చాత్య పండితులు ఈవిధముగా వ్రాసియుండిరి:-

"The Europeans became in time many races and tribes and that they, mixing with the barbarians became themselves savages, have been clearly proved by the researches of the European scholars." (Vide Kellar's 'The Lake Dwellings' and Taylor's 'The Origin of the Aryans.')

'కాలము గడచుచురాగా ఐరోపీయులు అనాగరికులగు మోటుజాతులతో కలిసినందున అనేక జాతులుగాను, గుంపులుగాను నగుటయే కాక వారే అనాగరికములగు మోటుజాతులుగానై క్రూరులై పశుప్రాయులుగా మారిపోయి రని ఐరోపీయ పండితుల పరిశోధనల వలన చక్కగా ఋజువైనది.' అని వ్రాసియున్నారు.

బహిష్కృతులయిన ద్రవిడులవలన (అరవవారివలన) ఆక్రమింప బడిన ప్రదేశము "ఆరబ" దేశ మని పేరొందినది. చీనులవలన చీనా దేశమను పేరు కలిగినది. దరదులు "దరద" దేశవాసు లైయుండిరి. బర్బరులవలన ఉత్తరాఫ్రికాలోను, తూర్పుఆఫ్రికాలోను గల 'బర్బర' రాష్ట్రములేర్పడినవి. (Barbery States.) హూణులవలన ఐరోపా ఖండ ములో చాల భాగ మాక్రమింపబడినది. హూరులు పశ్చిమోత్తర సరి హద్దురాష్ట్రమున కొండజాతులవా రైయుండిరి. వారిప్పుడు మహమ్మ దీయ మతమందే చేరియున్నారు. వారి కిప్పటికిని 'హూరులు' (Hurs) అను నామమే కలదు. ఈవిధముగా భారతవర్షములోని బ్రహ్మావర్త దేశమునం దుద్భవించిన మానవ జాతి అనేకములయిన మార్పులను చెంది భిన్నాచార వేష భాషాదుల నొంది వివిధ నామములతో పిలువ బడుచు అనేక జాతులుగా చూపట్టుచుండిరి. 'భారత వర్షమే మానవ జాతికి పుట్టినిల్లు' అని దిగువవాక్యము నూటిగ చెప్పుచున్నది.

"తదేత ద్భారతం వర్షం సర్వ బీజం ద్విజోత్తమ!"

"ఈ భారతవర్షము అఖిలమానవజాతికి పుట్టినిల్లు."

అని శ్రుతి స్మృతి పురాణేతిహాసము లన్నియు వేనోళ్ల చాటు చున్నవి. భారతీయార్యుడే ప్రపంచములోని సమస్త జాతులకును మూల పురుషుడు. అతడే స్వాయంభువ మనువు. మనువు సంతానమైనందున వారు "మానవులు" అని పిలువబడిరి.

## విశ్వామిత్రుని - ఆతని కుమారుల - గాధ

ఆర్యులు బ్రహ్మావర్త దేశమునం దుత్పత్తిని పొంది దేశమంతట వ్యాపించి నివసించి యుండినపిమ్మట చాలకాలము గడువగా వైవస్వత మన్వంతరములోని 24వ మహాయుగమున కృతయుగపు ప్రమాణమగు 17, 28, 000 సంవత్సరములును త్రేతాయుగప్రమాణమగు 12, 96, 000 సంవత్సరములును గడచుచుండిన త్రేతాయుగాంత కాలమున విశ్వామిత్రు డనెడి రాజు ఉండెను. ఈతని తండ్రిపేరు గాధి. ఈత డొక రాష్ట్రమునకు ప్రభువు. విశ్వామిత్రుడు తండ్రినుండి సంక్రమించిన రాజ్యమును చిరకాలము పరిపాలించిన పిమ్మట కారణాంతరములచే రాజ్యమును త్యజించి అరణ్యమున నుండి నియమస్థుడై చిరకాలము తప మొనర్చి బ్రహ్మర్షి యయ్యెను. ఆ మహర్షి యొక్క ఆశ్రమము సరస్వతీ నదికి పశ్చిమ తీరమున కలదు. ఆయనకు నూరుమంది కుమారు లుండిరి. ఆ విశ్వామిత్ర మహర్షి పండితుడును, తపోధనుడును మంత్రద్రష్టయు నగు శునశ్శేఫుడను పేరుగల యొకబాలుని వెంట గొనివచ్చి తన కుమారుల నందరను పిలిచి ఇట్లనియె:—

"కుమారులారా! ఈ కుమారుడు మిమ్ముల నందఱను మించిన ప్రతిభాశాలి. వీనిని నేను కుమారునిగా స్వీకరించి యుంటిని. కావున వీనిని మీ కందరకు జ్యేష్ఠునిగా చేసికొని వానిపేరున ఇకనుండియు మీరు శునశ్శేఫ సోదరులను నామమున గాని లేక ఈతని పేరును మార్చి నేనీతనిని "దేవరాతుడ"ని పిలుచుచుంటిని గనుక మీరందరును "దేవరాత సోదరుల"ని కాని పిలువబడ వలయును. ఈతని ఆజ్ఞలకు మీరు బద్ధులై యుండవలెను." కాని విశ్వామిత్రునికుమారులు నూఱు

మందిలో అష్టకుడనువాడు జ్యేష్ఠుడుగా నుండిన మొదటి యేబదిమందియు దాని నంగీకరించలేదు. వారు తండ్రిఆజ్ఞను నిరాకరించిరి. అందువలన విశ్వామిత్రుడు కోపించి వారిని శపించెను.

ఈ చరిత్ర ఐతరేయ బ్రాహ్మణమునం దిట్లు వినబడుచున్నది:-

ఐతరేయ బ్రాహ్మణము, సప్తమ పంచకా, తృతీయాధ్యాయము పదునెనిమిదవ బ్రాహ్మణము:-

"తస్య హ విశ్వామిత్రస్యైకశతం పుత్రా ఆసుః; పంచాశదేవ జ్యాయాంసో మధుచ్ఛందసః పంచాశత్కనీయాంస స్తద్యే జ్యాయాంసో న తే కుశలం మేనిరే; తానను వ్యాజహారాంతాన్వః ప్రజా భక్షీష్టేతి; త ఏతేంఽధ్రాః పుండ్రాః శబరాః పుళిందా మూతిబా ఇత్యుదంతాన్ బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః."

సాయన భాష్యం:-

విశ్వామిత్రాణాం వృత్తాంత ప్రారంభః: మధుచ్ఛందో నామకః కశ్చిత్పుత్రో మధ్యమస్తో ఽపి జ్యేష్ఠాకనిష్ఠాశ్చ ప్రత్యేకం పంచాశత్సంఖ్యాకా ఇత్యేవ మేకశతంతస్య పుత్రాః తేషాం మధ్యే జ్యేష్ఠానాం వృత్తాంత మాహ:

"తత్రైష్వేకశత సంఖ్యాకేషు మధ్యే యే మధుచ్ఛందసో జ్యేష్ఠాః పంచాశత్సంఖ్యాకాః సంతి; తే శునశ్శేఫస్య విశ్వామిత్ర పుత్రత్వం కుశలం న మేనిర ఇదం సమీచీనమిత్యేవం నాంగీకృతవంతః తాన్ జ్యేష్ఠాన్ పంచాశత్సంఖ్యాకా ననులక్ష్య విశ్వామిత్రో వ్యాజహార వ్యాహరణం శాపరూపం వాక్య ముక్తవాన్: 'హేజ్యేష్ఠ పుత్రాః! యుష్మాకంమదీయాజ్ఞాతిలంఘినాం ప్రజాః పుత్రాదికాఅంతాన్ భక్షీష్ట - చండాలాదిరూపా న్నీచజాతి విశేషాన్ భజతామితి; త ఏతే శప్తాః సంతో అంధ్రత్వాది పంచవిధనీచజాతి విశేషాభవంతి. ఇతి శబ్దస్య తత్ప్రదర్శనార్థత్వా దన్యేపి నీచజాతి విశేషాః సర్వే వివక్షితాః.

ఉగ్రతోంత ఉదంఙోఽత్యంత నీచజాతి స్త్రత్ర భవా ఉదంత్యాః, తే బహవో ఽనేకవిధా వైశ్వామిత్రా విశ్వామిత్ర సంతతిజా దస్యూనాం తస్క-రాణాం మధ్యే భూయిష్ఠాః అత్యధికాః.''

తా॥ "ఆ విశ్వామిత్రునకు నూర్గురు పుత్రులుండిరి. అందు మధ్య ముడైన మధుచ్ఛందుడు జ్యేష్ఠుడుగా గల చిన్న కొడుకులు ఏబదిమంది. జ్యేష్ఠులు ఏబదిమంది. విశ్వామిత్రుడు తనతో తెచ్చిన శునశ్శేపుని జ్యేష్ఠునిగా చేసి వానియాజ్ఞకు బద్ధులై యుండునట్లు తన పుత్రులను కోరెను. జ్యేష్ఠపుత్రు లేబదిమందియు తండ్రి యాజ్ఞను మన్నింపలేదు. (మన్నింపక పోగా హేళనము చేసిరి). అందులకు విశ్వామిత్రుడు కోపించి తన యాజ్ఞను పరిపాలింపక నిరాకరించిన జ్యేష్ఠపుత్రు లేబదిమందిని గూర్చి శాపరూపమైన ఈ దిగువ వాక్యమును పలికెను.

''పిత్రాజ్ఞాతి క్రమణ మొనర్చిన ఓ జ్యేష్ఠ పుత్రులారా! మీర లునూ మీ సంతాన పరంపరయు (పుత్రపౌత్రాదిగా గల మీ వంశ ములలో రాగల తరముల వారందరు అని అర్థము). చండాలాది రూప బాహ్య జాతులుగా నయ్యెదరు గాక!"

"ఆ శాపము వలన వారు అంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబా మొదలైన జాతులుగా మారిపోయిరి. 'ఇతి'శబ్దమువలన పైన పేర్కొనబడిన ఐదు బాహ్యజాతులే కాక యింకను ఇతరములుగా నున్న బాహ్యజాతు లన్నియుకూడ చెప్పబడినవి. (అట్టి జాతులానాటికి అరువది నాలుగు గలవు. అని తెలియవలెను. వారందరు అట్టి బాహ్యజాతులలో కలిసి వారిలో లీనమైపోయి రని తాత్పర్యము). వార లందరును అంత్యజాతులలో జన్మాంతరములయందుకూడ ఉదయించు చుండిరి. శాపగ్రస్తులైన విశ్వామిత్రుని సంతానమువలన బుట్టినవారి వంశపరంపర లన్నియు 'దస్యులు'అనబడు దారులుగొట్టి జీవించెడి దొంగ లలో అత్యధికులుగా నుండిరి. అని బ్రాహ్మణమే చెప్పుచున్నది. ఇది ఐతరేయ బ్రాహ్మణములో గల చరిత్ర. తండ్రిని ధిక్కరించిన కుమారులు ఉత్తములై తపోజ్ఞానాదులతో గూడిన కులమును వీడి అనాగరికులై చౌర్య హింసాదులు వృత్తిగా గలిగి వివేక విహీనులై అరణ్యముల

యందు సంచరించెడి బాహ్యజాతులలో కలిసిపోయి రనియు వారు, వారికి జన్మించెడి సంతాన పరంపర (పుత్రపౌత్రాదు లందరును) దారులుకొట్టి జీవించెడివారుగా-అనాగరికులుగా-శాశ్వతముగా నుండిరనియు, వారు తిరిగి పూర్వస్థితిని పొందుట కెట్టి యవకాశమును లేదనియు చెప్పుటయే ఈ చరిత్రలోని సారాంశము. అంతేకాక వారు ఈ ఐదింటితో తుల్యము లైన ఇతర జాతులలో కూడ కలిసి పోయిరని చెప్పబడినది. శాపము నుండి విముక్తులగుట కెట్టి యనుగ్రహ వాక్యమును ప్రసాదింపబడ నందున దానికి పరిహార మెప్పటికిని గలుగదు.

పైవాక్యములో వినబడిన "అంధ్ర" శబ్దమును తీసికొని ఇచ్చట గల ఆంధ్రదేశమునకు ముడిపెట్టి ఆంధ్రజాతి అనాగరిక-బాహ్యజాతి యని చెప్పుటకు పాశ్చాత్య చరిత్రకారు లనేకములగు ఊహలు చేసి తమ కల్పితవాక్యములతో చరిత్ర నల్లి కృష్ణాగోదావరీ నదీ ప్రాంతముల వ్యాపించియుండిన "ఆంధ్ర" దేశమున ఇప్పుడు నివసించుచుండిన వైదిక ధర్మావలంబులైన చాతుర్వర్ణ్యస్థులైన ఆంధ్రమహాజనులందరును సంకర జాతీయులని కథ లల్లియుండిరి. వారియొద్ద చదువుకొనిన హైందవ సోదరులుకూడ ఎట్టి విమర్శనమును లేక వారి మాటలనే చిలుకపలుకుల వలె పలుకుచుండిరి. కాని ఆంధ్రదేశములో ఇప్పుడుండినవారు వైదిక ధర్మావలంబులైన చాతుర్వర్ణ్యస్థులు గాని బాహ్యజాతివారు కారని వారు గ్రహించలేనందులకు విచారించవలసి యున్నది. బాహ్యజాతీయు లెప్పుడును వైదికార్యులలో చేరుట కెట్టి యవకాశమును నేటికిని లేదని వీరికి తెలియని విషయము కాదు.

## ప్ర వ రాం త ర ము

విశ్వామిత్రుని కనిష్ఠపుత్రులైన యేబదిమందితో గూడిన మధ్యమపుత్రుడైన మధుచ్ఛందుడు శునశ్శేపుని జూచి ఈవిధముగా నుడివెను. ఓ శునశ్శేపుడా! మనకు తండ్రియైన విశ్వామిత్రు డేకార్యమును- అనగా నీ జ్యేష్ఠత్వము నంగీకరింపు డని-మాకాజ్ఞాపించెనో దానికి మే మంగీకరించితిమి. నీవు మాకు జ్యేష్ఠుడవు. నీపేరున శునశ్శేపు

లని పిలువబడుటకు నే మంగీకరించితిమి. మేము నిన్ను మాకు జ్యేష్ఠుడ వైన అన్నగా నెంచుకొంటిమి. నీ యాజ్ఞకు బద్ధులమై ని న్ననుసరించె దము. అని చెప్పెను. మధుచ్ఛందాదులైన కనిష్ఠు లేబదిమంది కుమారు లును, తన యాజ్ఞను పరిపాలించినందులకు సంతోషించి విశ్వామిత్రుడా కుమారులను పశువులతోను, ధనముతోను, వీర్యవంతులైన పుత్రుల తోను వృద్ధిపొందగలరని యనుగ్రహించెను. శపించబడిన జ్యేష్ఠ పుత్రులు కౌశికగోత్రమునుండి తొలగిపోయి గోత్రశూన్యులై వేదధర్మా వలంబులగు చాతుర్వర్ణ్యస్థులకు వెలియై వేదశాస్త్రాది విద్యలను మఱచిన వారై చౌర్యహింసాదులు వృత్తిగా గలిగి అట్టి జీవనము సాగించుచుండిన ఆంధ్రాదులైన అరువదినాలుగగు బాహ్యజాతివారితో కలిసి మిళితమై వారితోడ సంబంధబాంధవ్యములు గలిగినవారై దస్యులైరి. వారి దస్యుజాతిలోనే పుత్రపౌత్రాభివృద్ధి గలవారై అనేకులుగా వృద్ధిపొంది యుండిరని "బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః" అని ఐతరేయ బ్రాహ్మణమునందే వినబడుచున్నది. ఒకసారి వైదిక ధర్మమునుండి భ్రష్టుడైనవాడు తిరిగి వైదికధర్మమున కధికారి కానేరడు. వాడు భ్రష్టుడై ఇతరములైన మ్లేచ్ఛాది ధర్మముల నాశ్రయించవలసినదే కాని యెట్టి ప్రాయశ్చిత్తముచేతను వైదిక ధర్మమున చేర్చుకొనబడడు. ఈ యాచారము సృష్ట్యాదినుండి నేటివఱకు హిందువులలో పాటింప బడుచుండినది. నాలుగు వర్ణములలో నేవర్ణమువారును వైదికధర్మ భ్రష్టుడైన బ్రాహ్మణునైనను చేర్చుకొన రను సంగతి మన కీనాటివఱ కును నిత్యానుభవములో నున్న విషయమైయున్నది. ఇట్టి స్థితిలో కేవ లము వర్ణాశ్రమధర్మములను కాపాడుకొనుటయే ముఖ్యధర్మముగా రాజులును, ప్రజలును పాటించుచుండిన అతిప్రాచీనకాలమున కుల భ్రష్టులై బాహ్యజాతులుగా మారిపోయిన విశ్వామిత్రుని జ్యేష్ఠకుమారు లేబదిమందియు, వారి సంతానమును తిరిగి వైదికధర్మము నాశ్రయించి అగ్రవర్ణములో జేరి వేదశాస్త్రాధ్యయనాదు లొనరించి రనుట పొసగదు. వారలు దక్షిణముగా వచ్చి ఆంధ్రదేశము నాక్రమించి దానికి తమపే

రున "అంధ్ర" దేశమని పేరుపెట్టి రనుట కల్ల. అట్లు వచ్చిరని కాని కృష్ణా గోదావరీ, నదీప్రాంతదేశముల నాక్రమించిరని కాని యొక్క వాక్యమైనను ఐతరేయ బ్రాహ్మణమునందు గాని లేక మరియే సంస్కృత గ్రంథమందు గాని కానరాదు. వారును వారి సంతానపరంపరయు చౌర్య హింసాదులు వృత్తిగా గలవారైన అంధ్రాది దస్యుజాతులలో చేరిపోయిరని చెప్పుటయే ఐతరేయ బ్రాహ్మణ వాక్యముయొక్క పరమావధి. ఐతరేయ బ్రాహ్మణ వాక్యము కేవలము జాతివాచకము. అనగా అంధ్రత్వాది జాతులకు ఆర్యులలోగల "హోదా లేక అంతస్తు"నుచెప్పి అట్టివారిలో విశ్వామిత్రుని జ్యేష్ఠకుమారులు చేరిపోయి రనిచెప్పెను. అటుతరువాతి కథయంతయు పాశ్చాత్యచరిత్రకారులవలన కల్పింపబడిన అసత్యచరిత్ర. దానినే మన హైందవ చరిత్రకారులు దేశభాషలలోని కనువదించుచు ప్రచారమునకు దెచ్చుచుండిరి.

భార్గవ గోత్రజుడైన శునశ్శేపుడు

ఇతడు "దేవరాతుడ"ను పేర కౌశికగోత్రములో ప్రవరుడయ్యెను. "వైశ్వామిత్ర, దైవరాత, ఔదల"అనియు 'వైశ్వామిత్ర, దైవరాత, దేవల' అనియు భార్గవ గోత్రజుడైన శునశ్శేపుడు దైవరాతుడను పేరున విశ్వామిత్ర గోత్రములో ప్రవరుడైనందున విశ్వామిత్ర గోత్రమున ప్రవరాంతరము కలిగియున్నది. విశ్వామిత్ర (లేక కౌశిక) గోత్రమునకు "వైశ్వామిత్ర, అఘమర్షణ, కౌశిక" యనునది ప్రవరయైయున్నది. ఈవిధముగా శునశ్శేపునివలన విశ్వామిత్రగోత్రము లేక కౌశికగోత్రములో ప్రవరాంతరము కలదు. ఆప్రవరలను చెప్పుకొనుచుండిన బ్రాహ్మణ కుటుంబములనేకములు ఆంధ్రదేశమున గలవు. గోత్రప్రవరలను పోగొట్టుకొని విశ్వామిత్రుని జ్యేష్ఠకుమారులును వారి సంతానమును నామరూపములు లేనివారై పోయిరి. కాలము గడచుచుండ క్రమక్రమముగా ఆ యనార్యాక బాహ్యజాతులన్నియు నశించి పోయినందున ఆజాతీయు లీకాలమున కాన్పించుటలేదు.

విశ్వామిత్రుడు పుట్టుట కనేకలక్షల సంవత్సరములకు పూర్వమే భారతవర్షమంతయు ఆర్యజాతీయులతో నిండిపోయినది. భారతవర్షము లోని ప్రతిరాష్ట్రమును చాతుర్వర్ణ్యస్థులైన ఆర్యులకును, వారిలోని అను లోమ విలోమాది శాఖలకును నివాసభూమియై యున్నది. అందు ఇప్పు డాంధ్రదేశ మని పిలువబడుచుండిన భాగము బహుజనాకీర్ణమైన "ప్రాచ్యక" రాజ్యములో చేరియున్నది. విశ్వామిత్రునికి పూర్వము ప్రాచ్యకదేశములో చేరియుండిన భాగమే'ఆంధ్రరాజు'చే ఆంధ్రదేశమను పేర పిలువబడినది. అది బహుజనాకీర్ణమై యుండిన భాగముకాని కేవలము అరణ్యప్రదేశము కాదు. అది యొక శక్తిమంతుడైన రాజుయొక్క రాజ్య మైయున్నది. అం దితరులు వచ్చి యాక్రమించుట కేనాడును అవకాశము లేదు. ఇట్టి స్థితిలో బాహ్యజాతీయులయిన "అంధ్ర" జాతీ యులు వచ్చి ఆక్రమించుకొని రను వాదము కేవలము భారతదేశ చరిత్రను సాంప్రదాయము నెఱుగనివారిచే చేయబడిన దుర్వాదమై యున్నది.

## ఆంధ్రోత్పత్తిని గుఱించిన అపవాద నిరాసము

విశ్వామిత్రునిచే శునశ్శేపుడు కారణముగా శపింపబడి బాహ్య జాతులుగా మారిపోయిన విశ్వామిత్రుని జ్యేష్ఠపుత్రులు ఏబదిమందియు "అంధ్రు''లై రనియు, వారు పుళింద,పుండ్ర, శబర, ముతిబా, మొదలగు జాతులతో కలిపి ఐతరేయ బ్రాహ్మణములో చెప్పబడి రనియు, శునశ్శే ఫుని చరిత్ర ఐతరేయ బ్రాహ్మణముకంటె అతి పురాతన మైన దనియు కాబట్టి ఐతరేయ బ్రాహ్మణములలో చెప్పబడిన 'అంధ్ర'లు ఐతరేయ బ్రాహ్మణముకంటె అతిపురాతను లని చెప్పి రనియు, మూలపురుషుని పేర జాతులు పిలువబడుట భారతీయ సాంప్రదాయమున అతి ప్రాచీన్న కాలమున గల దనియు, అందువలన ఇప్పు డాంధ్రదేశమున గల ''ఆంధ్రులు" విశ్వామిత్రుని జ్యేష్ఠపుత్రులలో జ్యేష్ఠుడైన 'అంధ్ర' అను పేరుగలవాని సంతానము కావచ్చు ననియు సందేహించుచు పాశ్చా త్యులచే కల్పించి వ్రాయబడిన తప్పుకథలను నమ్మి వారిచే వ్రాయబడిన

తప్పుచరిత్రలను భారతీయులలో కొందరు తమతమ దేశభాషలలో ప్రచారముచేయుచుండిరి. (1-10-53 తేదీగల ఇంగ్లీషు 'హిందూ' పత్రిక, 20,29, పుటలలో ఆంధ్రులను గురించిన వ్యాసమును చూడుడు.)

ఐతరేయ బ్రాహ్మణములో చెప్పబడిన "అంధ్రులు" ఐతరేయ బ్రాహ్మణముకంటె అతిప్రాచీనులు. ఐతరేయ బ్రాహ్మణము 'అంధ్ర'లకంటె అతి ప్రాచీనము.

ఈ రహస్యము తెలిసినచో ఈ సందేహమునకు గాని ఇట్టి వికల్పమునకు గాని తావుండదు.

శ్రుతి: "యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ
యథా పృథివ్యా మోషధయ స్సంభవన్తి
యథా సతః పురుషాత్ కేశలోమాని
తథాఽక్షరా త్సంభవతీహ విశ్వం."
"ధాతా యథాపూర్వ మకల్పయత్."

అను శ్రుతివాక్యములను బట్టి ప్రకృతినుండి ఈ సృష్టి స్వాభావికముగనే బహిర్గత మగుచు కొంతకాలమునుండి పిమ్మట ప్రకృతియందు లీనమగుచు తిరిగి బహిర్గత మగుచుండును. ఈవిధముగా సృష్టిస్థితి లయములు వాటి యంతట నవి తిరిగితిరిగి బహిర్గత మగుచు తిరోహిత మగుచుండును. అట్లు బహిర్గత మగుటలో వెనుకటి సృష్టివలెనే ఈనాటి సృష్టియు బహిర్గత మగుచుండును. అట్లు మాటిమాటికిని వచ్చుచు పోవుచుండు సృష్టి, వసంతాది ఋతుధర్మములు గత ఋతుకాలములయందు బహిర్గత మైనట్టులనే వర్తమాన కాలమునను గోచరించుచుండును. దానినిబట్టి భవిష్యత్కాలమున గూడ ఇదేవిధమున వసంతాది ఋతుకాలములు తమ తమ ధర్మముల నెరవేర్చుచుండు నని మనము నిష్కర్షగా చెప్పుట కవకాశము కలదు. అదేవిధమున ఈ సృష్టిస్థితిలయములు చక్రాకారముగ వచ్చుచు పోవుచు తిరిగితిరిగి వచ్చుచు పోవుచుండును. ఒక చక్రములో ఏదియో యొక సూక్ష్మబిందువునుండి మనము గమనింప ప్రారంభించి

చక్రమును చుట్టివచ్చిన తిరిగి మనము బయలుదేరిన సూక్ష్మబిందువు నొద్దకే వచ్చి చేరుదుము. చక్రమున కే బిందువు ప్రారంభమో అదియే అంత్యముగూడ నగును. ఆద్యంతములు రెండును చక్రములో ప్రతి సూక్ష్మబిందువునందును కల్గుచుండును. అనగా చక్రములో ఆద్యంత ములు రెండు నేకస్థానమందుండుననుట.

అటులనే ప్రకృతి చక్రమందు సృష్టిలయములు ఒకేబిందువునం దుండుచున్నవి. ఎచ్చట సృష్టి ప్రారంభమగునో అచ్చటనే లయము కూడ ప్రారంభమును పొందుచున్నది. పుట్టుట, పెరుగుట, లయించుట, తిరిగి పుట్టుట, లయించుచు పుట్టుచుండుట-ఇది ప్రాకృత లక్షణము. వెనుకటి సృష్టిలో జరిగిన విధముననే ఈసృష్టిలోకూడ కొంచె మించు మించుగ జరుగుచుండును. అందువలన వెనుకటి సృష్టిలో జరిగిన శున శ్శేపుని చరిత్రము ఈ సృష్టిలోకూడ తిరిగి ప్రదర్శిత మగుచుండును. అన్ని సృష్టులకును, అన్ని లోకములకును, అన్ని కాలములకును వేద మొక్కటియే. గతసృష్టియందలి ఐతరేయ బ్రాహ్మణము చెప్పినటులనే ఈ సృష్టిలో కూడ చెప్పును.

ప్రతిసృష్టికిని ప్రారంభమున ప్రకృతినుండి 'శబ్దము' బహిర్గత మగును. ఆ శబ్దసమూహామే 'వేదము'లని చెప్పబడుచున్నది. అదియే ప్రకృతినుండి మొదట బహిర్గతమై సృష్టికి ప్రథమ పురుషుడైన ప్రజాపతికి వినబడినది. ఆతడు ప్రథముడైన ఆర్యుడని వేదమువలన వినబడు చున్నది.

'ఆర్యు'డనగా 'ఈశ్వరపుత్రు'డని వేదమాతయే నిర్దేశించుచు న్నది. యాస్కాచార్యులును, సాయనాచార్యులును 'ఆర్యు'డన ఈశ్వర పుత్రుడని నిరుక్తమునందును వేద భాష్యమునందును వ్రాసియుండిరి. వాని నతడు స్మరించి తనకు పిమ్మట వచ్చిన 'దేవఋషు'లకును, వారు మానవులకును చెప్పుచుండురు. సృష్ట్యాదియందు ఆర్యుడే మొదటి వాడుగా వచ్చినందున ఇప్పుడు ప్రపంచమున గల సమస్తజాతులకును

'ఆర్యుడే' మూలపురుషుడు. కనుక 'ఆర్యులు' అతిపురాతన జాతివారై యున్నారు. మిగిలిన జాతులన్నియు వారికి పిమ్మటివారినుండి యేర్పడిన వైయున్నవి. ప్రపంచమంతయును ఆర్యజాతితోడనే నిండియున్నది. మిగిలినవాటి నన్నిటిని ఆర్యులనుండి యేర్పడిన వివిధశాఖలుగా చెప్పవలయునే కాని అవియన్నియు ఆర్యులకంటె వేరైన ప్రత్యేక జాతులని చెప్పదగదు.

చాతుర్వర్ణ్యములతో గూడిన 'ఆర్యులు' అతిప్రాచీను లని తెలియవలెను. వారినుండి అనులోమ, విలోమ సాంకర్యమున అంధ్రాది బాహ్యజాతు లేర్పడినవి. ఇప్పు డాంధ్రదేశమున గల 'ఆంధ్రులు' చాతుర్వర్ణ్యములతో గూడి వేదోక్త ధర్మాచరణము కలిగి యుండినందున వీరు స్వచ్ఛమైన ఆర్యసంతతికి చెందినవారైయున్నారు. వీరు అంధ్రాది బాహ్యజాతులకంటె అతిప్రాచీనులు. వారినుండియే మిగిలిన శాఖలన్నియు నేర్పడినవి. మంత్రములు బ్రాహ్మణములు అనుపేరున వేదములు బహిర్గత మగుచుండును. అట్లు సృష్టికి ప్రారంభమందు శబ్దరూపమున ఆవిర్భవించిన వేదభాగములలో 'ఐతరేయబ్రాహ్మణ' మొకటి యైయున్నది. అందు పూర్వసృష్టిలోని చరిత్రభాగములు తిరిగి వినబడుచుండును.

గతసృష్ట్యాదియందు వచ్చి యుండిన ఐతరేయాది బ్రాహ్మణములందు వినబడిన విధమున ఆసృష్టిలో అనేకవిధము లగు చరిత్రలు జరిగి యున్నవి. అవియే యీసృష్టిలోని బ్రాహ్మణములందు వినబడుచున్నవి. అట్లు బ్రాహ్మణములలో వినబడిన చరిత్రలే ఈసృష్టియందు గతకాలమున జరిగియున్నవి. వర్తమాన కాలమున జరుగుచుండినవి. రాబోవు కాలమున జరుగగలవు. ఈ సృష్టి యంతయు లయించిన పిమ్మట ప్రళయకాలము దాని నియతిప్రకారము తీరినంతనే తిరిగి సృష్టి ప్రారంభమగుచుండిన కాలమున ప్రథమమున వేదము శబ్దరూపమున బహిర్గతము కాగలదు. ఈ విధముగా అనాదినుండియు అనంతకాలమువరకు వచ్చుచు పోవుచుండెడి ఈ సృష్టిలయములలో శబ్దము ముందో ఆశబ్దము కార్య

రూపము దాల్చిన చరిత్రలు ముందో నిర్ణయించుకొనుడు. మనస్సులో శబ్దరూపమున గల సంకల్పము కార్యరూపము దాల్చిన అది చరిత్ర యగును.

"వంశనామము లా వంశముయొక్క మూలపురుషునివలన ఏర్పడుట మనదేశములోని ఆచారము. అందువలన "అంధ్ర"లు అనెడి ఈశాఖకు విశ్వామిత్రునిచే శపింపబడిన ఆతని జ్యేష్ఠపుత్రులలో జ్యేష్ఠునిపేరు 'అంధ్ర'అని యైయుండవచ్చు"నని యీ వాదమును నమ్మినవారు సంశయించుచు చెప్పుచున్నారు. వారి యూహలు, కల్పనలు, సంశయములు కూడ ఈదేశమున సత్య చరిత్రలుగా చెల్లబడి కాగల వను నమ్మకమే ఇట్టి వ్రాతలకు కారణము కావచ్చును. (31-10-53 తేదీగల "హిందూ"పత్రికలోని ఆంధ్రులనుగురించిన వ్యాసమును చూడుడు.)

భారతవర్ష చరిత్ర వ్రాయుటకు భారతవర్షములో గల ప్రాచీన సంస్కృత వాఙ్మయము ముఖ్య ప్రమాణమని వీరికి తెలియని అంశము కాదు. ఇప్పు డాంధ్రదేశములోని "ఆంధ్రులు" సంకరజాతి యని చెప్పుటకు ప్రాచీన సంస్కృత వాఙ్మయమునే (ఐతరేయ బ్రాహ్మణమునే) వారు ఆధారపఱచుకొనిరి. అగుచో తమ వాదమును ధ్రువపఱచుకొనుటకు సందేహముతో గూడిన స్వీయకల్పన లేల చేయవలయునో తెలియకున్నది. భారతీయుల లేక అఖిల మానవజాతుల ప్రాచీన చరిత్రలన్నియు మన పురాణముల యందు చెప్పబడియున్నవి. అట్టివానిని చదువక వారు పరిశోధనలను నెపమున పాశ్చాత్యులచే వ్రాయబడిన అసత్యచరిత్రలను అనువదించి భారతదేశ చరిత్రను పూరించుచున్నారు.

సర్. విలియం జోన్సు (1774 A. D ) నుండి వి. ఎ. స్మిత్ (1915 A. D ) వఱకు- 18 శతాబ్దము చివరపాదమునుండి యిరువదవ శతాబ్ద ప్రథమపాదమువఱకు- వచ్చిన పాశ్చాత్య చరిత్రకారులచే (అం దే యొకరిద్దరో తప్ప) వ్రాయబడిన భారత దేశ చరిత్ర లన్నియు

అసత్యములును, అప్రమాణములు నైన కల్పితవాక్యములతో పూరింపబడిన వై యున్నవి. అవియే మన చరిత్ర పరిశోధకుల పరిశోధనలకు మూలము లైనందున ప్రాచీన చరిత్రము విషయమున వారిచే వ్రాయబడిన ప్రతివాక్యమును అసత్యములతో గూడి దేశమునకును జాతికిని అప్రతిష్ఠాకరములుగను అవమానకరములుగను పరిణమించుచున్న వని చెప్పవలసివచ్చినందులకు చింతిల్లు చుంటిమి.

విశ్వామిత్రుని కుమారులలో జ్యేష్ఠునిపేరు "అంధ్రుడు" కాదు. అతనిపేరు 'అష్టకుడు.' రెండవవాడు 'హారీతుడు.' మూడవవాడు 'జయంతుడు.' నాలుగవవాడు 'సుమదుడు.' అనువార లని శ్రీమద్భాగవత నవమస్కంధమున స్పష్టముగా చెప్పబడియున్నది. శ్రీ బమ్మెర పోతనామాత్యుడు దీనిని తెనిగించి తెలుగుజాతి కిచ్చియున్నాడు. తెలుగువారలయిన చరిత్రపరిశోధకులు శ్రీమదాంధ్ర మహాభాగవతము నైనను చదువక ఇట్లు అసత్యకల్పనలతో ఆంధ్రులచరిత్రను వ్రాసి ప్రకటించుట న్యాయముగా లేదు. వారికి ఆంధ్రులందరును తమ తీవ్రమగు అసమ్మతిని తెలియజేయుచున్నారు. ఇప్పటికైనను వారు అసత్యమార్గములను విడిచి సత్యమార్గము ననుసరించెదరు గాక!

'ఆంధ్రు' లనెడి బాహ్యజాతి విశ్వామిత్రుని సంతానము కాదు. ఆతని శాపమువలన ఏర్పడినది కాదు. విశ్వామిత్రుడు పుట్టుటకుముందు నుండియు లేక సృష్ట్యాదినుండియు చాతుర్వర్ణ్యములతో గల ఆర్యజాతియు, ఆ నాలుగు వర్ణముల యధార్థిక సంమిశ్రణము వలన కలిగిన అరువదినాలుగు 'అనులోమ, విలోమ' జాతులును గలవు. విశ్వామిత్రునిచే శపింపబడిన అతని జ్యేష్ఠకుమారు లైన అష్టక, హారీత, జయంత సుమదాదులు ఏబదిమందియు అదివఱకుండిన అంధ్రాదులైన బాహ్యజాతులలో చేరి దస్యులై దారిని పోవువారిని హింసించి వారి ధనములను దోచుకొనుచు చౌర్యహింసాదులే జీవికగా కలవారైపోయి రని 'బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః' విశ్వామిత్రుని సంతానము దస్యులలో హెచ్చుగా మిళితమైపోయిన దని

ఐతరేయ బ్రాహ్మణమున గలదు. ఈ వాక్యమును వారు సరిగా వ్యాఖ్యానించక విశ్వామిత్రుని శాపమువలన "అంధ్రాది" బాహ్యజాతు లేర్పడిన నుండి 'అంధ్ర' అనెడి విశ్వామిత్రుని జ్యేష్ఠకుమారునివలన 'అంధ్ర' లనెడి జాతివా రేర్పడినట్లు వ్రాసియుండిరి. కాని అది యసత్యము. ఈ బాహ్యజాతివారలు ప్రత్యేకమగువర్ణములుగనై దేశముల నాక్రమించిరనియెంచుట పొరబాటు. వీరలు ఆర్యులగ్రామములకును, పట్టణములకును, సమీపమున పురబాహ్యప్రదేశములందు నివసించుచుండి రని మనుస్మృతి స్పష్టముచేసి యున్నది. వీరిలో ఆర్యులయొద్ద కూలిచేసి కొని జీవించెడివారు కొందరును, అందు అంధ్రాది శాఖలుకొన్ని అరణ్య ముల యందు నివసించి దారిని నడచు పాంథులను హింసించి వారి ధనముల గొనుచు చౌర్య హింసాదులచే జీవించువారలు కొందఱును అయియుండిరి. కాని వీరికెప్పుడును స్వతంత్రములగు తెగలుగా నేర్పడి దేశములో ప్రయాణము చేయుచు భూముల నాక్రమించి ప్రత్యేకమైన రాజ్యములను స్థాపించుట కీ భారతవర్షములో ఎట్టి యవకాశమును లేదు. మనుస్మృతి చదివిన వారి కీవిషయము అవగాహన కాగలదు. విశ్వామిత్రుని కాలమున కతిపురాతనకాలమునాటికే భారతవర్షమం తయు రాజ్యములతోను రాజులతోను నిండియుండినది. ఆవిధముగా అనాగరికులగు మోటుజాతులు దేశముల నాక్రమించుట విస్తారముగా ఐరోపాఖండములో ఇటీవలికాలమున జరిగియున్నది.

భారతవర్షమున వైదికధర్మములను త్యజించిన క్షత్రియశాఖ లవారి నచ్చట కులబహిష్కారులు మొనర్చగా వారలు వైదికార్యులను బాధించుచుండిన కాలమున వారిని దేశమునుండి సింధునదికిపశ్చిమము నకు తరిమివేయుగా వారలు– అనగా శక, యవన, పారద, పహ్లవ, హూణ, రోమక, బర్బరు లాదిగాగల బహిష్కృతార్య క్షత్రియ జాతులు–భారతవర్షము పశ్చిమోత్తర భాగములందు నివసించి అచ్చటి నుండి క్రమక్రమముగా పశ్చిమదేశములకు పోయి అచ్చటి భూముల నాక్రమించి రాజ్యస్థాపనములు చేసియుండిరి. కాని భారతదేశములో

అట్లు జరిగియుండినట్లు సంస్కృతవాఙ్మయమం దెచ్చటను ఒక్కవాక్య మైనను కానరాదు. ఆనాటికి వింధ్యపాఖండము నిర్మానుషముగా నుండి అచ్చటచ్చట పశుప్రాయులైన అనాగరికమానవులతో నిండియున్నది. వీరు తమ ఊహాగానమును విడిచి భారతీయుల ప్రాచీనచరిత్రలనుండి (శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదులనుండి) యొక్క వాక్యమును చూపి వారి వాదమును సమర్థించుకొనగోరుచున్నాము.

శపింపబడిన విశ్వామిత్రుని జ్యేష్ఠకుమారు లేబదిమందియును (వారి పుత్రపౌత్రాదులతో సహా) బాహ్యజాతులలో చేరిపోయి రని మాత్రమే ఐతరేయ బ్రాహ్మణములో చెప్పబడిన చరిత్ర. ఆబాహ్యజాతి వారే ఆంధ్రదేశ మాక్రమించి రనునది వీరి యూహాగానము. వారు తమ ఊహాగానమును సమర్థించుకొనుటకు చేయుచుండిన వింతవాద మును పరికింపుడు:—

"ఆర్యజాతివారలతో కలిసి వింధ్యపర్వత ప్రాంతముల యందలి అనాగరిక జాతులవారలు కూడ ఆర్యుల కిరుగుపొరుగు వారలుగా నివసించుచుండిరి. దీనినిబట్టి విశ్వామిత్రునిచే శపింపబడి అంధ్రాది జాతులలో కలిసిపోయిన 'అంధ్రులు' ఉత్తర హిందూస్థాన వాసులు." అని వ్రాసియున్నారు.

విశ్వామిత్రుని ఆశ్రమము ఉత్తరహిందూస్థానమున హిమాలయ పర్వత సమీపమున సరస్వతీనదీ తీరమున గలదు. శపింపబడిన విశ్వామిత్రుని కుమారులు అచ్చట గల అంధ్రాది బాహ్యజాతులలో మిశ్రమమైపోయిరి. అది ఉత్తర హిందూస్థానములోని దని అందరకును తెలిసిన విషయమే. వింధ్యపర్వత శ్రేణి విశ్వామిత్రుని ఆశ్రమమునకు దక్షిణముగా కొన్ని వందల మైళ్లు దూరమున గలదు. నేటికికూడ అనాగరిక జాతులైన కోయ, చెంచు, భిల్ల, ఎఱుకల, యానాది, కోందు, సవర, పొరజ, గదబ, కొండదొర, గొండియ భోత్ర మొదలుగాగల అనేకశాఖలవారు ఆర్యులప్రక్కనే నివసించుచునే యుండిరి.

వింధ్యపర్వతమువద్దకు వచ్చి నివసించిరని ప్రత్యేకవిషయముగా చెప్పుటలో విశేషమేమియు గనబడదు. ఆవాక్యమువలన వారివాదమున కెట్టి బలమును కలుగబోదు. అంధ్రాది బాహ్యాజాతులు ఉత్తరదేశ వాసులు మాత్రమే యని యెంచుట పొరబాటు. ఆర్య లెచ్చట కాపురముండిన వారిప్రక్కనే యీ అంధ్రాది బాహ్యాజాతులవారును నివసించుచుండిరి. ఆర్యులు భరతవర్షమందంతటను వ్యాపించి నివసించి యుండుటవలన అంధ్రాది జాతులవారును ఆర్యులతోపాటు పోయి వారిప్రక్కనే నివసించుచువచ్చిరి. కనుక ఆవాక్యమువలన వారివాదమున కెట్టి బలమును చేకూరకపోగా దానిని వ్యతిరేకించుచున్నది.

సందర్భశూన్యముగా వింధ్యపర్వతములకు దక్షిణముగా ఆర్యులతో కలిసి యిరుగుపొరుగుగా అనాగరికులగు అనార్యజాతులు నివసించుచున్నవని చెప్పి ప్రత్యేకముగా "అంధ్ర"జాతి యిచ్చట నివసించినట్లు సూచించుచున్నారు. ఇది వారియూహయే గాని సత్యము కాదు. దానికి పూర్వచరిత్రాధారము లేవియు గానరావు. అందులకు విరుద్ధముగా "అంధ్ర"లనెడి బాహ్యాజాతి అరణ్యములలో ఆరణ్య పశువులను చంపి వాని మాంసమును తినుచు జీవించుచుండిరని మనువు వ్రాసియున్నాడు :-

శ్లో॥ 'మేదాంధ్ర చుంచు మద్గూనా మారణ్య పశు హింసనమ్.'

(మను10–48)

అనగా మేద, అంధ్ర, చుంచు, మద్గు అనెడి బాహ్యాజాతివారలు అరణ్య ప్రాంతములలో నుండి అచ్చటి పశువులను హింసించి వానితో జీవించువారుగా నుండిరని మనువు చెప్పుచున్నాడు. ఆర్యుల కిరుగుపొరుగున బాహ్యాజాతులు నివసించుచుండుట సహజముగానే యున్నందున వింధ్యపర్వతమువద్ద కూడ అట్లే జరిగియున్న దనుటలో ప్రత్యేకత ఏమియు కానరాదు. ఇందువలన కూడ వారివాదమున కెట్టి బలమును చేకూరదు. ఈవాక్యములను హేతువాదములుగా నెంచుట హాస్యాస్పదము. అంధ్రాది బాహ్యాజాతులు ఆర్యులలోని నాలుగువర్ణములవారికి

ఒకవర్ణమువారితో మఱియొక వర్ణమువారికి గలిగిన సంపర్కమువలన ఏర్పడిన విలోమజాతు లైనందున వారు కొన్ని నియమ ములకు లోనై ఆర్యసంఘములో భాగస్థులుగా నుండిరే కాని వార లెప్పుడును ప్రత్యేకమైన ఆర్యేతర జాతులుగా ఎంచబడలేదు. వారు ఆర్యులలో చేరిన విలోమశాఖవా రైయున్నారు. వారు స్వతంత్రజీవ నము గలవారుగానే యుండిరి. కాని వారి కెట్టి బానిసతనమును లేదు.

## 'అంధకులే అంధ్రులు'అనెడి వాద నిరాసము

"బౌద్ధవాఙ్మయములో 'అంధకు'లనెడి యొక తెగవారి ప్రశంస గలదు. 'అంధకు'లనగా 'అంధ్ర'యనెడి బాహ్యజాతి. వా రుత్తర దేశపు వారు. ఆగ్రంధములో 'అంధకవన'మను ఒక అరణ్యప్రదేశము గల దని చెప్పబడినది. అది ఉత్తర కోసల రాజ్యమునకు ముఖ్యపట్టణ మైన 'శ్రావస్తి'సమీపమున గల'జేతవనము'వద్ద గలదు. దీనినిబట్టి 'అంధ్రులు' మొదట ఉత్తర హిందూస్థాన వాసు లైయుండి అతి ప్రాచీనకాలమున దక్షిణమునకు-కృష్ణా గోదావరీ నదుల మధ్య ప్రదేశమునకు-వచ్చి దాని నాక్రమించి స్థిరపడిరి." అని వ్రాయుచున్నారు.
(డి1-10-53 హిందూపత్రిక ఆంధ్రులను గురించిన వ్యాసము)

"అంధకు"లనగా 'అంధ్ర'లని యెంచుట పొరబాటు. చంద్రవంశపు క్షత్రియులలో 'అంధకు'లనెడి యొక క్షత్రియశాఖ గలదు. యయాతి కుమారుడు యదువు. ఇతని కుమారుడు క్రోష్టువు. క్రోష్టువువంశములో క్రోష్టువునుండి లెక్కించగా ముప్పదిఎనిమిదవ ప్రముఖవంశమువాడు సాత్వతుడు. సాత్వతుని కుమారులు ఏడుగురిలో ఆఱవవాడు 'అంధ కుడు.' అందు జ్యేష్ఠుడగు భజమానునివంశములో ఐదవతరమువాడు 'శిని.' ఈతనికి సత్యకుడు గలిగె. సత్యకునికి కాశీరాజకూతునందు 'కుకుర, ద్వితీయభజమాను'లు కలిగిరి. కుకురునికి వృష్ణి, అతనికి కపోతరోముడు అతనికి 'విలోముడు'ఆ విలోమునకు 'ద్వితీయఅంధ కుడు' గలిగిరి. ఈ ద్వితీయాంధకునకు 'బిందనోదక దుందుభి' అను నామాంతరము గలదు.

# అంధకవంశము

ద్వితీయ అంధకుడు-

|

అభిజిత్తు

|

పునర్వసు

|

ఆహుకుడు

|

1. దేవసేనుడు, 2. ఉగ్రసేనుడు.

|

దేవవంతుడు

పుత్రికలు ఏడ్గురు. వీరందరును వసుదేవునకు భార్యలైరి. అందు చివరి కూతురు దేవకీదేవి.

ఉగ్రసేనుడు

|

వీనికి తొమ్మండ్రు కుమారులు. వారిలో కంసు డగ్రజుడు. కుమార్తెలు ఐదుగురు.

ద్వితీయ భజమానుడు

|

విదూరథుడు

|

రాజాధి దేవుడు

|

వాత, నివాత, శోణిత, శ్వేతవాహన, శమి, గదవర్మ, నితాంత అనువార లెనమండుగురు. అందు శమికి ప్రతిక్షత్రుడు, వానికి స్వయంభోజుడు, వానికి హృదికుడు వానికి ద్వాదశపుత్రులు కలిగిరి. వారిలో కృతవర్మ జ్యేష్ఠుడు. దేవబాహు రెండవవాడు. అందు దేవబాహువునకు కంబళబర్హిషుండు గలిగె. వానికి అసమౌజసుండు కలిగె, అతనికి

సుచంద్ర వసురూపులు పుట్టిరి. వీరెల్లరు 'అంధకు' లనంబడుదురు. ఎవ్వ రేని అనుదినం బీ 'అంధకవంశంబు' ను గీర్తించిన వంశాభివృద్ధి యగు." (బ్రహ్మాండ పురాణము, ఉపోద్ఘాత పాదము, పంచమాశ్వాసము, శ్రీ జనమంచివారి ఆంధ్ర బ్రహ్మాండపురాణము 723, 724 పుటలు, శ్రీమదాంధ్రభాగవతము నవమస్కంధము చూడుడు.)

అంధకు లనెడి శాఖ యాదవవంశములోని యొక ఉపశాఖ. 'అంధకులు' వేరు 'అంధ్రులు' వేరు 'ఆంధ్రులు' వేరు అని తెలియ వలెను. 'అంధకు' లెన్నడును 'అంధ్రలు' గాని "ఆంధ్రులు" గాని కానేరరు. అంధకులు చంద్రవంశ క్షత్రియశాఖకు చెందినవారు. 'అంధ్రలు' బాహ్యజాతివారు. "ఆంధ్రులు" చాతుర్వర్ణ్యములతో గూడి వైదికధర్మానుయాయులైన స్వచ్ఛమైన ఆర్యజాతికి చెందినవారు.

ఇక "అంధకవనము" నుగురించి తెలిసికొందము. పూర్వము మహిషాసురు డనెడి యొక రాక్షసుడు గలడు. వీడు హిమాలయ ప్రాంతముల నివసించెడివాడు. వీడు హిందూస్థానమంతటిని జయించి పాలించెను. రామాయణము జరిగిన పిమ్మట వీని చరిత్ర జరిగియున్నది. అది ఇరువది నాలుగవ మహాయుగములోని త్రేతాయుగాంతము. (సుమారు ఒక కోటిన్నర సంవత్సరముల పైకాలముగా ఎంచబడు చున్నది.) దేవీభాగవతపురాణము వీని చరిత్రను విశేషముగా చెప్పి యున్నది. వీడు పరాశక్తి యనెడి స్త్రీదేవతచే చంపబడెను. పిమ్మట వీని సామ్రాజ్యము శ్రీరాముని కుమారుడగు లవుని వంశములోని శత్రుఘ్ను డనువాని కీయబడినది. వీనికి లోబడిన సామంత రాక్షస రాజులలో "అంధకాసురు" డొకడు గలడు. వీడుత్తరకోసలమును జయించి పాలించెను. ఈ యంధకాసురుడు విహరించిన వనమునకు 'అంధకవన'మని పేరు. హిమాలయ ప్రాంతమున గల ఉత్తర కోసల మనెడి రాష్ట్రమందలి ఈ అంధకవనము వీనిపేర బిలువబడుచున్నది. (శ్రీ ములుగు పాపయారాధ్య విరచితాంధ్ర దేవీ భాగవతము పంచమ స్కంధము 411, 464 చూడుడు.)

"దుష్టుడైన కంసుడు యాదవవంశమునకు చెందిన తన జ్ఞాతుల నందరను మధురానగర ప్రాంతముల నుండి తరిమివేయగా యదువులు పదవులు విడిచి నిషధ, కురు, కోసల, విదేహ, విదర్భ, కేకయ, పాంచాల, సాల్వ దేశంబులు సొచ్చిరి. మచ్చరంబులు విడిచి కొందఱు కంసునిం గొలిచి నిలిచిరి."

(శ్రీ మదాంధ్ర భాగవతము 10—56)

అట్లు దేశమును విడిచిపోయినవారిలో 'అంధకు' లనెడి శాఖవారుత్తరకోసలంబున పచ్చికగల యీ అంధకవనమున నివసించి గోసంరక్షణచే జీవించిరి. ఈ యంధకవంశమువారి నివాసమువలన తిరిగి అంధకవనము సార్థకనామము గలదైనది.

కంసవధానంతరమున శ్రీకృష్ణభగవానులు కంసభీతులై పరదేశములకు వలసపోయిన జ్ఞాతిసముదాయములను తిరిగి పిలిపించి వారివారి ఆస్తులను వారి కిచ్చియున్నట్లు శ్రీమద్భాగవత మిట్లు చెప్పుచున్నది.

"తదనంతరంబు తొల్లి కంసభీతులై విదేశంబులం గృశియించుచున్న యదు, వృష్ణి, భోజ, మరు, దశార్హ, కుకుర, అంధక ప్రముఖులగు సకల జ్ఞాతి సంబంధులను రావించి చిత్తంబు లలర విత్తంబులిచ్చి వారివారి నివాసంబుల నుండ నియోగించె."

(ఆం. భా. 10. పూర్వభాగము 1402 వచనము)

ఇంకను:—

"యాదవ వృష్ణి భోజాంధకులు"
"యదు, వృష్ణి, భోజాంధకవంశంబులు"

(ఆం. భా. 10 స్కం. ఉ. భా. 1050 1333 వ.)

కంసుని దుర్మార్గములు చెప్పుచోట అతనిచే బంధింపబడిన వాని తండ్రిని జ్ఞాతులగు రాజులను గురించి ఇట్లు చెప్పబడినది:—

"గురు నుగ్రసేను యదు దద్భోజాంధకాధీశుని
ర్మలు బట్టెం గడు వాలి యేలె జలమార్గ శూరసేనంబులన్."

(ఆం. భాగ. పూ. భా. 10-54.)

అని అంధకవంశమువారి చరిత్ర మనకు పురాణము లన్నిటియందును విశేషముగా గలదు. అంధకవంశము వారి కాలము ఈ 28వ మహాయుగములోని ద్వాపరాంతము. (క్రీ. పూ. 3254)

ఇట్టి పవిత్ర క్షత్రియవంశ మగు 'అంధకవంశము' 'అంధ్రులనెడి' బాహ్యజాతి యని అసత్యప్రచారము చేయుచు పాశ్చాత్యులచే వ్రాయబడిన అనృతమును అవమానకరమునగు చరిత్రను సమర్థించుటలో గల ఆంతర్యమేమియో తెలియకున్నది. అసత్యములగు ఊహాగానముల చేయక శ్రద్ధాభక్తులతో పండితుల నాశ్రయించి పరంపరాగతమైన పురాణాది సంస్కృతవాఙ్మయమును చదివి సత్యమైన భారతదేశ చరిత్రను వ్రాయుట ప్రతిభారతీయునికిని ధర్మము అని తెలియవలెను.

## అశ్మక, మూలకులు

"బౌద్ధవాఙ్మయము ననుసరించి మొదట గోదావరిలోయలోనికి వలసవచ్చి నివసించినవారు 'అశ్మకులు' (Asmakas) మూలకులు (Mulakas) అనెడి తెగలవారు. 'సుత్తనిపట్ట'యనెడి బౌద్ధగ్రంథ వ్యాఖ్యానములో అశ్మకుడు, మూలకుడు అనెడి ఇద్దరు ఆంధ్రరాజులు గలరని చెప్పబడినది. ఇందువలన అశ్మకులు, మూలకులు అనెడి రెండు ప్రత్యేకమైన తెగలు 'అంధక' లేక 'అంధ్ర' అనెడి బాహ్యజాతిలో గల వని స్పష్టముగా ఋజువగుచున్నది. కాబట్టి 'అంధ్ర'లనెడి బాహ్యజాతి వారిలో అవాంతరశాఖ లనేకము లున్నట్లు స్పష్టపడుచున్నది. ఆ తెగలలో పైన చెప్పబడిన అశ్మక మూలక అను తెగలుగాక శాతవాహనులుకూడ బాహ్యజాతివారే. కాబట్టి 'అంధ్ర'లనెడి (దారిదోపిడి దొంగలగు) బాహ్యజాతివారిచే నివసింపబడిన యీ గోదావరిలోయ

యందు గల దేశమునకు 'అంధ్రదేశ' మను పేరు వచ్చిన దని యెంచుటే సత్యమైన నిర్ణయము."

(దీ1-10- 53గల'హిందూ'పత్రిక 20,29 పుటలలోగల ఆంధ్రులను గురించిన వ్యాసమును చూడుడు.)

ఇదియే వీరు ఆంధ్రదేశస్థులైన చాతుర్వర్ణ్యములవారికిని వారి ప్రభువులకును వారి గురుపీఠములకును ఇచ్చిన సమాజార్హత.

ఈ వ్యాసకర్త ఈ వాదమునకు పూర్వచరిత్రలనుండి యెట్టి ప్రమాణములను చూపియుండలేదు. పాశ్చాత్యచరిత్రకారులచే వ్రాయబడిన అసత్యములును అప్రామాణికములు నగు వ్రాతలను తాము నమ్మి వాటిని తర్జుమాచేసి ప్రకటించుటనుబట్టి వారికి పాశ్చాత్య భావదాస్య మెంత కలదో స్పష్టపడుచున్నది. అశ్మకులు మూలకులు, అను రెండుతెగ లున్నట్లు సంస్కృతవాఙ్మయమం దెచ్చ టను గానరాదు. ఇతర వాఙ్మయమందును ఉన్నట్లు తెలియుటలేదు. భారతవర్షముయొక్క ప్రాచీనకాలపు చరిత్ర తెలిసికొనుటకు సంస్కృత వాఙ్మయ మొక్కటియే శరణ్యము. అంతకంటె గత్యంతరము లేదని అందఱకును తెలిసిన విషయమే. ఇట్టి స్థితిలో సంస్కృత వాఙ్మయమున గల శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాదుల వదలి ఈకాలపు చారిత్రక మహామహులు నిన్న మొన్నటివైన బౌద్ధగ్రంథములను, పరదేశములనుండి యీదేశమును దర్శించి పోవుటకు వచ్చిన యాత్రికులయొక్క తెలిసియు తెలియని వ్రాతలను ప్రమాణముగా నెంచుటవలన వారి కీదేశము యొక్క సత్యచరిత్ర ఎట్లు తెలియగలదు? నేలవిడిచి సాముచేయువానికి ఏగతి పట్టునో ప్రాచీన దేశీయ వాఙ్మయమును వదలి వ్రాయబడిన వీరి చరిత్రలకుకూడ అదేగతి పట్టగలదు. అనగా అవి తప్పులు తడికలుగా పరిణమించగలవు.

అశ్మకులు, మూలకు లనెడి జాతు లున్నట్లు పూర్వగ్రంథములం దెచ్చటనైన నుదహరింపబడియుండినచో వ్యాసకర్త అట్టి ప్రమాణ

గ్రంథమును చూపియుండెడివారు. అది కేవలము వారి ఊహాగానమై యున్నది. అశ్మక మూలకులు త్రేతాయుగపు వారు. వారిచరిత్రలు పరంపరగ ఆయాకాలములలో వ్రాయబడుచు రాగా ద్వాపరాంతమున వ్యాసభగవానులు వెనుకటి ప్రమాణగ్రంథముల ననుసరించి తనచే వ్రాయబడిన పురాణములలో కూర్చియుండిరి. వీనికి వ్యతిరేకముగా ఇటీవలి కాలమున వ్రాయబడిన వ్రాతలన్నియు త్యజింపదగినవి గాని ప్రమాణముగా నంగీకరింపదగినవి కావు. బౌద్ధగ్రంథములు నిన్న మొన్నటి వగుటచే వానిని ప్రమాణముగా జేసి ప్రాచీన వాఙ్మయమును త్రోసి వేయుట తెలివితక్కువ పని. అశ్మక మూలకు లనెడి పేరులుగల యిద్దరు రాజు లుండిరని చెప్పబడినంతమాత్రమున 'అశ్మకులు, మూలకులుఅనెడి రెండు తెగ లున్నవనియు, వారే ఉత్తరదేశమునుండి వచ్చి కృష్ణాగోదావరీ తీరభూముల నాక్రమించి రనియు వీరి కెవరు చెప్పిరి? ఆ వ్యాసకర్త చూచిన బౌద్ధగ్రంథములో నాయిద్దరి పేర్లు మాత్ర ముదహరింపబడియున్నవి. మిగిలిన కథయంతయు వ్యాసకర్తగారి యూహాగానము. ఇట్టి యూహాలు చరిత్రలుగా పరిగణింపబడుట ఈ ఇరువదవశతాబ్దములోని హూణభాషా కోవిదులైన హిందూచారిత్రకులలో తప్ప ప్రపంచమునం దేదేశమునను కానరాదు. ఇది కేవలము ఊహాపోహాలతో గూడిన అసత్యవాదము. ఊహాలెప్పుడును చరిత్రలుగా పరిగణింపబడరాదు. ఉహాపోహాలతో అసత్యవాదములను కల్పించి తమ దేశమునకును, తమ జాతికిని అవమానమును కూర్చుట ధర్మము కాదని తెలియవలెను. ఇది దేశమునకును జాతికిని ద్రోహముచేయుట యగును.

## అశ్మక మూలకుల వృత్తాంతము

'అశ్మకు' డనువాడు సూర్యవంశమునకు చెందిన అయోధ్యా రాజు. ఇక్ష్వాకు వంశ సంభవుడు. వాని కుమారుడే మూలకుడు. ఈ మూలకునికి నారీకవచు డను నామాంతరము గలదు. పరశురాముడు అఖిల క్షత్రియుల సంహారము చేయబూనినప్పుడు ఈ మూలకుడు స్త్రీ

వేషము ధరించి అంతఃపురస్త్రీలలో దాగియుండెనట. ప్రాణభయమున క్షాత్రమును విడిచి స్త్రీరూపధారి యైనవాని జంపుట నీతికాదని పరశు రాముడు వీనిని విడిచి చనెను. వాని వంశక్రమములు దెల్పుచుంటిమి.

ఇక్ష్వాకు వంశములో ప్రసిద్ధుడు 'సగరచక్రవర్తి.' ఆతని మనుమడు భగీరథుడు. ఆతనినుండి ఎనిమిదవతరమువాడు సుదాస చక్రవర్తి. ఈయన భార్య మహాప్రతివ్రతా తిలక మగు మదయంతీ దేవి. ఈమె గర్భిణియై ఏడేండ్లు మోసియు ప్రసవించనందున వసిష్ఠుడు అశ్మక మనెడి (శస్త్రవైద్యములో కోతకోయు వాడిగల యొకానొక పనిముట్టు) శస్త్రంబున నా గర్భంబు జీరిన అశ్మకుడనెడి కుమారుడు పుట్టెను. ఆతనికి మూలకుండు గలిగె. ఈతడు నిర్మూలంబైన రవివంశంబునకు మూలంబగుటంజేసి 'మూలకుం'డనంబరగె. (ఆంధ్ర భాగవతము 9-251-253) మూలకునినుండి ఐదవతరమువాడు రఘుమహారాజు. రఘువునుండి మూడవతరమువాడు దశరథుడు. ఆతని కుమారులు శ్రీరామచంద్రమూర్తియు, భరత, లక్ష్మణ, శత్రఘ్నులు నైయున్నారు. పరశురామునిచే సూర్యవంశ క్షత్రియులందరు నశించిరి. అం దశ్మకుడుకూడ మరణించెను. మూలకుడు మాత్రము చావు తప్పించుకొని ఎట్లో బ్రతికెను. మూలకుడుతప్ప అశ్మకునికి వేరు సంతానము లేదు. అశ్మకునికి సోదరులెవరును లేరు. ఇతరబంధువు లెవరైన నుండిరనిన పరశురామునిచే సూర్యవంశపు రాజులందరును చంపబడిరి. సంహారమునకు తప్పి మిగిలినవారి నందరను వెదకి వెదకి యిరువదొక్క మారులు పరశురాముడు సంహరించియున్నాడని చరిత్ర చెప్పుచున్నది. ఇట్టి స్థితిలో ఈ అశ్మక, మూలకులు రెండు తెగలవారలనియు వా రాంధ్ర దేశమునకు వలసపోయి రనియు వీరలే తెలుగు జాతికి మూలమనియు, వారి భాష తెలుగనియు కల్పించివ్రాయుట కేవలము గాలిని మూటగట్టి చరిత్రగా చూపుట గాదా! యని ప్రశ్నించుచుంటిమి. ఇది కేవలము అసత్యకల్పన యనియు అట్టి యసత్యకల్పనలతో చరిత్రను పూరించుట చరిత్రకు ద్రోహముచేయుట యనియు ఊహించలేనందులకు విచారించుచుంటిమి.

ఈ యశ్మక, మూలకుల చరిత్ర పురాణములన్నిటియందును గలదు. పురాణములలో చెప్పబడిన ప్రాచీనచరిత్రయందు గల అశ్మక, మూలకులను రాజులపేర్లను తీసికొని అశ్మకులు మూలకులు అని రెండు బాహ్యజాతులున్నట్లు అభూతకల్పన చేసి పాశ్చాత్యచరిత్రకారులు వారిని గోదావరీతీరమునకు దెచ్చి యిచ్చట 'అంధ్రజాతి'కి మూలపురుషు లని కల్పించి చెప్పుచు ఆంధ్రజాతి వారి సంతాన మైనందున ఈజాతియంతయు సంకరజాతిగా ప్రచారము చేసిరి. ఆవాదములనే వారి మానసపుత్రులైన హూణభాషా కోవిదులగు భారతీయ చరిత్రకారులు ప్రచారములోనికి దెచ్చుటకు వారి శక్తి కొలది ప్రయత్నించుచుండిరి. దీనికి కారణము పాశ్చాత్య భావదాస్యము తప్ప వేరుగాదు. పైవిచారణ వలన వీరి వాదమంతయు పేకముక్క లతో నిర్మింపబడిన సౌధమువలె కూలి నేలమట్టమైనది. ఇప్పటి కైనను వీరు కనులు తెరచి తమ వాఙ్మయమును చిత్తశుద్ధితో పరిశోధించుకొని చరిత్రలను వ్రాయుటకు ప్రయత్నించుట శ్రేయస్కరము.

మద్రాసులోని తెలుగుభాషాసమితి వారిచే ఆంధ్రప్రజల కష్టార్జిత ద్రవ్యము కొన్నిలక్షలు వెచ్చపెట్టి వ్రాయించబడుచుండిన తెలుగువారి చరిత్రగ్రంథములలో 'ఆంధ్రులను' గురించి శ్రీ శిష్ట్లా నరసింహశాస్త్రిగారి కుమారుడు శిష్ట్లా రామకృష్ణశాస్త్రి M. A. గారిచే వ్రాయించి చేర్పించ నుద్దేశించిన దీ బాహ్యజాతివారయిన అంధ్రలే ఆర్యాంధ్రులని చెప్పెడి అసత్యచరిత్ర కావచ్చు నని సందేహము కలుగుచున్నది. పాపము శమించుగాక!

ఈ ప్రాచ్యకదేశ భాగమునకు ఆంధ్రదేశమను మహారాజుయొక్క ఆఱవ కుమారుడయిన 'ఆంధ్రరాజు' యయాతి చక్రవర్తి నాలుగవ కుమారుడగు 'అనువు' వంశములోని ఆఱవతరము వాడయిన 'జనమేజయుని' వంశములోనివాడు. చంద్రవంశమునకు చెందిన రాజు. ఈ రెండువాదములును పరిశోధింపదగినవే యని వ్యాస కర్త గారు చెప్పుట శుభావహము. కాని వారు చెప్పిన మొదటివాదము

ప్రమాణశూన్యమైన కల్పితవాదము. రెండవది వాదమని చెప్పతగదు. అది సప్రమాణమై పూర్వచరిత్రచే నిర్ధారణచేయబడిన సిద్ధాంతము. అది సత్యమైన చరిత్ర.

## ఆంధ్రము తెలుగు వేఱు కావు

ఆంధ్రము, తెలుగు వేరనెడి వాదమును గురించిన విమర్శ అనావశ్యకము. ఆంధ్రులనుగురించిన చరిత్ర పూర్వచరిత్రాధారమున ధ్రువపడినచో ఈ భాషావాదము దానియంతట నదియే సమసిపోగలదు. ఆంధ్రమే తెలుగు. తెలుగే ఆంధ్రము. అవి రెండు కావు. తెలుగుభాషనే ఆంధ్రభాష యని కొందరును, తెలుగుభాష యని కొందరును వాడియుండిరి. వాటిని వేరువేరు భాషలుగా నెంచుట పొరబాటు. కాలము గడచుచురాగా భాషలోగూడ పదవ్యత్యాసము లేర్పడినవి.

శాసనములలో గల భాషనుబట్టి ప్రజలందరాకాలములో ఆభాషనే మాటలాడుచుండిరని ఊహించుట పొరబాటు. ప్రజలభాష ఆంధ్రము లేక తెలుగుగా నున్నను శాసనములు సంస్కృతములో గాని, ప్రాకృతములో గాని వ్రాయించవచ్చును. అంతమాత్రమున శాసనములలోని భాషయే ఆకాలమున నాప్రాంతీయప్రజలు మాటలాడుచుండిరని యెంచుట న్యాయముగా లేదు. ఆ శాసనములు వ్రాయించినది ప్రజలు కారు. ఏదియో యొకప్రాంతపు రాజో, లేక యొక దాతయో యైయుందురు. అందువలన ఆశాసనములో ఏభాష నుపయోగించవలయు ననువిషయ మా శాసనకర్తయొక్క రుచిని, ఇష్టమును అనుసరించి యుండును. శాసనకర్తలకును ప్రజలకును ఎట్టి సంబంధమును ఉండదు. శాసనకర్తలు శాసన భాషను గురించి ప్రజలతో సంప్రదించ నవసరము లేదు. అట్లు పూర్వశాసనములు వ్రాయించినప్పుడు ప్రజల కంగీకారమైనభాషలో శాసనములు వేయబడినట్లు ఎట్టి ప్రమాణమును ఇంతవఱకు దొరకియుండలేదు. కాబట్టి శాసనములలోని లిపినిబట్టి ఆకాలములోని ప్రజల భాష శాసనభాషయే యని నిర్ధారణచేయుటకు వీలు లేదు.

## సారాంశము.

కృష్ణాగోదావర్యాది మహానదులచే పవిత్రమగుచుండిన మన నివాసభూమి ప్రాచీనకాలమున 'ప్రాచ్యక' దేశమని పిలువబడుచుండెడిది. దానినొకకాలమున 'బలి' యనెడి మహారాజు పాలించి యున్నాడు. ప్రాచ్యక దేశము ఉత్తరమున బెంగాలునకు ఉత్తరసరిహద్దు నుండిదక్షిణముగా ఇప్పటి మద్రాసునకు దిగువవఱకు వ్యాపించియుండెను. బలిమహారాజు అనంతరము ఆతని కుమారులు ఆరుగురును దాని నారు భాగములుచేసి పంచుకొని ఎవరి వాటాకు వచ్చిన భూభాగమును వారు తమ పేరులతో వ్యవహరించుకొని యుండిరి. బలియొక్క కుమారులు 1 అంగరాజు 2వంగరాజు 3 కళింగరాజు 4 సుంహ్మరాజు 5పుండ్రరాజు 6 ఆంధ్రరాజు అనెడి పేరులుగలవారైయుండిరి. వారు తమతమ భాగములకువచ్చిన దేశభాగములకు వరుసగా అంగదేశమనియు వంగదేశమనియు కళింగదేశమనియు సుంహ్మదేశ మనియు పుండ్రదేశ మనియు ఆంధ్రదేశమనియు పేరులనుంచి పరిపాలించియుండి రని పూర్వచరిత్రలయందు సూటిగా చెప్పబడియుండగా ఎవరో 'అంధ్ర' లనబడెడి బాహ్యజాతివా రుత్తరదేశమునుండి వచ్చి ఆక్రమించి నివసించి యుండవచ్చుననియు అందువలననే యీదేశమునకు'ఆంధ్రదేశ'మనుపేరు వచ్చియుండవచ్చు ననియు సందేహముతో గూడిన యీ వికల్పము లేల చేయవలసివచ్చినదో తెలియరాకున్నది. మన సందేహములకు, వికల్పములకు, కల్పనలకు ఎట్టియవకాశమును లేకుండ భాగవతమునందు ఆంధ్రదేశమునకీపేరెటుల వచ్చినదో సూటిగా చెప్పబడినది. ప్రాచీన ప్రాచ్యకదేశభాగమే'ఆంధ్రదేశ'మని పిలువబడినది. అట్టి ఆంధ్రదేశములో అతిపురాతనకాలమునుండి నివసించుచుండిన ప్రజలందరును 'ఆంధ్రు' లని పిలువబడిరి. వారు మాటలాడు తెలుగుభాష కూడ ఆంధ్ర భాష యను నామాంతరమును పొందినది. కనుక 'ఆంధ్రులు' అనబడెడి ప్రజలందరును 'చాతుర్వర్ణ్యస్థులును స్వచ్ఛమైన ఆర్యజాతీయులైయున్నారు.

ఓం తత్ సత్.

# జంబూద్వీపము-దాని విభాగములు

భూగోళస్థిత జంబూద్వీపమును దానియందలి నవవర్ష విభాగము లను గురించి పురాణములలోని వర్ణనలను తీసికొని అనేకులనేకవిధము లుగా విమర్శించుచున్నారు. వారి విమర్శనములను చూడగా పురాణము లలో వర్ణింపబడిన జంబూద్వీపమేదియో వారికి పొడగట్టినట్లు కన బడుటలేదు.

పురాణములలో చెప్పబడిన భూగోళ ఖగోళ విషయములు సృష్ట్యాది (సుమారు ౧౯౫౬ కోట్ల సంవత్సరముల) నాటివైయున్నవి. పిమ్మట వానిలో చాలమార్పులు కలిగినవి. వానిని తెలియుటకు జ్యోతి స్సిద్ధాంతజ్ఞానమవసరము. పురాణములలో ఏ శాస్త్రమునకు సంబం ధించిన విషయము ప్రస్తావింపబడునో, ఆశాస్త్రజ్ఞాన మున్నపుడే ఆ విషయ మర్థమగునుగాని అట్టిజ్ఞానము లేనియెడల అర్థముకానేరదు. సిద్ధాంత విషయములు తెలియనివారికి పురాణములలోని విభాగములు సమన్వయము కానేరవు. నవీనులచే చెప్పబడిన భూభాగముల ననుస రించి పురాణములలోని విషయముల సమన్వయపరుప యత్నించు టయే ఇట్టి విపరీత భావములకు హేతువైనది.

పూర్వు లేవిధముగా వ్రాసియుండిరో ఆమూలాగ్రముగ తెలిసికొని, మనమును వారిదారినే పోయి వాని నర్థముజేసికొనినచో అన్నియు సత్యముగా గోచరించును. విపరీతములగు ఊహాలు గలుగుట మన దోషదృష్టివలన. అంతేకాని పూర్వ ఋషులకు భూగోళజ్ఞానము లేక వ్రాయుటవలన కాదు. వారికి ఆవిషయములలో మంచి జ్ఞానము కలిగియున్నదనుట కెట్టి సంశయమును లేదు. వారు వ్రాసినదానిని తెలిసికొనక చేయబడిన మన విమర్శనలు మాత్ర మజ్ఞానజన్యములై యున్నవనుట నిస్సంశయము.

పురాణములలోని విషయములు చెప్పునపుడు ప్రతిచోటను అక్ష రాభ్యాసము మొదలు వర్ణక్రమము చెప్పబడదు. పురాణములను

చదివి అర్థము చేసికొనెడి విజ్ఞానమును ఇతర శాస్త్రసహాయముచే సంపాదించుకొనిన అధికారియే పురాణములను చదివి అర్థము చెప్పుట కర్హుడుగాని జ్ఞానలవ దుర్విదగ్ధుడు పురాణ పఠనమున కర్హుడు గాడు. వేదార్థము నెఱుగుట కాఱు (షట్శాస్త్రములు) శాస్త్రముల జ్ఞాన మెటు లవసరమో అటులనే పురాణపఠనమునకు జ్యోతిషము మొదలు గాగల ఇతర శాస్త్రజ్ఞాన మవసరము. అంతవరకు నాతడు పురాణము లను చేబట్టి అర్థము చెప్పుట కర్హుడుకాడు. అనధికారులైన వారు పురాణపఠనము చేయుటకు మొదలిడుటవలననే మన పురాణములు తప్పుల తడికలుగా ప్రదర్శింపబడుట కవకాశము కలిగినది. హేయమైన యిట్టి దురభిప్రాయములవలన వారు చెడుటయేగాక లోకులనుగూడ చెడగొట్టినవా రగుచున్నారు.

ప్రాచీనులచే చెప్పబడిన జంబూద్వీపమును దానిలోని భారత వర్షాది విభాగములను గుర్తించుటకు అనేకులు ప్రయత్నించుచు పురాణ ములలో వర్ణింపబడిన జంబూద్వీపమును, వర్షవిభాగమును గందరగోళ ముగా జూపుచుండిరి. వారికి అర్థమైన ప్రకారము మేరువును చీనాలోని గోబీ యెడారిలో నున్నటుల గుర్తించుచుండిరి. జంబూద్వీపమనగా భారతవర్షములోని ఉత్తరభాగమని కొందరును, దక్షిణభాగమని కొంద రును భారతవర్ష మంతయునని మరికొందరును చెప్పుచున్నారు.


జంబూద్వీపమును, నవవర్షములుగా చేసి స్వాయంభువ మనువు కుమారుడయిన ప్రియవ్రతుడు తన కుమారులకు పంచియిచ్చెను. అందుచే భారతవర్షము జంబూద్వీపములో తొమ్మిదవ భాగమైయున్నది. తొమ్మిదవ భాగమైన భారత వర్షము జంబూ ద్వీప మెట్లగును?

వీరింకొక విధముగా గూడ నవవర్ష నిర్ణయముం జేసిరి.

ఆసియాఖండపు పటమును తీసికొని దక్షిణముగా భారతవర్షము ప్రారంభించి చీనా, తుర్కీ, గోబీ యెడారులలో ఇలావృతవర్షమును గుర్తించి దానిమధ్య మేరువును జూపి దాని కుత్తరమునగల సైబీరియా

యెడారి మొదలు ఉత్తర సముద్రమువరకు రమ్యక, హిరణ్యక, కురు వర్షములను గుర్తించి మొత్తముమీద ఆసియాఖండము నంతను మాత్రము జంబూద్వీపముగా జూపుచుండిరి. విషయ మూమూలాగ్ర ముగ తెలియకపోవుట వేఱుమాట. విషయ మొకవిధముగ నుండగా దానిని సరియగు విధమున దెలిసికొనక విపరీతార్థములను గల్పించి హాస్యాస్పదములుగా బ్రదర్శించుట ప్రమాదకరమైన విషయము.

## భూగోళస్థిత జంబూ ద్వీపము




నెం ౧ పటము

మనముండిన యీ బ్రహ్మాండములో భూలోకాదిగ సత్యలో కము వఱకు ఏడులోకములూర్ధ్వభాగమునను, అతలాది పాతాళము

వఱకు ఏడు అధోలోకములును మొత్తము పదునాలుగులోకములు గలవు. అందు భూలోకము రెండుభాగములు: ౧ భూగోళము. ౨ మహాభూమి.

మనము నివసించుచుండిన యీ భూగోళమునకు దిగువను అయిదు కోట్ల బ్రహ్మాండ యోజనముల దూరమున(౧ బ్ర.యో.=$30\frac{2}{3}$ ఇంగ్లీషు మైళ్ళు) దక్షిణముగా 'మహాభూమి' యనునది యున్నది. పురాణములలో వర్ణింపబడిన లక్ష యోజన విస్తీర్ణ జంబూద్వీపమును దానిని చుట్టి లవణసముద్రమును, ఇట్లొక దానిని చుట్టి యొకటిగా సప్తద్వీపములును, సప్తసముద్రములును మహాభూమియందుండి యున్నవి. పంచాశత్కోటియోజన విస్తృత భూమండల మనునది ఇదియే. (ఏబదికోట్ల యోజనముల విస్తృతి గలది) దానిని గురించిన వివరములు నాచే వ్రాయబడిన "బ్రహ్మాండ సృష్టి విజ్ఞానం" అను గ్రంధమున వివరింపబడినవి. ప్రస్తుతవిషయము భూగోళస్థిత జంబూద్వీపమును గురించి.

మహాభూమిమీదగల సప్తసముద్ర ద్వీపముల పేరులతో భూగోళముకూడ సప్తసముద్ర ద్వీపములుగా విభజింపబడినది. ఈ బ్రహ్మాండమునకు భూగోళము సమమధ్య ప్రదేశమున సమఘన వృత్తాకారముగా నున్నదని మన గ్రంథములు చెప్పుచున్నవి. ప్రాచీనులు ఈ భూగోళమునకు సమమధ్య ప్రదేశముగుండ చుట్టు నొక రేఖ గీచి దానికి విషువన్మండల రేఖ లేక నిరక్ష రేఖ (అనగా ఈక్వేటరు) అని పేరిడిరి. అట్టినిరక్ష రేఖ మొదలు ఉత్తర ధ్రువమువఱకు గల భూభాగమునకు 'దేవభాగము' లేక 'జంబూద్వీపము' అని పేరు. నిరక్ష రేఖ మొదలు దక్షిణధ్రువమువఱకు 'అసురభాగము' అని పేరు.

నెం. ౧ పటమును చూడుడు. ఇందు లవణాది సప్తసముద్రములును జంబూద్వీపాద్యులైన సప్తద్వీపములును గలవు. కాని యీ కాలమునకు భూభాగములో హెచ్చుభాగము సముద్రముగామారిపోయి అచ్చటచ్చట కొన్ని లంకలుమాత్రము నిలిచియున్నవి. ఈ

విషయమును గురించి శ్రీభాస్కరాచార్యులు తన 'సిద్ధాంతశిరోమణి' అను జ్యోతిష గ్రంథములో నీవిధముగా వ్రాసియుండిరి:

శ్లో: భూమేరర్ధం క్షారసింధోరుదక్స్థం
జంబూద్వీపం ప్రాహు రాచార్యవర్యాః,
అర్ధేఽన్యస్మిన్ ద్వీపషట్కస్య యామ్యే
క్షారక్షీరాద్యంబుధీనాం నివేశః.

(సిద్ధాన్త శిరోమణి)

తా. లవణ సముద్రమున కుత్తరమునగల భూగోళముయొక్క అర్ధభాగమును జంబూద్వీపమని ఆచార్యులు చెప్పియుండిరి. దక్షిణార్ధ భాగము లవణ, క్షీరాదులైన సప్తసముద్రములకును ఆఱు ద్వీపములకును నిలయమై యున్నది. (నెం ౧ రు పటమును జూచునది).

పూర్వులు భూగోళమును నిరక్ష రేఖమీదుగా కోసి రెండు భాగములు చేసిరి. అవి ఉత్తరార్ధగోళము, దక్షిణార్ధగోళము నని రెండు భాగములుగా నేర్పడినవి. వారు 'లంక' మెరిడియన్ మీద "0" సున్న డిగ్రీనుంచి భూగోళమును ౩౬౦ డిగ్రీలుగా విభాగించిరి. ఇప్పుడు నవీనులు నిలువుగా కోసి పూర్వార్ధ, పశ్చిమార్ధగోళములుగా రెండు భాగములు చేసియుండిరి. వారు "గ్రీనుచ్" మెరిడియన్ వద్ద సున్న డిగ్రీనుంచి బయలుదేరి భూగోళమును ౩౬౦ డిగ్రీలుగా విభాగించిరి. నవీనుల విభాగము ప్రకారము మనవారలు విమర్శించుచున్నందున పూర్వపు విభాగములు మనకు సరిగ గోచరించుటలేదు. వారు చేసినటుల ఉత్తర, దక్షిణార్ధగోళములుగా చేసిచూచిన జంబూద్వీపమును, దానిలోని నవవర్ష విభాగమును మనకు సులభముగా బోధపడును.

నిరక్ష రేఖ కుత్తరముగా ఉత్తరధ్రువము వఱకు నుండిన ప్రదేశమంతయు—అనగా ఉత్తరార్ధగోళమంతయు జంబూద్వీపముగా వ్యవహరింపబడినది. ఇందు ఆసియా, యిరోపా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా ఖండములును సముద్రములుగా ఇప్పుడు మనకు కాన్పించుచున్న మిగిలిన భాగమంతయు పూర్వము భూఖండముగానుండి యిందు చేరి


యున్నది. అందు ఆఫ్రికాఖండ దక్షిణభాగమునంటి తూర్పుగా ఈక్వేటరున కుత్తర దక్షిణములలో కొంత భూభాగము అమెరికావఱకును ఉండెడిది.

ఆ భూభాగమంతయు సముద్రగామిత్వైనది. దాని యవశేషములే మెడగాస్కర్, సముద్రగామిత్వైన రావణాసురుని లంక, సింహళము, సుమిత్రా, జావా, ఆస్ట్రేలియా మొదలగు లంకలు. అట్లు సముద్రగామిత్వైన ప్రదేశము నిప్పుడు పరిశోధనలుచేసి "లెమూరియా" యనెడి భూఖండ మొకటి సముద్రగామిత్వైనట్లు చెప్పుచున్నారు. అయిదు కోట్ల సంవత్సరముల క్రిందట సగరచక్రవర్తి కాలములో ఈభూఖండము సముద్రగామిత్వైనట్లు మన పురాణములు చెప్పుచున్నవి. నిరక్షరేఖ (ఈక్వేటరు) కుత్తరమునగల భాగమంతయు 'జంబూద్వీపము' ని పూర్వులు నిర్ణయించిరి. నిరక్షరేఖకు దక్షిణమున అనగా జంబూద్వీపము చుట్టును ఉప్పుసముద్రము ౨౭౦ యోజనములు (౧యో=౮$\frac{1}{2}$ ఇంగ్లీషు మైళ్ళు) వెడల్పు గలిగియున్నట్లు పూర్వులు గుర్తించి యుండిరి. ఆ ఉప్పుసముద్రమున మునిగిపోయిన లెమూరియా ఖండము లోని నిరక్షరేఖకు దక్షిణముగా కొంత భూఖండమును, కొన్ని పర్వతములును, కొన్ని లంకలును ఉండియున్నట్లు పూర్వులచే వర్ణింపబడినది.

నిరక్షరేఖకు దక్షిణమునగల భూభాగము లేకాక నిరక్షరేఖ కుత్తరముగాగల జంబూద్వీపములోకూడ చాలభాగము (ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, ఉత్తర అమెరికా యనెడి నాలుగు ఖండములును, అచ్చటచ్చట కొన్ని లంకలును తప్ప మిగిలిన భూభాగమంతయు) ఉప్పుసముద్రముచే నాక్రమింపబడినది. దానిని మనసున నుంచుకొని పూర్వులచే చెప్పబడిన విధమున మనము జంబూద్వీపమందలి నవ వర్షములను గుర్తించుదము. సులభముగా గుర్తించుటకు వీలగునటుల నిరక్షరేఖ కుత్తరభాగము అనగా జంబూద్వీప పటము ఇందులో జతపరచబడినది. (నెం ౨ రు పటమును చూడుడు)

# జంబూద్వీప నవ వర్షవిభాగము

భూగోళస్థిత జంబూద్వీపమునకు దక్షిణమున చుట్టునునిరక్ష రేఖ యున్నది. దానికిదక్షిణమున (ఉత్తరార్ధ గోళము చుట్టును) ఉప్పుసముద్రము గలదు.



నెం. ౨ వ పటము

జంబూద్వీపములో దక్షిణమున భారతవర్షము గలదు.

ఈభారతవర్షము పూర్వము నిరక్షరేఖవఱకు వ్యాపించి యుండెడిది.. దిగువను 'లంక' యను ద్వీపము గలదు. (సింహళము పూర్వము భారతవర్షముతో కలిసి యేకఖండముగానుండెడిది.) ఆలంకా ద్వీపమున సున్న (౦)డిగ్రీని గుర్తించి— అనగాఅచ్చట ప్రారంభించి పూర్వఋషులు నిరక్షరేఖమీదుగా భూగోళమును ౩౬౦డిగ్రీలుగా విభాగించి యామ్యోత్తర రేఖల (Meridian Or Longitudes) లిఖించి యుండిరి,

ఇప్పుడు నవీనులు గ్రీనిచ్ మెరిడియన్ వద్ద సున్నడిగ్రీ పెట్టి యామ్యోత్తర రేఖలు లిఖించియుండిరి. లంకవద్ద బయలుదేరి లంకకు తూర్పుగా నిరక్ష రేఖమీదుగా నడచిన తొంబదవడిగ్రీవద్ద "యవకోటి" యను పట్టణమొకటి యున్నట్లు జ్యోతిస్సిద్ధాంతగ్రంథములు జెప్పు చున్నవి. దానికి తూర్పుగా నిరక్ష రేఖమీద తొంబదిడిగ్రీలు నడచిన ఉత్తరమున సిద్ధపురియను పట్టణము గలదు. లంకనుండి యీసిద్ధపురి యొకే లాంగిట్యూడుమీద దక్షిణోత్తరముల నున్నట్లు స్పష్టముగా గోచరించును. భూగోళముమీద లంకవద్దనుండి వెనుక వైపున కొక మేకు గ్రుచ్చిన నది సిద్ధపురివద్దకు పోవును. అనగా లంకకు ఎదురువైపున సిద్ధపురి యున్నదనుట స్పష్టము.

లంక జంబూద్వీపమునకు దక్షిణముగా నుండినయెడల దాని కెదురుగా నుండిన సిద్ధపురి జంబూద్వీపమున కుత్తరముగానున్నదని వేరుగా చెప్పనక్కరలేదు.

ఈ సిద్ధపురి అమెరికా (కురువర్షము) లో ఈక్వేటరుమీద గలదు. కనుక లంకతో గూడిన భారతవర్షము జంబూద్వీపములో దక్షిణముగా నుండిన సిద్ధపురితో కూడిన కురువర్షము (అమెరికా) జంబూద్వీపములో ఉత్తరమున నున్నదని చెప్పుట కెట్టి యాక్షేపమును లేదుగదా! దక్షిణదిక్కున కెదురుగా ఉత్తరదిక్కు గలదని చెప్పినవారు బాగుగ తెలిసి చెప్పిన వారే గదా!

దానిని గ్రహించలేక అజ్ఞానముచే తామే తెలివిగలవారని భ్రమించి తెలిసి చెప్పిన వారి మాటలకు విపరీతార్థములు జేయువార లెట్టివారలో మీరే గ్రహింపుడు.

లంకకు తొంబదిడిగ్రీలవద్ద తూర్పున నుండిన "యవకోటి" యను పట్టణమున కెదురుగ 'రోమక' మను పట్టణముండి యున్నది. తూర్పుదిక్కున కెదురుగా నుండినది పడమర దిక్కు అని ప్రసిద్ధము. ఇప్పుడు జంబూద్వీపము చుట్టును గల నిరక్ష రేఖ మీదుగా దక్షిణ సముద్రతీరమున గల లంకనుండి బయలుదేరి నడచిన తూర్పున

తొంబదవ డిగ్రీవద్ద 'యవకోటి' పట్టణమును, దానికి తొంబదిడిగ్రీల దూరమున (నూట యెనుబది డిగ్రీలదూరమున) ఉత్తరమున "సిద్ధపురి" పట్టణమును, దానికి తొంబదిడిగ్రీల దూరమున అనగా లంకనుండి తూర్పుగా ౨౭౦ డిగ్రీవద్ద 'రోమక' మను పట్టణమును గుర్తించుచు తిరిగి దక్షిణమున గల 'లంక'కు చేరుదుము.

అనగా లంకకు సరిగా ఉత్తరమున ౧౮౦ డిగ్రీల దూరమున 'సిద్ధపురి' యున్నదన్నమాట. ఈదృష్టితో పటముమీద మనపూర్వులచే పురాణములలో చెప్పబడిన నవవర్షములను గుర్తించుదము. దక్షిణమున భారతవర్షమును, దాని కుత్తరమున హిమాలయ పర్వతమును, దాని కుత్తరమున కింపురుషవర్షమును దాని కుత్తరమున హేమకూట పర్వతమును, దాని కుత్తరమున హరివర్షమును, దాని కుత్తరమున నిషధ పర్వతమును, దాని కుత్తరమున ఇలావృతవర్షమును గలవు. (ఇలావృతవర్ష మధ్యమున మేరువు గలదు.) లంకనుండి మేరువునకు తొంబది డిగ్రీల యామ్యోత్తర రేఖ (లాంగిట్యూడ్) మీద దూరము. దాని కుత్తరమున నీలపర్వతమును, (ఇది అమెరికాలోనికి పోవును.) దాని కుత్తరమున రమ్యక వర్షమును, దాని కుత్తరమున శ్వేతపర్వతమును, దాని కుత్తరమున హిరణ్యక వర్షమును, దాని కుత్తరమున శృంగవాన్ పర్వతమును, దాని కుత్తరమున కురువర్షమును గలవు

కురువర్షమున కుత్తరపు సరిహద్దున నిరక్ష రేఖయు దాని కుత్తరమునగల ఉత్తరసముద్రమున 'సిద్ధపురి' యు గలదని జ్యోతిశ్శాస్త్రవేత్తలు పురాణవాక్యములను వివరించి చెప్పియుండిరి. సిద్ధపురినుండి లంక యామ్యోత్తర రేఖమీద (మెరిడియన్ లేకలాంగిట్యూడ్) మేరువునకు౯౦ డిగ్రీల దూరము. పైని చెప్పబడిన ౧ భారత ౨ కింపురుష ౩ హరి ౪ ఇలావృత ౫ రమ్యక ౬ హిరణ్యక ౭ కురువర్షము లేడింటిలో మధ్య నున్నది ఇలావృతవర్షము. దీని నడుమ మేరువు గలదు.

అనగా జంబూద్వీపముచుట్టును గల నిరక్ష రేఖనుండి ఎటు కొలిచినను తొంబదిడిగ్రీలదూరమున ఉత్తరముగా మేరువు గలదు.

మేరువు బ్రహ్మాండమునకు సమమధ్యభాగమున దక్షిణమునుండి ఉత్తరముగా నున్న ఊహింపబడిన (Imaginary) బ్రహ్మాండమధ్యరేఖ. ఈ రేఖయందధోలోకము లేడును, మహాభూమి భూగోళములును, ఊర్ధ్వలోకము లేడును మొత్తము ౧౪ లోకములు గ్రుచ్చబడియుండినట్లూహింపబడినది.

ఈ బ్రహ్మాండమధ్యరేఖనే భూగోళమునకు సంబంధించినంత వఱకు భూమధ్యరేఖ యని మనము వ్యవహరించుచున్నాము. దీనికే మేరురేఖయనియు మేరుదండమనియు మేరుపర్వతమనియు పేర్లు. భూగోళముయొక్క ఉత్తరపు చివర ఉత్తరధ్రువమేరువు అని పిలువబడుచున్నది. దక్షిణపుచివర దక్షిణ ధ్రువ మని పిలువబడుచున్నది. ఈ మేరురేఖకే స్వర్గములో ఉత్తరపు చివర ఊర్ధ్వధ్రువస్థానమని వ్యవహరింపబడుచున్నది.

ఇలావృత వర్షమునకు తూర్పున నిరక్షరేఖ వరకు (౮)భద్రాశ్వ వర్షము గలదు. దీనికి తూర్పుననున్న నిరక్షరేఖకు తూర్పునగల సముద్రతీరమున యవకోటియను పట్టణ మున్నది. ఇలావృతమునకు పశ్చిమమున గంధమాదన పర్వతమును, దానికిపశ్చిమమున (౯) కేతుమాల వర్షమును గలవు. దీనికి పశ్చిమమునగల నిరక్షరేఖ నంటియున్న పశ్చిమసముద్రతీరమున 'రోమక' పట్టణము గలదు. ఈ విషయము సూర్య సిద్ధాంతము, గోళాధ్యాయము, ౩౭ మొదలుగానున్న శ్లోకములలో స్పష్టపరుపబడినది.

పురాణములలో నవవర్ష కథనమున భారతవర్షమును మొదలుపెట్టి యొకదానికుత్తరముగా నొకదానిని చెప్పుచు ఇలావృతవర్షమువఱకు చెప్పబడిన విషయము నవీనులకుఆక్షేపణీయము కాదు. ఇలావృతవర్షమునకు మధ్య మేరువున్నదని చెప్పినదానిని గూడ వారు సమ్మతింతురు.

ఇలావృత వర్షమునకు పూర్వపశ్చిమముల భద్రాశ్వ, కేతుమాల వర్షములు నిరక్షరేఖవరకు వ్యాపించియున్నవనిన దానికిని

వారంగీకరించుట కభ్యంతర ముండదు. కాని ఇలావృత వర్షమున కుత్తరమున రమ్యక, హిరణ్మక, కురువర్షములు మూడు చెప్పబడగా నవీనులు దాని కొప్పుకొనక అన్నిటికిని మేరువు ఉత్తరమున నుండగా దానికుత్తర మని చెప్పుట వలన పూర్వఋషులకు భూగోళ జ్ఞానము లేదని చెప్ప సాహసించిరి.

అమెరికాలోని ప్రదేశమును రమ్యక, హిరణ్యాక కురువర్షము లని యంగీకరించినచో అవి మేరువునకు దక్షిణమున నున్నట్లు చెప్పబడవలయునని వారియభిప్రాయము. ఈజంబూద్వీపమునకు- అనగా ఉత్తరార్ధగోళమునకు-నాలుగువైపుల నాల్గుదిక్కులను నిరూపించుకొని, అందు దక్షిణమున గల భారతవర్షమునుండి బయలుదేరి ఉత్తరమున నిరక్షరేఖమీద సిద్ధపురికి బోయిన వరుసగ నొకదాని కుత్తరముగా మరియొక వర్షమును చెప్పుటయే సమంజసము.

ఆ ప్రకారమే పురాణములలో చెప్పబడినది. కాని యిప్పటి కాలమువారు మేరువును ప్రాతిపదికగా తీసుకొని బయలుదేరిన వర్షములన్నియును నొకదానికొకటి దక్షిణముగా నున్నటులనే వారికి గోచరించును. అందువలన మేరువునకుత్తరమున అమెరికాఖండములోని భూభాగములను వర్షక్రమముగా విభాగించి చెప్పినటుల వారు గుర్తించుట కవకాశము గలుగలేదు. వారు నిరక్షరేఖను ప్రాతిపదికగా జేసి అందు దక్షిణమునగల భారతవర్షములోని "లంక" నుండి సరాసరి ఉత్తరమున నిరక్షరేఖమీద గల సిద్ధపురివరకు పోయిన వర్షము లన్నియు ఒకదాని కొకటి యుత్తరముగా నున్నటుల గోచరించును. (నెం ౩రుపటమును చూడుడు).

పైవివరములనుబట్టి నిరక్షరేఖ కుత్తరముగాగల భూభాగ మంతయు జంబూద్వీపమనియు దానినే పూర్వులు నవవర్షములుగా విభాగించి చెప్పిరనియు స్పష్టము. ఇప్పుడు మనము ఆసియా,ఆఫ్రికా, ఐరోపా, ఉత్తరఅమెరికా అని పిలుచుచుండిన భూభాగములు గాక పూర్వము సముద్రగామియై, ఇప్పుడు పసిఫిక్, అట్లాంటిక్కు, హిందూ మహాసముద్రములలో లీనమైయుండి, పరిశోధకులచే తెలిసికొనబడినట్లు

చెప్పబడుచున్నదియు 'లెమూరియా', 'అట్లాంటిస్' 'గాండ్వానా ల్యాండు' అని పిలువబడుచున్నదియు నిరక్షరేఖకుత్తరమున జంబూద్వీపములో చేరియుండి సముద్రగామియైనదియు నగు భూభాగమంతయు జంబూద్వీపమను పేరు నంది సృష్ట్యాదినుండియు భారతీయులచే నాక్రమింపబడి పరిపాలింపబడుచు సోదరులవలన పంచుకొన బడుచుండిన దని స్పష్టపడుచున్నది.


ఆర్యులు ప్రపంచ మంతటను వ్యాపించిరని చెప్పుట కిది ప్రబల నిదర్శనము. జంబూద్వీపములో సముద్రము లేదు. అంతయు భూభాగమే. లవణసముద్రము దానిని చుట్టియున్నది. గోళవిభాగములో లవణ సముద్రము దక్షిణార్ధ గోళములోనికి పోయినది. ప్రాచీన ఋషులు జంబూద్వీపమును, దానిలోని వర్ష విభాగమును సరిగా భూగోళజ్ఞానము కలిగియే చేసియుండిరి. దానిని చదివి అర్థముచేసి కొనగల శాస్త్రజ్ఞానము లేమిచే విమర్శకులు దానిని సరిగా తెలిసి కొనలేక తమ అజ్ఞానమును ప్రాచీన ఋషుల కంటగట్టుచుండిరి. ఇక నైనను విమర్శకులు తమ లోపమును గుర్తించి సవరించుకొందురుగాక!

# ప్రాచీనవర్ష విభాగములో చేరిన ప్రదేశములు

దక్షిణమునగల భారత, కింపురుష, హరివర్షములు మూడును ఆసియా ఖండములోని సైబీరియా వరకు నుండును. ఇలావృత వర్షము మేరువును చుట్టి నాలుగు ప్రక్కలను గల భూభాగము. మేరువున కుత్తరముగాగల ఇలావృతవర్ష భాగమున కుత్తరముగా అనగా అమెరికా ఖండములో చేరిన కెనడాలోని ఉత్తరభాగమును దాటగా కెనడా దక్షిణ భాగమును యునైటెడ్ స్టేట్సులో ఉత్తరభాగమును కలిపి 'రమ్యక వర్షము' 'హిరణ్యకవర్షము' లుగా గుర్తింపవచ్చును.

దాని కుత్తరముగా 'కురువర్షము' అనగా యునైటెడ్ స్టేట్సులోని దక్షిణభాగమును, మధ్య అమెరికాయును, దక్షిణఅమెరికాలోని ఈక్వే డారులోని నిరక్షరేఖ వఱకు ( ఈక్వేటరువఱకు ) గల ప్రదేశము నుగా పూర్వులచే గుర్తింపబడినది. అచ్చట నిరక్షరేఖ కుత్తరపు సరి

హద్దున (అమెరికాలోని నిరక్షరేఖకు దక్షిణపు సరిహద్దున) "సిద్ధపురి" యను పట్టణము గలదని చెప్పబడినది. దక్షిణమున లంకనుండి బయలుదేరి ఉత్తరమున అమెరికాలోగల సిద్ధపురి వఱకు పూర్వులు నవవర్ష నిర్ణయములను జేసియున్నందున అవి ఒకదానికొకటి ఉత్తరోత్తరముగా నున్నట్లు చెప్పబడినది. ఇలావృతవర్షము మధ్య మేరువుగలదని చెప్పబడియున్నందున ఇప్పుడు మనము దేనిని ఉత్తర ధ్రువమని చెప్పుచుంటిమో దానినే పూర్వులుకూడ ఉత్తరధ్రువము లేక మేరు పర్వతము అని గుర్తించియుండిరి. ఉత్తరధ్రువ మెప్పుడును మారియుండలేదు. అది గోబీఎడారిలో నున్నట్లు పూర్వులు భావించి రనుమాట సరికాదు.



నెం 3 పటము

భద్రాశ్వవర్ష మిప్పుడు పసిఫిక్ సముద్రముగా నున్నది. ఇదియే సముద్రగామి యైనదని చెప్పబడెడి 'లెమూరియా' ఖండభాగము. 'కేతుమాల వర్షము' అట్లాంటిక్కు సముద్రముగా మారినది. ఇదియే సముద్రమున మునిగిపోయినదని చెప్పుకొనబడుచుండిన "అట్లాంటిసు" భూఖండము. హిందూ మహాసముద్రమని యిప్పుడు పిలువబడుచున్న భాగ

ములో నిరక్షరేఖ కుత్తరమున గలది పూర్వ భారత వర్షములోచేరిన భూఖండము. ఇది సుమారు అయిదు కోట్ల సంవత్సరముల క్రిందట సముద్రగామి యైనది.


దీనిని నవీనులు 'గాండ్వానా' భూఖండమనియు ఇది మూడు కోట్ల సంవత్సరముల క్రిందట సముద్రగామియైన దనియును చెప్పుచు న్నారు. ఆ విషయమును గురించి ది 22-9-1946 నాటి 'The Illustrated Weekly of India" అను ఇంగ్లీషు సచిత్ర వారపత్రికలో వ్రాయబడిన విషయమునకు తెలుగు తాత్పర్యము నిచ్చుచున్నాము.

"ఇండియా ఆఫ్రికాలమధ్య ఈ రెంటిని కలుపుచు ఒక భూఖండ ముండెడిది. దాని పేరు "గాండ్వానాల్యాండు." సుమారు మూడు కోట్ల సంవత్సరముల క్రిందట ఈ భూఖండ మున్నటుల యిటీవల కనుగొన బడినది. ఆ భూఖండము మునిగిపోయి యిప్పుడు హిందూమహాసముద్ర మని పిలువబడుచున్నది."

పై విభాగమంతయు-అనగా ఆసియా, ఆఫ్రికా, యిరోపా, ఉత్తర అమెరికా, నిరక్షరేఖ కుత్తరముగాగల పసిఫిక్కు సముద్రములో మునిగి పోయిన లెమూరియా భూఖండము, అట్లాంటిక్కు సముద్రమున మునిగి పోయిన అట్లాంటిసు భూఖండము, ఇండియా ఆఫ్రికాలమధ్య హిందూ మహాసముద్రములో మునిగిపోయిన భారతవర్షములోని భాగమగు గాండ్వానాల్యాండు ఈ మొత్తము భూమియంతయు జంబూద్వీపమని-చెప్పబడినది. (నెం 3, 4 రు పటములను చూడుడు.)

"పురాణ ఋషుల ఉద్దేశములో పృథివి గోళాకారము కాదు. చక్రాకారము." అని కొందరభిప్రాయపడుచున్నారు. ఆ పురాణముల లోనే 'భూగోళ వర్ణన' మని చెప్పబడినదిగాని 'భూచక్ర వర్ణన'మని చెప్పబడి యుండలేదు. గోళశబ్ద ప్రయోగములోనే భూమి గోళాకారమని తెలియుచుండగా చక్రాకారమని వారేల యూహింపవలసివచ్చినదో తెలియకున్నది. శ్రీ భాస్కరాచార్యులవారు తమ 'సిద్ధాన్త శిరో మణి' యను జ్యోతిష గ్రంథమున ఈ విషయమున అనేక విధములుగా తర్కించి భూమి గుండ్రనిఅద్దమువలె నున్నట్లు భావింపగూడదనియు అది సమఘన వృత్తాకారమైన గోళముగా నున్నదనియు సాధించియున్నారు.

ఆ గ్రంథములో నీయబడిన యుపమానములే నవీన శాస్త్ర గ్రంథములలోగూడ నీయబడినవి. దీని వివరములు నాచే వ్రాయబడిన "బ్రహ్మాండ సృష్టివిజ్ఞానం" 'ఆర్యులసర్వతోముఖవిజ్ఞానం' అను గ్రంథములలో చూపబడినవి.




౧౦ వ పటము

దీనిలోని వివరములు:- ఇప్పుడు గుర్తింపబడిన ప్రకారము నవవర్షములు.

| | | |
|---|---|---|
| 1. భారతవర్షము | 6. భద్రాశ్వవర్షము | 11. లంక |
| 2. కింపురుషవర్షము | 7. రమ్యాకవర్షము | 12. యవకోటి |
| 3. హరివర్షము | 8. హిరణ్యాకవర్షము | 13. సిద్ధపురి |
| 4. కేతుమాలవర్షము | 9. కురువర్షము | 14. రోమకము |
| 5. ఇలావృతవర్షము | 10 ఉత్తరధ్రువము | |

పటములో చుట్టు చుట్టబడి నాలుగు వైపుల I అని గుర్తు వేయ బడిన వస్తులము నిరక్షరేఖ. దీనిని చుట్టి ౨౦౦ చిన్న యోజనములు వెడల్పుగల ఉప్పుసముద్రము గలదు.

శ్లో॥ "బ్రహ్మాండ భూర్భువాది లోక నక్షత్ర
గ్రహ తారాదయః సర్వే గోళాకారాః."
(సూర్యసిద్ధాంతము. గోళాధ్యాయము.

తా. బ్రహ్మాండము, భూలోకాదులైన పదునాలుగు లోకములు, నక్షత్రములు, గ్రహములు, తారలు మొదలైనవన్నియు గోళాకారము లుగా నున్నవి.

ఈ సూర్యసిద్ధాంతము కృతయుగము పండ్రెండు వందల సంవత్స రములు మిగిలియుండగా సూర్యదేవతవలన లంకాధిపతియైన మయుని కుపదేశింపబడి తిరిగి ప్రచారములోనికి వచ్చినది.

| | |
|---|---|
| కృతయుగశేషము | ౧,౨౦౦ సం. |
| త్రేతాయుగము | ౧౨,౯౬,౦౦౦ ,, |
| ద్వాపరయుగము | ౮,౬౪,౦౦౦ ,, |
| కలిలో ఇప్పటికి (క్రీ.శ.౧౯౫౫ సంవత్సరమువరకు) ౫,౦౫౫ ,, |  |
| | ౨౧,౬౬,౨౫౫ ,, |

ఇది ఇరువది ఒక్కలక్షల అరువది ఆరువేల రెండువందల యేబది ఐదుసంవత్సరములనుండి ప్రచారములోనున్న గ్రంధము. ప్రాచీన గ్రంధములు కాలగర్భములో లీనమగుచుండగా అట్టి సిద్ధాంతములతో గూడిన గ్రంధములు వేరువేరు పురుషులచే భిన్ననామములతో మరల మరల లోకమున ప్రచారములోనికి వచ్చుచుండును.

ఇంకను పురాణములలో నాయావర్షములందు నివసించుచుండిన మానవులనుగురించి చెప్పబడిన విషయములు ఇప్పటి అల్పాయువులు దీర్ఘరోగులగు ఈకాలపువారి కతిశయోక్తులుగ తోచవచ్చునేమోగాని ౧౯౬ కోట్ల సంవత్సరముల క్రిందటి స్వాయంభువమనువు కాలములోని మానవసృష్టినిగురించి చెప్పబడినందున ఇప్పుడు మనము వాని సాధ్యతా

సాధ్యతలను గుఱించి విచారింప నర్హతలేదు. సృష్ట్యారంభమున ౧౫౦ అడుగులకంటె హెచ్చుపొడవు, ఎత్తుగల మృగములును ఇంకను గొప్పవైన యితర జంతువులు నుండియున్నటుల భూగర్భవస్తు శాస్త్రాది పరిశోధకు లిప్పుడు విపరీత సృష్టులను జెప్పుచున్నారు. అవి నిజమని యంగీకరించినపుడు ౧౯౬ కోట్ల సంవత్సరముల క్రిందటి సృష్టిలోని పురాణ వర్ణనలు సత్యమని యంగీకరించుట కెట్టి యాక్షేపమును ఉండ కూడదు.

## అమెరికాలో రాక్షసుల అస్థిపంజరాలు

ది 20—9—47 శనివారమునాడు ప్రచురింపబడిన "జన్మభూమి" యనెడి తెలుగు దినపత్రికలో మొదటిపేజీలో పెద్దఅక్షరములతో లండన్ నుండి వచ్చిన వార్త ఈవిధముగ ప్రకటింపబడినది:—

లండన్, 20 సెప్టెంబరు 1947

అమెరికాలోని "కొలరెడో" గుహాలలో ౧౫ అడుగుల పొడుగుగల అస్థిపంజరాలు కన్పించినవి. ఈ అస్థిపంజరాలు సుమారు మొనుబదివేల సంవత్సరముల క్రిందట జీవించిన మనుష్యులవై ఉంటాయని తెలుస్తున్నది. గుహాలగోడలమీాదఉన్న చిత్రాలనుబట్టి వీరి జీవితానికి సంబంధించిన వివరాలు తెలుస్తాయని నిపుణులు భావిస్తున్నారు."

పై ప్రచురణలో అస్థిపంజరాలు కనబడిన కొలరెడో గుహాలు ఇప్పుడు యునైటెడ్ స్టేట్సులో ఉన్నవి. ఈ భాగము ప్రాచీన జంబూ ద్వీపములోని 'కురువర్షము' లో చేరినదైయున్నది. ఈ వర్షములోని ప్రజ లాకాలమున పదమూడువేల ఐదువందల సంవత్సరములు పరమాయుర్దాయము గలిగియున్నటుల పురాణములు చెప్పుచున్నవి.

ఇప్పుడు కనబడిన అస్థిపంజరములు సుమారు మొనుబదివేల సంవత్సరముల క్రిందటి మనుష్యులవైనటుల అంచనా వేయబడినది. ఎనుబదివేల సంవత్సరముల క్రిందట మనుష్యులు ౧౫ అడుగుల యెత్తుండిన ౧౯౦ కోట్ల సంవత్సరముల క్రిందట సృష్ట్యాదియందుగల మనుష్యులెంత ఎత్తు ఉండి యుండెనో యూహింపుడు.

ది 21 నవంబరు 1949 గురువారమునాడు ప్రచురింపబడిన "ఆంధ్రప్రభ" దినపత్రికలో ఈవిధముగా ప్రచురింపబడినది:—

కొల్హాపూర్, నవంబర్ 22, 1949

"ఇక్కడకు ౪౦ మైళ్ళదూరంలోగల విశాలగఢ్ వద్ద ఒక రాక్షసి అస్థిపంజరం కానవచ్చింది. దీనిపొడవు ౧౬ అడుగులు. పుర్రె చాలా పెద్దది. ఇది కొన్ని వేల సంవత్సరాల పూర్వపు జీవిగా భావించబడు తున్నది. మానుషశాస్త్రజ్ఞులు దీనిని పరిశీలిస్తున్నారు. ఈ విషయము పై తేదీగల "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" అను ఇంగ్లీషు దినపత్రికలో కూడ ప్రకటింపబడినది. పదహారు అడుగులయెత్తు అనగా కొంచె మించుమించు తాడిచెట్టుఎత్తు. దీనినిబట్టి పురాణవర్ణనలు అసత్యములు గాని, అతిశయోక్తులుగాని కావనియు అక్షరాల అందలి వర్ణనలన్నియు సత్యములని నమ్మవచ్చుననియు స్పష్టపడుచున్నది. నాలుగుకోట్ల యెని మిదిలక్షల ముప్పదియొక్క వేయి ముప్పదిఎనిమిది ఏండ్ల క్రిందట భారత వర్షమునంతను ఏకచ్ఛత్రముగా పాలించిన అంబరీషచక్రవర్తిని గుఱించి:

"సప్తద్వీప విశాల భూభరము దోస్తంభంబునన్ బూన్చి సం
ప్రాప్త శ్రీయుతుడై..." అని (ఆం. భాగ.) ఉన్నది.

ఏడుద్వీపములను ఏకచ్ఛత్రాధిపత్యమున పరిపాలించిన చక్ర వర్తులు భారత వర్షమున గలరు. వారు నిత్యకృత్యముగా విమానాది యానములతోడను, కాలినడకను, సముద్రమార్గమునను, యోగశక్తి వలనను భూగోళమునందంతటను తిరుగుచుండిరి.

దక్షిణార్ధగోళమునగల ఆఱుద్వీపములును ఆఱుసముద్రములును ఇప్పుడు లవణ సముద్రముచే నాక్రమింపబడి నామమాత్రావశేషము లైనందున భూగోళమునందు అవి మనకు గోచరింపవు.

మహాభూమియు, దానిమీదగల సప్తసముద్రములు, సప్తద్వీప ములు మొదలైన వివరములు నాచే వ్రాయబడిన బ్రహ్మాండ సృష్టి విజ్ఞానము గ్రంథమున చూడగలరు.

ఓం తత్ సత్